ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కడప

: fb.com/vaartha Digital

సభ్యులకు, ఏజెంట్లకు మరియు శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 331 పేజీలు: 10+4 వెల: 6.50




మా పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులు, ఏజెంట్లకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు.
-డా. గిరీష్ కుమార్ సంఘీ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్



## కోటి ఆశలతో కొత్త ఊసులతో మరో వత్సరంలోకి..

### వివిధ దేశాల్లో అంబరాన్నంటిన న్యూఇయర్ సంబరాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ దేశ ప్రజలు సంబరాలు మిన్నంటేలా చేసుకుంటున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కొత్త సంవత్సరంలో కోటి ఆశలతో అడుగుపెడుతున్న ప్రజానీకం ఈ కొత్త సంవత్సరం అంతా తమకు మేలే జరుగుతుందన్న ఆశలతో సంబరాల్లో తల >>2



## అభివృద్ధిలో అద్భుతాలు



### కొత్త సంవత్సరంలో ఏపిని దేశంలోనే అగ్రస్థానానికి చేరుద్దాం

### ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

### కుటుంబ సభ్యులతో విదేశ పర్యటనకు ముఖ్యమంత్రి


**విజయవాడ, డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త సంవత్సరంలో అభివృద్ధిలో అద్భుతాలు సాధిస్తామని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. 2025 రాష్ట్రాన్ని అనుహ్యంగా అభ్యున్నతి బాటలో నిలిపామన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వెళితే, తాము వికాసం వైపుకు నడిపిస్తున్నామన్నారు.స్వర్ణాంధ్ర -2047 లక్ష్యంగా మనం ముందుకు సాగుతున్నామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అన్నింటిని అమలు చేసామన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తమ కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు యాత్రకు వెళ్లారు. జనవరి 4వరకు సిఎం విదేశాల్లో ఉంటారు.ఆయన విదేశీయాత్రలో ఉంటూనే రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలపై వర్చువల్‌గా ఆరా తీస్తూ మార్గదర్శకాలు ఇస్తున్నారు.ఈ క్రమంలో ఆయన సామాజిక మాధ్యమం వేదుకగా ఎపి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రభుత్వ అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి, గ్రామస్థాయి ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పేదల ఇళ్లల్లో సంతోషం నింపేందుకు ఒకరోజు ముందుగానే పింఛన్లు ఇవ్వాలనే ప్రభుత్వ ఆలోచనను చక్కగా అమలు చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా ఇవ్వాలనేదే ప్రభుత్వ సంకల్పం. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో ప్రభుత్వం పింఛన్లను ఒక రోజు ముందు అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్లకు సంబంధించిన నగదును >>2

# కొత్త జిల్లాల్లో పాలన మొదలు

### కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, ఆర్డీఓలు, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తి

### రాష్ట్రంలో 28కి పెరిగిన జిల్లాలు

### పోలవరానికి ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా దినేష్ కుమార్, మార్కాపురానికి పి. రాజాబాబు నియామకం




**విజయవాడ, డిసెంబరు31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, ఆర్డీవోలు, సిబ్బంది నియామకాలూ సైతం జరిగాయి. నేటి(బుధవారం) నుంచే జిల్లా కేంద్రాల నుంచి పాలన మొదలవుతోంది. రెండు కొత్త జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లతోపాటు వివిధ ప్రాంతాల్లో మార్పుచేర్పులపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యు డివిజన్లు ఏర్పాటు, పలు మండలాల సరిహద్దులు మార్పులు చేర్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తుది నోటిఫికేషన్ జారీ చేసింది. సిఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా రాష్ట్రంలో 2 కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ విడుదలచేసింది. రంపచోడవరం హెడ్ క్వార్టర్‌గా పోలవరంజిల్లా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కాపురం హెడ్ క్వార్టర్‌గా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. నేటి నుంచి కొత్త జిల్లాలు అమల్లోకి వస్తాయని తుది నోటిఫికేషన్లలో తెలిపింది. 2 కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 28కి పెరిగింది. మదనపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్ ను రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారు. ప్రజలకు వేగంగా పాలన అందించడం, సుపరిపాలనే లక్ష్యంగా రాష్ట్రంలో కొత్తజిల్లాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొత్తగా 5 రెవెన్యూడివిజన్లనూ ఏర్పాటు చేసింది. పలు మండలాల సరిహద్దులనూ మార్చింది. ప్రజల కోరిక మేరకు సమీప జిల్లాల్లో కలిపింది. కొత్తగా రెవెన్యూ డివిజన్లుగా అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్, ప్రకాశం జిల్లాలో అద్దంకి, అన్నమయ్య జిల్లాలో పీలేరు, శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర, నంద్యాల జిల్లాలో బనగానపల్లి రెవెన్యూ డివిజన్లు కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేసింది.

**కొత్త జిల్లాలకు ఉన్నతాధికారుల నియామిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు**

కొత్త జిల్లాలకు ఉన్నతాధికారుల నియామిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. పోలవరం జిల్లాకు ఇంఛార్జ్ కలెక్టర్‌గా ఎఎస్ దినేష్ కుమార్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం అల్లూరి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. పోలవరం జిల్లాకు ఇన్‌చార్జ్ ఎస్పీగా అమిత్ బర్దర్ నియమించారు. ప్రస్తుతం అల్లూరి జిల్లా ఎస్పీగా అమిత్ బర్దర్ ఉన్నారు. అల్లూరి జిల్లా జెసిగా ఉన్న తిరుమాని శ్రీ పూజను పోలవరం జిల్లా ఇన్చార్జి జెసిగా నియమించారు. మార్కాపురం జిల్లా ఇన్ చార్జి కలెక్టర్‌గా పి.రాజాబాబును నియమించారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాకు రాజాబాబు కలెక్టర్‌గా ఉన్నారు. >>2

## తణుకు సహా మూడు మునిసిపాలిటీల గ్రేడ్ పెంపు

**విజయవాడ, డిసెంబరు 31, ప్రభాతవార్త ప్రతినిధి:** సత్యసాయి జిల్లాలోని కదిరి, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీలకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. గత రెండేళ్లలో ఆయా ఆదాయం, వ్యయాల్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆయా మున్సిపాలిటీలు కొత్త యేడాదిలో మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం లభించింది. రాష్ట్రం >>2

## 8న కేబినెట్ భేటీ

**విజయవాడ, డిసెంబరు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త సంవత్సరంలో ఎపి మంత్రి మండలి సమావేశం తేదీ ఖరారైంది. జనవరి 8న ఎపి కేబినెట్ భేటీ జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు సంబంధించి ఆయా శాఖలు తమ ప్రతిపాదనలను జనవరి 6వ తేదీ సాయంత్రం 4:00 గంటలలోపు సమర్పించాలని మెమో జారీ చేశారు. నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు అందజేయాలని అధికారులకు సూచించారు. కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో, శాఖలనుంచి వచ్చే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత సమా >>2

# పోలవరం 87% పూర్తి

### 18 నెలల్లో 13% పనులు పూర్తి చేశాం

### నిర్వాసితులకు ఒక్క యేడాదిలో రూ. 1894 కోట్లు విడుదల

### రెండు మూడు రోజుల్లో వెలిగొండ పనులు పరిశీలించనున్న సిఎం

### జలవనరుల సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు



బుధవారం జలవనరుల శాఖ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం పనుల పురోగతిని కళ్లుండి చూడలేని కబోదిలా వైఎస్సార్సీ పార్టీ తయారైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దుయ్యబట్టారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్‌పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్సీ కరపత్రిక సాక్షిలో పోలవరం పనుల పురోగతిపై విమర్శలు చేయడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు అధికారం ఇస్తే 2 శాతం పనులు మాత్రమే చేయగలిగారని, అలాంటప్పుడు, ఆపార్టీ పోలవరం పనుల గురించి మాట్లాడటం, విమర్శలు చేయడం విడ్డూరం కాకపోతే మరి ఏమిటన్నారు. 2014-19 హాయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోలవరం పనులు 72 శాతం పూర్తయిన >>2



## జోరుగా న్యూఇయర్ సంబరాలు

### విజయవాడ పరిసరాల్లోని రిసార్ట్‌లు, హాయ్‌లాండ్, భారీ మాల్స్‌లో యువత కేరింతలు, అపార్ట్‌మెంట్లలో కనిపించిన పండుగ ఉత్సాహం

**విజయవాడ, డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నూతన సంవత్సర ఘనంగా ప్రారంభం అయ్యాయి. కొత్త సంవత్సరానికి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు విజయవాడ ప్రజలు సిద్ధమయ్యారు. న్యూఇయర్ సందర్భంగా నగర వ్యాప్తంగా వివిధ రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళగిరి దిరీ కన్వెన్షన్ వేదికగా బాస్‌టౌన్‌ఎన్‌వైఇ 2026 భారీ ఇండోర్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు. అలాగే విజయవాడ పోరంకి మురళీ రిసార్ట్స్‌లో బాస్ టౌన్ ఎన్‌వైఇ 2026 మెగా సెలబ్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హాయ్‌ల్యాండ్‌లోను న్యూఈయర్ వేడుకలు జరుగుతున్నాయి. టాప్ సెలబ్రిటీస్, ఆర్టిస్టులు ఈ ప్రోగ్రామ్స్‌కు హాజరవుతున్నారు. సుబ్లష్నిణి, దామిని భట్ల, రాహుల్ సిప్లిగంజ్, శ్రావణ భార్గవి, ధనుంజయ్, సాహితీ చాగంటి లైవ్ షోలు కూడా నగరంలో ఉన్నారు. దీరి అనన్య అదోగ్రా, జుదీరి అకిరా హై ఎనర్జీ సెట్స్‌తో న్యూ ఇయర్ కౌంట్‌డౌన్ ప్రారంభించారు బెజవాడ ప్రజలు. మెరాకీ బ్యాండ్, కార్వాన్ టైమ్స్ లైవ్ బ్యాండ్ పవర్‌ఫుల్ మల్టీజానర్ పెర్ఫార్మెన్స్‌లు ఇస్తున్నారు.ప్రత్యేక ఆకర్షణగా అక్కీ వాటర్ డ్రమ్స్ విజువల్ షో నిలిచిందనే చెప్పాలి. ప్రీమియం స్టేజ్ డిజైన్, ఎల్ఇడి విజువల్స్, కాన్సర్ట్‌గ్రేడ్ సౌండ్ సిస్టమ్‌లతో నగరం మొత్తం మోతమోగిపోతోంది. డైమండ్ నుంచి సిల్వర్, వివిఐపి నుంచి సిల్వర్ వరకు ప్రత్యేక జోన్లు, క్యూరేటెడ్ ఫుడ్, పానీయాల కౌంటర్లు ఏర్పాటు చేశారు. 1000 నుంచి మూడు లక్షలకు పైగా న్యూ ఇయర్ వేడుకల టికెట్స్ విక్రయాలు జరిగాయి. భద్రత, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక >>2

## గిరిజన మహిళలకు న్యూఇయర్ కానుక

### సికిల్ సెల్ ఎనీమియా బాధితుల కోసం అరకులో బ్లడ్ బ్యాంకు

### డిసిఎం పవన్ కల్యాణ్ చొరవ

**విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన మహిళల్లో గర్భస్రావాలు, రక్తహీనత తదితర రుగ్మతలకు కారణమవుతున్న సికిల్ సెల్ ఎనేమియా నుంచి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో అరకు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ బ్యాంక్ భవనం ఏర్పాటుకానుంది. గిరిజన మహిళలకు నూతన సంవత్సర కానుకగా నిర్మించనున్న ఈ బ్లడ్ బ్యాంకు భవనంలో అవసరాలకి అనుగుణంగా రక్తం నిల్వ చేసుకునేందుకు వీలుగా అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. పవన్‌కల్యాణ్ చొరవతో.. దాతల సహకా రంతో నిర్మించనున్న ఈ భవనాన్ని నిర్మాణంఅనంతరం అరకు ప్రభుత్వఆసుపత్రికి అనుసంధానిస్తారు. >>2



## ఎంపిక చేసిన 'పెయిన్ కిల్లర్ల'పై కేంద్రం నిషేధం

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన పెయిన్ కిల్లర్లపై నిషేధంప్రకటించింది. వీటిలో ఎక్కువగా ఫిక్సెడ్‌డోస్ కాంబినేషన్స్(ఎఫ్డీసీ)లు అధికంగా ఉన్నాయి. భద్రతకోసమే ఈచర్యలు తీసుకున్నామని, ఓవర్‌డోస్ వల్ల దుష్ఫలితాలు ఎక్కువ వస్తున్నట్లు తేల్చింది. కేంద్ర ఔషధ ప్రామాణిక నియంత్రన సంస్థ (సిడిఎస్‌సివో), ఐసిఎంఆర్ సంస్థలు సిఫారసుచేసిన వాటిని ముందు పరిగణనలోనికి తీసుకుంది. వీటి అధిక వినియోగం మానవాళి జీవితాలకు ముప్పు తెస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 156 ఎఫ్డీసి మందులను నిషేధించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ ఇప్పటివరకూ 156 ఎఫ్డీసీల ఉత్పత్తి, అమ్మకాలపై నిషేధం విధించింది. వీటి కాంబినేషన్లు అసంబద్ధంగా ఉన్నట్లు తేల్చింది. ఎసిలోఫెనాక్ 50ఎంజి, పారాసిటమాల్ 125 కాంబో మాత్రను, మెఫెనామిక్ యాసిడ్, పారాసిటమాల్ ఇంజెక్షన్, పారాసిటమాల్, ట్రమడాల్, తౌరిన్, కాఫీన్ కాంబినేషన్లను కూడా నిషేధించింది. అలాగే డెక్స్‌ట్రాప్రోపోక్సిఫైన్ కాంబినేషన్ డోసులను అమ్మకం, ఉత్పత్తి, పంపిణీ మొత్తం నిషేధం విధించినట్లు ప్రకటించింది. 12 ఏళ్లలోపు పిల్లలకు నిమ్సులైట్ 2011నుంచి నిషేధంలోనే ఉంచింది. 2025 తొలినాళ్లలో నిమ్సులైడ్ ఫార్ములేషన్లను పశుసంవర్ధక శాఖలో వినియోగానికి నిషేధించింది. ఈ మందుల్లో మత్తు ఉత్ప్రేరకాలు ఎక్కువ ఉన్నట్లు తేల్చారు. అలాగే డైక్లోఫెనాక్‌ను కూడా పశువులకు వినియోగించకూడదని తేల్చింది.

100 ఎంజికిపైబడి మానవాళికి ఇచ్చే నిమ్సులైడ్ ఫార్ములేషన్‌లపైనా ఐసిఎంఆర్ నిషేధంప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఉత్పత్తి, ఎగుమతులు వంటివి కొన్ని ఔషధాలపై విధించింది టాపెన్‌టాడాల్, కారిసోప్రోడాల్ కాంబినేషన్లపై బ్యాన్ విధించింది. పశ్చిమాఫ్రికాలో వీటిపై నిరసనలు ఆందోళన వ్యక్తం కావడంతో ఐసిఎంఆర్ బ్యాన్‌చేసింది. పారాసిటమాల్‌మూలవనరు ఒక్కటే ఉన్న మాత్రలపై నిషేధం లేదు. భారత్‌లో వీటిని ఎక్కువ వినియోగిస్తారు. ఇవిభద్రతాపూర్వకమైనవేనని, ఎలాంటి దుష్ఫలితాలు లేవని తేల్చారు. జ్వరం, వొళ్లనొప్పులకు వీటిని నిర్దిష్టమైన డోసుల్లో మాత్రమే వాడాలి.



బుధవారం బంగ్లాదేశ్‌లో ఖలేదా జియా అంత్యక్రియలకు హాజరైన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్

# కొత్త జిల్లాల్లో పాలన మొదలు

>> మార్కాపురం జిల్లాకు ఇన్చార్జి ఎస్పీగా వి హర్షవర్ధన్ రాజు నియమించారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాకు ఎస్పీగా ఉన్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా జెసిగా ఉన్న రోనంకి గోపాల కృష్ణను మార్కాపురం జిల్లా ఇన్ చార్జి జెసిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

**సిద్ధమవుతున్న అధికారిక భవనాలు :**

మార్కాపురం నూతన జిల్లాకు తాత్కాలిక కలెక్టర్ భవనాలు సిద్ధమవుతున్నాయి. తర్లుపాడు రోడ్డులోని వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను తాత్కాలిక కలెక్టర్ కార్యాలయంగా అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన కలెక్టర్ కార్యాలయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇవాళ ప్రారంభించనున్నారు.

ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి ఏర్పాట్లు శరవేగంగా జరిగాయి. కార్యాలయం ప్రాంతాల్లో రహదారులు, పరిసరాలను శుభ్రం చేశారు. విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించారు. అక్కడ జరిగే పనులను అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మార్కాపురం జిల్లాకు ఇప్పటికే ప్రభుత్వం అధికారులను కూడా నియమించింది.



బుధవారం న్యూఢిల్లీలో 'గ్లోసరి ఆఫ్ రెవెన్యూ టరమ్స్'ను విడుదల చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

# అభివృద్ధిలో అద్భుతాలు

>> డిసెంబర్ 30వ తేదీనే బ్యాంకుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విత్‌డ్రా చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లా డీఆర్‌డీఏ పీడీలు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు..యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనే హామీలో భాగంగా ప్రభుత్వం తరపున భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు కూటమి కార్యచరణ చేపట్టిందన్నారు.. ఎన్నో అడ్డంకులను అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించింది 15491 మందిని టీచర్లుగా రిక్రూట్ చేసింది. ముఖ్యమంత్రి తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీని 2025లో అమలు చేసింది కూటమి సర్కార్. ఇదే కాకుండా... కానిస్టేబుల్ పోస్టుల నియామకాన్ని పూర్తి చేసిందని తెలిపారు. 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందచేసింది కూటమి ప్రభుత్వం. అలాగే శిక్షణ పొందే పోలీస్ కానిస్టేబుళ్లకు స్టైఫండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేసిందీ ఈ సంతవత్సరమే. ఇక గత ప్రభుత్వం వారసత్వంగా అప్పులనే కాదు.. చెత్తను కూడా అందించింది. దాదాపు 84 లక్షల టన్నుల చెత్తను ఎక్కడిదక్కడే వదిలేసి వైఎస్సార్సీ ప్రభుత్వం గద్దె దిగింది. ఈ చెత్తను పూర్తిగా తొలగించడమే కాకుండా...ఈ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేసేందుకు డిస్కంలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంది పట్టణాభివృద్ధి శాఖ. ఇక గత వైఎస్సార్సీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వేల కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ ఏడాది రోడ్ల మరమ్మత్తుల నిమిత్తం రూ.1,000 కోట్ల కేటాయించింది కూటి సర్కారు. అలాగే మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.చరిత్రను తిరగరాసేలా పారిశ్రామికాభివృద్ధిసాధించామన్నారు.

ఇక 2025 ఏడాదిలో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెట్టింది... చరిత్రను తిరగరాసే దిశగా అడుగులు వేసింది. ముఖ్యంగా ఐటీ, ఎఐ డేటా సెంటర్ తదితర రంగాల్లో కీలక పెట్టుబడులు వచ్చాయి. అడవితల్లి బాటలో తండాలకు రోడ్లు నిర్మిస్తున్నామని శివారు గ్రామాలకు 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుంకీ ఏనుగులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. అమరజీవి జలధార పేరుతో 1.21 కోట్ల మందికి దాహార్తి తీర్చేలా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.3,050 కోట్లతో ప్రాజెక్టు రూపొందిస్తున్నట్లు సిఎం తెలియజేశారు. విద్య, వైద్యం, రవాణా తదితర రంగాల్లో పరిశోధనలతో పాటు ఇతర అంశాల్లో వినియోగంకోసం ఏర్పాటు అవుతున్న అమరావతి క్వాంటం వ్యాలీకి ఈ యేడాదే అడుగులుపడ్డాయి. రూ. 50 వేల కోట్లకు పైగా వ్యయంతో అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయన్నారు.నూతన సంవత్సరంలో మనం క్వాంటం కంప్యూటస్ సెంటర్ ఏర్పాటు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు.నేడు పింఛన్లు అందుకున్న లబ్దిదారులు అందరికీ మరోసారి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రేడ్ పెంపు

>> లోని మూడు మున్సిపాలిటీలు కదిరి, తణుకు, కొవ్వూరు మున్సిపాలిటీలను అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇవాళ ఆదేశాలు జారీ చేసింది. ఈ మూడు మున్సిపాలిటీల్లో ప్రస్తుతం గ్రేడ్ 1లో ఉన్న తణుకును సెలక్షన్ గ్రేడ్‌కు పెంచారు. అలాగే స్పెషల్ గ్రేడ్‌లో ఉన్న కదిరి మున్సిపాలిటీ హోదాను సెలక్షన్ గ్రేడ్ హోదాకు పెంచారు. అలాగే గ్రేడ్ 3లో ఉన్న కొవ్వూరు మున్సిపాలిటీ హోదాను గ్రేడ్ 1కు పెంచారు. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# 8న కేబినెట్ భేటీ

>> వేశాల్లో అమలు చేసిన పథకాలపై సమీక్ష, భవిష్యత్ పెట్టుబడుల ప్రణాళికలు, ప్రధాన సదుపాయాల అభివృద్ధి, విద్యా, రోడ్లు, రవాణా, పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విభాగాల ప్రతిపాదనల ఆధారంగా కేబినెట్ సమావేశంలో ముఖ్య నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. కొత్త ప్రాజెక్టుల అనుమతులు, కీలక పదవుల నియామకాలు తదితరఅంశాలపై సమా వేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# పోలవరం 87% పూర్తి

>> విషయాన్ని మంత్రి రామానాయుడు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 13 శాతం పూర్తి చేయగలిగామన్నారు. మొత్తంగా చూస్తే పోలవరం ప్రాజెక్టు పనులు 87 శాతం పూర్తి అయినట్లు మంత్రి వివరించారు. పోలవరం పనులు పరుగులు పెడుతున్న విషయాన్ని ఆయన వివరించారు. 2027 సంవత్సరం చివరికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణ, శ్రద్ధాసక్తులతో ఈ ప్రాజెక్టు నిర్దేశిత గడువు కంటే ముందుగా, అంటే 2027 గోదావరి పుష్కరాలు నాటికి పూర్తిచేయాలని ఆయన సూచించినట్లు చెప్పారు. వాస్తవాలు ఇలా ఉండగా, పోలవరం ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తవుతుందో, అసలు పూర్తవుతుందో లేదో చెప్పలేమని అసెంబ్లీ సాక్షిగా చేతులెత్తేసిన వైయస్సార్సీ ప్రభుత్వం హయాంలోని ఇరిగేషన్ మంత్రులు, సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్ ఈరోజు మాట్లాడటానికి అనర్హులన్నారు. నాడు కేంద్రం రియంబర్స్ చేసిన 3,000 కోట్ల నిధులను మళ్లించేసి, పోలవరాన్ని ముంచేసిన ఘనుడు జగన్ అని హేళన చేశారు. జగన్ విధ్వంసం చేసిన డయాఫ్రమ్ వాల్ స్థానే నిర్మిస్తున్న కొత్త డయాఫ్రం వాల్ 1032 మీటర్లు, అంటే 83 నేటికీ పూర్తి చేయగలిగామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక సంవత్సరంలోనే నిర్వాసితులకు ఏడాదిలోనే 1894 కోట్లు విడుదల చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి 2026లో అనకాపల్లి వరకు నీరు ఇవ్వబోతున్నట్లు నిమ్మల చెప్పారు. అలాగే రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పనుల పురోగతిని ఆయన వివరించారు. 2026 సీజన్ మొదలయ్యే నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసే లక్ష్యంతో తమ శాఖ పనిచేస్తుందన్నారు. జనవరి మొదటి వారంలో సిఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తారని ఆయన చెప్పారు. రూ456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులు చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. అలాగే రాయలసీమలోని హంద్రీనీవా, ఉత్తరాంధ్రలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టు లు నిర్ణీత కాల అవధిని నిర్ణయించుకుని పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయం తో ఉందని జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి పాల్గొన్నారు.

# న్యూఇయర్ సంబరాలు

>> ఫోకస్‌తో యువత, కుటుంబాలకు అనువైన హై ఎనర్జీ సెలబ్రేషన్ నైట్ నిర్వహిస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలో పోలుసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాత్రి 12గంటలకు బందర్ రోడ్‌లో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కేక్ కట్ చేయనున్నారు.

**ఎకో స్పేస్ లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు**

నగరంలోని పటమట శాంతినగర్ ఎకో స్పేస్ అపార్ట్‌మెంట్స్‌లో బుధవారం రాత్రి నూతన సంవత్సరం వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులు కుటుంబ సభ్యులతో కలిసి అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి 2026 కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. 2025 సంవత్సరానికి భారంగా వీడ్కోలు పలికారు. వేడుకల సందర్భంగా చిన్నారులు, మహిళల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుక కోసం పిల్లలు, పెద్దలు నృత్య దర్శకుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందగా, నిపుణుల స్థాయిలో ప్రదర్శనలు సాగాయి. పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించగా, మహిళల సాంస్కృతిక నృత్యాలు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. యువతీ యువకులు పాటలు, ఆటపాటలతో వేడుకల్లో ఉత్సాహం నింపారు. అపార్ట్ మెంట్ ప్రాంగణం ప్రత్యేకంగా అలంకరించిన వేదిక, విద్యుత్ దీపాల అలంకరణతో కళకళలాడగా, నివాసితులు పరస్పరం నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్దలుమాట్లాడుతూ, కొత్త సంవత్సరం అందరికీఆరోగ్యం, ఆనందం, సుఖసమృద్ధులు అందించాలని ఆకాంక్షించారు. అపార్ట్‌మెంట్ వాసుల మధ్య ఐక్యత, స్నేహబంధం మరింత బలపడేలా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు లక్ష్మి నారాయణ, ప్రభాకరరావు, ఆంజనేయులు, కవిత, రమాదేవి, జయరాణి తెలిపారు.

# ప్రజలకు డిసిఎం పవన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తు న్నామని తెలిపారు. 2026 క్యాలెండర్ ఇయర్‌లో కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని స్పష్టం చేశారు.

# గిరిజన మహిళలకు న్యూఇయర్ కానుక

>> అడవితల్లి బాట కార్యక్రమం ప్రారంభోత్సవానికి వెళ్లిన సందర్భంలో కురిడీ గ్రామంలో నిర్వహించిన మాటా మంతి కార్యక్రమంలో ఓ మహిళ సికిల్ సెల్ ఎనీమియా కారణంగా గిరిజన మహిళలు ఎదుర్కొం టున్న ఇబ్బందులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చింది. జన్యుపరంగా వచ్చే ఈ రుగ్మత గర్భిణుల ఉసురు తీస్తోందని వివరించింది. ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని ఆనాడు మాటిచ్చారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న పవన్ కల్యాణ్.. సికిల్ సెల్ ఎనీమియా నివారణ ఎలా? అనే అంశంపై వైద్య నిపుణులతో పలుసందర్భాల్లో చర్చించారు. వారసత్వంగా వచ్చే ఈవ్యాధి తీవ్రత రక్తమార్పిడి ద్వారా తగ్గించే అవకాశం ఉందన్న వారి సూచన మేరకు నూతన సంవత్సర కానుకగా బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 1,500 మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు పవన్ కల్యాణ్ నిర్ణయం ఉపశమనాన్ని ఇవ్వనుంది.

## షెడ్యూల్డ్ కులాల రుణాల లబ్ధిదారుల కోసం

# ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక సంక్షేమ శాఖ ద్వారా 11,479 మంది షెడ్యూల్డ్ కులాల రుణాలు లబ్ధిదారుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.193.40 కోట్లు (ఎన్ఎస్ఎఫ్‌డిసి) రూ.,66.04 కోట్లు (ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి) నిధులతో రుణాలు గతంలో మంజూరు చేయబడ్డాయి. ఎపి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా.. జాతీయ ఎస్సీ కార్పొరేషన్, జాతీయ సఫారీ కర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ నుంచి తీసుకున్న రుణాలపై ఉన్న వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది.తీసుకున్న రుణానికి సంబంధించిన అసలు మొత్తాన్ని 4 నెలల్లోపు చెల్లించాలి.మార్చిఏప్రిల్ 2026లోపు (ఉత్తర్వు తేదీ 31-12-2025 నుండి 4 నెలలు). ముగింపు గడువుగా నిర్ణయించారు. కోవిడ్19 మహమ్మారి ప్రభావం వల్ల లబ్ధిదారులు ఆర్థికంగా నష్టపోయి రుణాలను తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# 'పిఎం శ్రీ'పై ప్రత్యేక దృష్టి సారించాలి

## రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని సూచన

## సిఎస్‌లతో మోడీ వీడియో కాన్ఫరెన్స్

**విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** 'పియం శ్రీ' (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. వివిధ జాతీయ ప్రాజెక్టులు, పియం శ్రీ తదితర అంశాలకు సంబంధించి బుధవారం ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రగతికి సంబంధించి 50వ వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకమైన పియం శ్రీని విజయవంతంగా అమలు చేయడం ద్వారా పాఠశాలలను ఆధునికీకరించి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 (ఎన్ఇపి 2020)కి అనుగుణంగా నమూనా పాఠశాలలుగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దీని కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు,నాణ్యమైన విద్యను అందించడంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, ఆధునిక వసతులు కల్పించడం ముఖ్య లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు సమకూర్చడం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, డిజిటల్ విద్య, మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

అదే విధంగా నాణ్యమైన విద్య అందించడం ఎన్ఇపి2020 (జాతీయ విద్యా విధానం) అమలులో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందని ప్రధానమంత్రి మోడి స్పష్టం చేశారు. డిజిటల్ మరియు గ్రీన్ స్కూల్స్ అభివృద్ధి స్మార్ట్ క్లాసులు, డిజిటల్ ల్యాబ్స్ ఆధునిక సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీలు, క్రీడలు, ఆర్ట్స్, వోకేషనల్ ఎడ్యుకేషన్‌ను మెరుగు పర్చడం జరుగుతుందన్నారు. పర్యావరణ అనుకూల సదుపాయాలు (సోలార్, నీటి సంరక్షణ), విద్యార్థుల హోలిస్టిక్ డెవలప్‌మెంట్. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపికైన పాఠశాలలను పియం శ్రీ స్కూల్స్‌గా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఈ పథకం వల్ల విద్యా ప్రమాణాల మెరుగుదల, గ్రామీణ పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు లభిస్తాయని ప్రధాని మోడి స్పష్టం చేశారు. అంతేగాక భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి ఈ పియం శ్రీ పథకం ఎంతగానో దోహదం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడి పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పియం శ్రీ పథకం కింద 935 పాఠశాలలు ఎంపిక కాగా వాటిని అన్ని విధాలా మెరుగైన రీతిలో అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ సాంకేతికతతో కూడిన విద్యను అందించడం జరుగుతోందన్నారు. ఈపథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలన్నిటికి పక్కా భవనం, విద్యుత్ సరఫరా ఉండేలా చూడడంతో పాటు బాలికలు, బాలురకు వేరువేరు మరుగుదొడ్లు, సురక్షితి మంచినీటి సౌకర్యం, ప్రత్యేక హ్యాండ్ వాషింగ్ సౌకర్యం, గ్రంథాలయం, క్రీడాపరికరాలు వంటివి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదే విధంగా ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్, ప్లే గ్రౌండ్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారి హాజరును చైల్డ్ ట్రాకింగ్ సాఫ్ట్ వేర్ ద్వారా ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించడం వంటి ఏర్పాట్లు చేయడం జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో పియం శ్రీ పథకాన్ని విజయవతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధానికి సిఎస్ విజయానంద్ వివరించారు. ఈవీడియో సమావేశంలో ఎస్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

01-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం, పూర్వాషాఢ కార్తె
త్రయోదశి రా.10.22, రోహిణి రా.10.47,
వర్జ్యం : రా.3.45-తె.5.11
దు.ఉ.10.20-ఉ.11.05, 2) మ.2.48-మ.3.33
శుభసమయం : ఉ.5.15-6.10, సా.6.25-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలు సానుకూలంగా ఉంటాయి.శ్రమ అధికం.

**వృషభం:** ఆర్థికంగా కొంత వెనుకబాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**మిథునం:** మిత్రులతోటి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి.

**సింహం:** రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు, మానసిక ప్రశాంతత పొందుతారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**కన్య :** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తిచేస్తారు. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. వస్త్రలాభం.

**తుల :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటి బయటా మీదే పై చేయిగా నిలుస్తుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ఒత్తిడుల నుండి బయట పడతారు.

**ధనుస్సు:** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. పాత బాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మకరం:** ఆరోగ్య సమస్యలు కొంత మెరుగుపడతాయి. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. వాహనయోగం.

**కుంభం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తి చేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.వినోదాలు పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మరో వత్సరంలోకి..

>> మునకలయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో చిన్నా పెద్దా తేడాలేకుండా కొత్త సంవత్సర సంబరాల్లో మునిగిపోయారు. ఢిల్లీ, చండీగఢ్, లక్నో, పాట్నా, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కత్తా, భువనేశ్వర్ రెండు తెలుగు రాష్ట్రాల్లోకూడా కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. భారత్‌లో 31వ తేదీ అర్ధరాత్రి దాటాక కొత్తసంవత్సరంలోకి వస్తుంటేప్రపంచంలో ఇప్పటికే కొన్ని దేశాలు నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాయి. ఆసియా పసిఫిక్‌ప్రాంతంలోని చిన్న ద్వీపకల్పం కిరిబాటి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. మన అసెంబ్లీ నియోజకవర్గం కంటే చిన్నది అయిన ఈ దేశంలోనే కొత్తసంవత్సరం 2026 ప్రారంభం అయింది. ఆ తర్వాత న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌ప్రజలు కూడా కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేకులు కోసి పంచిపెట్టుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచాలు కాల్చడం, రంగురంగుల విద్యుద్దీప కాంతులతో దేశాలన్ని ధగధగలాడిపోయాయి, హవాయికి దక్షిణం, ఆస్ట్రేలియాకు ఈశాన్యంలో ఉన్న కిరిబాటిలో జనాభా కూడా 1.16 లక్షలు మాత్రమే. కిరిబాస్ అని స్థానికంగా పిలుచుకుంటారు. 1979లోనే స్వాతంత్ర్యం పొందిన ఈ దేశంలో బాలభానుడి కిరణాలు మన దేశ కాలమానంప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకే ప్రారంభం అయ్యాయి. ఇలా ఒక్కోదేశం ఒక్కో సమయం దాటగానే నూతన సంవత్సరంలోకి ప్రవేశించాయి. ఆస్ట్రేలియాలో సాయంత్రం 6.30 గంటలకు, జపాన్, ఉత్తరకొరియా, దక్షిణ కొరియాల్లో భారత కాలమానం ప్రకారం 8.30 గంటలకు నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం అయ్యాయి, అలాగే చైనా, మలేసియా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్‌లో మన కాలమానం రాత్రి 9.30 గంటలకు, థాయిలాండ్,వియత్నాం, కాంబోడియాలు మన టైంను అనుసరించి రాత్రి 10.30 గంటలకు అక్కడ కొత్తసంవత్సరంలోకి ప్రవేశించాయి. అలాగే భారత్ తర్వాత 43 దేశాలు ఒకేసారి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతాయి. వాటిలోజర్మనీ, నార్వే, ఫ్రాన్స్, ఇటలీ లాంటి ఐరోపాదేశాలతోపాటు కాంగో, అంగోలా, కామెరూన్ వంటి ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. చిట్టచివరి దేశంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేది అమెరికా సమోవా ద్వీపదేశం మాత్రమే.

**భారీ బందోబస్తు....**

కొత్త సంవత్సర వేడుకల మాటున ఎలాంటి ఉగ్ర చర్యలు, లేదా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాట్లుచేసారు. వేలాదిమందిని నియమించి ప్రధాన రోడ్లు, కూడళ్లలో గస్తీలు ముమ్మరంచేసారు. ఎలాంటి విపత్కరపరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు వీలుగా దేశరాజధానిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేసారు. వీటికితోడు ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కూడా అప్రమత్తం చేసారు. అదేవిధంగా కొత్తసంవత్సరం అంటేనే మందు చిందులు మామూలే. పబ్బులు, రిక్రియేషన్‌క్లబ్బులు, ఫామ్ హౌస్‌లలో పార్టీలతో ఎంజాయ్‌చేయడం ఆనవాయితీ. ఈసారి కూడా మితిమీరి మద్యంసేవించి అల్లర్లకు పాల్పడితే జైలు తప్పదన్న హెచ్చరికలతో ఎక్కడికక్కడ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.

# రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 21మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 21మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఏక కాలంలో ఆదేశాలు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఒకే మండలంలో పనిచేసిన తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఇద్దరు ఆర్ఐలు, 14 మంది వీఆర్వోలు, సర్వేయరు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల మొత్తం 21 మందిపై క్రమశిక్షణా చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

2020 సెప్టెంబరు 2వ తేదీన అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) విశాఖపట్నం జిల్లా (ప్రస్తుత అనకాపల్లి జిల్లా) కశింకోట మండలంలో తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు అక్కడ పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో అక్కడ పనిచేస్తున్న తహసీల్దారు సుధాకర్ ప్రస్తుతం పదవీ విరమణ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రైవేటు వ్యక్తిని కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించారు. అతనికి నెలవారీ జీతం చెల్లిస్తున్నట్లు కూడా వెల్లడైంది. డిప్యూటీ తహసీల్దార్ (డిటి), మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) హాజరు రిజిస్టర్ నిర్వహించడంలో, పాస్‌పుస్తకాల పంపిణీ చేయడంలో, మీసేవ దరఖాస్తులు నిర్వహించడంలో విఫలమైనట్లు తేలింది. బీరువా, చేతి సంచుల్లో నగదును కూడా గుర్తించారు. పట్టాదారు పాసుపుస్తకాలను పెట్టెలో పెట్టి, రిజిస్టర్‌లో నమోదు కూడా చేయలేదు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్ని కనీసం డౌన్‌లోడ్ కూడా చేయకుండానే గడువు ముగిసే సమయంలో తిరస్కరించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాలకు కూడా నగదు వసూలు చేస్తున్నట్లు తేలింది. రికార్డులు సరిగా నిర్వహించడం లేదని గుర్తించడంతో ఆధారాలతో కేసు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. ఆకస్మిక తనిఖీల్లో నాలుగు చోట్ల క్రిమినల్ కేసులు ఎసిబి అధికారులు నమోదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి చెందిన 14 ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. నవంబరు 5, 6 తేదీల్లోను కూడా పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. గత నెలలో సిబ్బంది నుంచి అధికారులు పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎసిబి గత నెలలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల దర్యాప్తు కొనసాగించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. గత కొద్దిరోజుల కిందట విశాఖలోని కొందరు ఉద్యోగుల ఇళ్లల్లో తనిఖీలు చేయగా భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు.

సూపర్ బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న బి.ఆనంద్‌కుమార్ ఇంట్లో సుమారు రూ.కోటి విలువైన ఆస్తులను అనిశా అధికారులు గుర్తించారు. అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న త్రిపురగిరి సుధారాణి ఇంట్లో దాదాపు రూ.కోటి విలువైన స్థిర, చరాస్తుల పత్రాలను కనుగొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ మోహన రావు ఇంట్లోనూ స్థిరాస్తులు, మోటారు వాహనాలకు సంబంధించి పలు ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఎసిబి రోజంతా జరిపిన తనిఖీల్లో కొంత నగదు, బంగారు ఆభరణాలు కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# 'మనమిత్ర'లో ద్రవిడ యూనివర్సిటీ ఫలితాలు

**విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం మొట్టమొదటి సారిగా యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా విద్యార్థులకు విడుదల చేయనుంది. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు తెలియజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు సెమిస్టర్ ఫలితాలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా విడుదల చేయనున్నారు. తద్వారా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు విడుదల చేసిన మొట్టమొదటి యూనివర్సిటీగా ద్రవిడ యూనివర్సిటీ గుర్తింపు పొందనుంది. సెమిస్టర్ ఫలితాల కోసం విద్యార్థులు తమ మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నెంబరు 9552300009కు హాయ్ మెసేజ్ చేసి ఫలితాలు తెలుసుకోవచ్చని తెలిపింది.



## ద్రాక్షారామంలోని శివలింగం ధ్వంసం ఘటనపై సీఎం అసహనం

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** పంచారామ క్షేత్రంలో ఒకటైన ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయం బయట స్వామివారి కొలను వద్దనున్న శివలింగాన్ని ఆగంతకులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. శివలింగాన్ని ధ్వంసం చేయడంపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సంఘటనపై తాను జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో పాటు జిల్లా మంత్రితో మాట్లాడినట్లు సీఎంకు మంత్రి ఆనం వివరించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షి ంచాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తు అంశాన్ని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించింది. ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర గోపురం సప్తగోదావరి నది ఒడ్డున ఉన్న కపాలేశ్వర స్వామి లింగాన్ని ధ్వంసం చేసినట్లు నిన్న ఉదయం స్థానికులు గుర్తించడంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హుటాహుటిన ద్రాక్షారామకు చేరుకుని ధ్వంసమైన శివలింగాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు రప్పించి.. ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ‘వైకుంఠ’ దర్శనానికి కొనసాగుతున్న భక్తులు



### - ఆన్‌లైన్ టోకెన్ ఉన్నవారికే దర్శనం కల్పిస్తున్న టిటిడి

**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో భాగంగా రెండవరోజు బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. ఎంతో పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ముందుగానే ఆన్‌లైన్‌లో ఇడిప్ స్లాట్ టోకెన్లు జారీచేసింది. ఈ టోకెన్లు పొందిన తెలుగు రాష్ట్రాల భక్తులేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ,ఒడిశ్శాకు చెందిన భక్తులు కూడా ఉన్నారు. వీరంతా ఆయారోజుల దర్శనాలకు సంబంధించి తిరుమలకు చేరు కుంటున్నారు. ఇలా కొండపైకి వచ్చిన భక్తులకు టిటిడి అధికారులు సాఫీగా, ప్రశాంతంగా మహాలఘులో ఏడుకొండల వెంకటేశ్వరస్వామి మూలవిరాట్టు దర్శనంతోబాటు వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా చక్కగా ఏర్పాట్లు చేశారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించిన రోజువారీగా 70వేలమందివరకు భక్తులకు దర్శనం చేయించేలా టోకెన్లు,విఐపి బ్రేక్ దర్శనాలు సమపాయం కల్పించినా సరాసరి 70వేలమంది వరకు భక్తులు శ్రీవారిని వైకుంఠద్వారంలో దర్శించుకోగలుగు తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 41వేలమంది భక్తులు మహాలఘులో వెంకన్నను దర్శించు కునేలా ఆలయ వర్గాలు చూశారు. జనవరి 1వతేదీ నూతన ఆంగ్ల సంవత్సరంలో కూడా (నేడు)తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వారం తెరచివుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తుల సంఖ్యను గమనిస్తే పదిరోజులపాటు సరాసరి 7.50లక్షలమందికిపైగా వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా స్పష్టమవుతోంది. ఇంకా తిరుమలలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనానికి భక్తులు భారీగా చేరుకుంటున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. కాగా బుధవారం సాయంత్రం టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు బోర్డుసభ్యులతో కలసి ఆలయంలోపల క్యూలైన్‌లో భక్తులను పలకరించి దర్శనం వివరాలు, కంపార్టుమెంట్లలో కల్పించిన సౌకర్యాలు, లడ్డూ కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ క్రైన్లు తనిఖీ చేశారు. స్వయంగా భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై, సేవలపై అడిగి తెలుసుకున్నారు. భక్తులు సేవలపై ఆనందం వ్యక్తం చేశారు. రోజుకు 4.80లక్షల లడ్డూలు తయారు చేస్తున్నామని, భక్తులకు అడిగినన్ని లడ్డూలు విక్రయిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. భక్తులు సంతృప్తితో స్వామివారి దర్శనం.

## రాజధాని అమరావతిలో రెండోదశ ల్యాండ్ పూలింగు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో రెండోదశ ల్యాండ్ పూలింగు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కార్యాలయ భవనాలను గుర్తించింది. గతంలో అనుభవం ఉన్న తొమ్మిది మంది కంప్యూటర్ ఆపరేటర్లను కూడా అన్ని గ్రామాలకూ కేటాయించింది. ఏడు గ్రామాల్లో తొమ్మిది యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. మూడో తేదీన నోటిఫికేషన్ ఇస్తే వెంటనే భూములిచ్చేవారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం కోసం డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తున్నారు. ఇప్పటికే నియామక ప్రక్రియ పూర్తయినా ఒకటీ అరా అభ్యంతరాలున్న నేపథ్యంలో వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా మంగళవారం తగు సూచనలు చేసినట్లు సమాచారం. నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది కార్యకలాపాలు వంటి అంశాలపై సూచనలిచ్చారు. ప్రతి కార్యాలయంలో ఒక స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫర్నీచర్‌ను కూడా మంగళవారం గ్రామాల్లో యూనిట్ కార్యాలయాలకు తరలించారు. నోటిఫికేషన్ అనంతరం దరఖాస్తులు తీసుకోవడం, వాటిని పాత రికార్డులతో సరిపోల్చడం వంటి పనులు నిర్వహించనున్నారు. ప్రతి దరఖాస్తుకూ సంబంధించిన సర్వే నెంబర్లను జిఐఎస్ మ్యాపులో ఉన్న సర్వే నెంబర్లు, ఫీల్డ్ సర్వే నెంబర్లు సరిపోల్చనున్నారు. వాటన్నిటినీ నిర్ధారించాల్సిన బాధ్యతను అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ల్యాండ్ పూలింగులో వచ్చిన అప్లికేషన్లలో ఉన్న విస్తీర్ణం, అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం ఒకటా కాదా అనేది ధ్రువీకరించిన అనంతరం 9.22 ప్రకటన చేయనున్నారు. గతంలో అన్నీ పూర్తయిన తరువాత సర్వే చేయడంతో కొంత ఇబ్బందులొచ్చాయి. ఈసారి ముందుగానే సర్వే కూడా పూర్తి చేయాలని అనుకున్నట్లు తెలిసింది. దీనిపై ఇంతకుముందు చేసిన అనుభవం ఉండటంతో ఈసారి ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ఉండేలా చూస్తున్నారు. దరఖాస్తులు తీసుకున్న తరువాత వాటిని సర్వేచేసి ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేయనున్నారు. 9.3 దరఖాస్తులు, 9.14 అగ్రిమెంటు ఫారాలను తీసుకోవాలని నిర్ణయించారు. 9.3 తీసుకునే సమయంలో అందరికీ రసీదులు ఇవ్వాలా లేక 9.14 చేసుకున్న తరువాత ఇవ్వాలా అనే అంశంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. వీటితోపాటు పూలింగుకు భూములిచ్చిన రైతుల బ్యాంకు అకౌంట్లు.. ఆధార్ లింకు అంశాలను తనిఖీ చేయాలని నిర్ణయించారు. గతంలో జరిగిన పొరపాట్లు వల్ల చాలా వరకూ పదేపదే తనిఖీలు చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం జరగబోయే పూలింగులో ఇటువంటి ఇబ్బందులేవీ తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యతను ఎస్‌డిసిలకు అప్పగించారు. రెండోదశ పూలింగులో పెదపరిమి రెవెన్యూలో రెండు, వడ్డమాను, వైకుంఠపురం, హరిశ్చంద్రాపురం, పెదమద్దూరు, చావపాడు, యండ్రాయి, కర్లపూడిలేమల్లెలో మొత్తం తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.



## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,డిసెంబరు 31,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలందరికీ 2026 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం,ఆనందం, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టిగల నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి అన్నారు.పాలనలో పారదర్శకత,ప్రజల అవసరాలకు ప్రాధాన్యం,సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య,వైద్య,మౌలిక సదుపాయాలు, ఉపాధి రంగాల్లో సీఎం పాలనలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. రైతులకు ఆర్థిక భరోసా,యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, పేదలకు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు.ప్రజల సహకారంతో 2026సంవత్సరం రాష్ట్రానికి స్వర్ణయుగంగా మారుతుందని,సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తంచేశారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించే ‘కౌశలం’

### 24 లక్షల మందికి ఉపాధి కల్పించే దిశలో పోర్టల్

### నాలుగు నెలల్లోనే ఉద్యోగాలు లభించే అవకాశం

**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించే దిశలో ఏపీ ప్రభుత్వం కార్యచరణను చేపట్టింది.ఇంజినీరింగ్ పూర్తి వచ్చే విద్యార్థులకు,ఇప్పటికే ఇంజినీరింగ్ చేసి ఉన్నవారికి నాలుగు నెలల్లో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ఒక ఐటీ శాఖ ప్రణాళిక రూపొందించింది. అర్హతలను బట్టి అభ్యర్థులు, కంపెనీలు, జాబ్ అగ్రిగేటర్లకు వారధిలా కౌశలం పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. కౌశలంపై ప్రచారానికి జనవరి మొదటి వారంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పుణె, ఢిల్లీ నగరాల్లో రోడ్ షోలు నిర్వహిస్తాం. ఐటీ కంపెనీలు, అగ్రిగేటర్లకు పోర్టల్ గురించి వివరిస్తాం. ఆయా కంపెనీల హెచ్ఆర్ మాడ్యూల్, ఐటీ శాఖ మాడ్యూల్‌ను అనుసంధానిస్తున్నాం. తద్వారా పోర్టల్‌లో డేటాను కంపెనీలు సులువుగా వాడుకోవచ్చు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) డేటాతోనూ పోర్టల్‌ను అనుసంధానిస్తాం. దీనివల్ల కౌశలం పోర్టల్‌లో నమోదైన వారికి ఏదైనా కంపెనీ, అగ్రిగేటర్ ఉద్యోగం కల్పిస్తే, ఆ సమాచారం అందుతుంది‘ అని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని తెలిపారు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, నిరుద్యోగులుగా ఉన్నవారిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. సాంకేతిక నైపుణ్యాలు లేనివారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. స్కిల్ కంపెనీలనూ పోర్టల్‌కు అనుసంధానించి, వారిద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో నైపుణ్య శిక్షణ ఇప్పిస్తారు. రానున్న 4 నెలల్లో ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టనుంది. తర్వాత వారికి కంపెనీలతో నేరుగా మాట్లాడుకునేలా చూస్తుంది. పోర్టల్‌లో రిజిస్టరైన కంపెనీలు, అగ్రిగేటర్లతో సంక్రాంతి తర్వాత ‘ఐటీ జాబ్ ఫెయిర్’ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కౌశలం డేటాబేస్‌లోని అభ్యర్థులకు ఈ ఫెయిర్‌లోనే కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించవచ్చు. అర్హులకు అక్కడికక్కడే ఉద్యోగాలు ఆఫర్ చేయొచ్చు. ఇంజినీరింగ్ పూర్తిచేసి, చిరుద్యోగులుగా, నిరుద్యోగులుగా ఉన్న సుమారు 24 లక్షల మంది సమస్త సమాచారాన్ని అందులో ఉంచింది. నిరుద్యోగ యువత వివరాలను ఆర్టీజీఎస్‌లోని డేటాలేక్ ద్వారా సేకరించి, క్షేత్రస్థాయిలో అధికారులు ఇప్పటికే పరిశీలించారు.రాష్ట్రంలో ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎక్కడా ఉపాధి లభించని, ఒకవేళ ఉద్యోగం చేస్తున్నా అర్హతకు తగని వృత్తి(అండర్ ఎంప్లాయిమెంట్)లో ఉన్నవారిని ఐటీ శాఖ గుర్తించింది. ఆ వివరాలను ‘కౌశలం’లో అందుబాటులో ఉంచింది. ప్రైవేటు కంపెనీలు తమ అవసరాలకు సరిపడా స్కిల్స్ ఉన్నవారిని అందులోంచి ఎంపిక చేసుకోవచ్చు. ఉద్యోగాలు కల్పించే కంపెనీలు, నైపుణ్య శిక్షణ ఇచ్చే సంస్థలు, టెస్టింగ్ ఏజెన్సీలు, అభ్యర్థులు, అగ్రిగేటర్లను ఒకే వేదికపైకి తెచ్చేలా ప్రభుత్వమే ఓ సంస్థను ఏర్పాటు చేయడం విశేషం. పోర్టల్‌లో ఇంకా నమోదుకాని వారుంటే, నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చు. పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ ఐటీ శాఖ ఒక లాగిన్‌ను కల్పించింది. అందులో వారికి ఓ వెబ్‌పేజీ ఉంటుంది. లాగిన్ కాగానే సిస్టమ్ జనరేటెడ్‌గా వచ్చే హోంపేజీలో అభ్యర్థి, తండ్రి పేరు, కమ్యూనికేషన్ అడ్రస్, ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నంబర్, విద్యార్హతలు, ధ్రువీకరణ పత్రాలు, కోర్సు ఉత్తీర్ణులైన సంవత్సరం.

# తిరుమల సమాచారం

## వైకుంఠద్వాదశిన చక్రత్తాళ్వార్‌కు పవిత్ర చక్రస్నానం

### - పుణ్యస్నానాలతో పునీతులైన భక్తులు



**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి పర్వదినాన బుధవారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో చక్రత్తాళ్వార్ చక్రస్నాన మహోత్సవం జరిపించారు. బుధవారం తెల్లవారు జామున విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలా చరించారు. శ్రీభూవరాహ స్వామి ఆలయం ముఖమండపంలో శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం చేశారు. అనంతరం వివిధ పాశురాలను చిన్నజియ్యర్‌స్వామి పఠించారు. చక్రస్నానసమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు. శేషాచలంలోని 66కోట్ల తీర్థాలలో స్వామివారి పుష్కరిణి అత్యంత పవిత్రమైనది.ఈ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు పాల్గొన్నారు.

## వైకుంఠద్వాదశిన పరిమితంగానే విఐపిలకు దర్శనం



**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాల్లో రెండవరోజు ద్వాదశిన బుధవారం వేకువజామున పరిమితంగానే ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు కల్పించారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా రావడంతో వారితోబాటు మరో ఐదుమందికి వైకుంఠద్వార దర్శనాలు చేయించారు. బుధవారం ఉదయం ఎంపి మాగుంట శ్రీనివాసులు,ఎంఎల్ఎ డి.జనార్ధన్, సినీనటుడు శ్రీనివాస్‌రెడ్డి, నటి అంజలి, దర్శకుడు మారుతి తదితరులు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. తొలిరోజు వైకుంఠ ఏకాదశిన అర్ధరాత్రివరకు 67,053మంది భక్తులకు దర్శనం చేయించారు. హుండీ ఆదాయం 2.25కోట్లు చేకూరింది.అయితే వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ప్రణా ళికాబద్ధంగా ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు జారీచేయడంతో రోజుకు 70వేలమంది భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. రేపటి నుండి సాధారణ సర్వదర్శనంలో సామాన్య భక్తులందరికీ వైకుంఠద్వార దర్శనాలు చేయించేలా పటిష్టంగా ఏర్పాట్లు చేశారు. ఈ దర్శనాలపై భక్తులను అను మతించే విషయంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, టిటిడి ఆలయడిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయవర్గాలు ప్రణాళికా బద్ధంగా చూడనున్నారు.

## టిటిడి విద్యాదానట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలైన భక్తులు భారీగా విరాళాలంది స్తున్నారు. పవిత్రమైన వైకుంఠద్వాదశిన బుధవారం ఉదయం గుంటూరుకు చెందిన విజ్ఞాన్స్ సంస్థల అధినేత లావు రత్తయ్య శ్రీవేంకటేశ్వర విద్యాదానట్రస్ట్‌కు కోటి రూపాయలు విరాళం అందించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి ఈ విరాళం డిడిని అందజేశారు. దాతను ఛైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు.

## టిటిడి పథకాలకు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. బెంగుళూరుకు చెందిన ఎస్పీమైక్రోసర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం సాయంత్రం బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి 10,07,777 రూపాయలు డిడిని, తమిళనాడు రాష్ట్రం శివకాశికి చెందిన స్టాండర్డ్ మ్యాచ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవేంకటేశ్వర గోసంరక్షణట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిని విరాళంగా అందించారు.

### ఎస్వీగోశాలకు ఎండు గడ్డి విరాళం

**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని తిరుపతిలోని ఎస్వీగోశాలలో ఉన్న గోవులకు అవసరమైన ఎండుగడ్డిని టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ విరాళమిచ్చారు. 8లారీల ఎండుగడ్డిని ఎస్వీగోశాల డైరెక్టర్ డాక్టర్ ఏవిఎస్ శివకుమార్‌కు బుధవారం అందజేశారు. తన కుటుంబసభ్యులతో కలసి జ్యోతులనెహ్రూ పశుగ్రాసాన్ని ఎస్వీగోశాల డైరెక్టర్‌కు అందించి, మూగజీవులకు ఆహారం అందించాలనే సంకల్పంతో కాకినాడ నుండి పశుగ్రాసాన్ని శ్రీనివాసా సేవాట్రస్ట్, జ్యోతుల నెహ్రూ ట్రస్ట్ నుండి తీసుకువచ్చి ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. టిటిడికి చెందిన మూడు గోశాలలకు ఎండుగడ్డిని త్వరలో అందజేస్తామని తెలిపారు. పలమనేరులోని గోశాలకు కూడా పంపాలని కోరారు.

## టిటిడి కొనుగోళ్ల వ్యవహారాలపై అవగాహన లేదు

### - నెయ్యిసరఫరాలో అవకతవకలపై ఎలాంటి సమాచారం లేదు : టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి




**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో తాజాగా సిబిఐ సిట్ అధికారులు మళ్ళీ దర్యాప్తు కొనసాగిస్తున్నారు .కల్తీ నెయ్యి వ్యవహారంలో బుధవారం ఉదయం నెల్లూరులోని ఆమె నివాసంలో సిట్ అధికారులు వెళ్ళి ఎంఎల్ఎ, టిటిడి బోర్డు సభ్యురాలు(గత పాత బోర్డులోనూ సభ్యురాలుగా కొనసాగిన)వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని విచారణ చేశారు. సుదీర్ఘంగా ఆమెను పలు అంశాలపై విచారణ చేసి సమాచారం రాబట్టారనేది తెలుస్తోంది. గత బోర్డులో నాలుగునెలలపాటు టిటిడి కొనుగోళ్ళ కమిటీలో సభ్యురాలిగా ఆమె కొనసాగారు కూడా. తనకు టిటిడి కొనుగోళ్ళకు సంబంధించిన వ్యవహారంలో పూర్తిగా అవగాహన లేదని చెప్పినట్లు సమాచారం. ఇప్పుడు కల్తీనెయ్యి వ్యవహారంలో మళ్ళీ దర్యాప్తు జోరుగా మొదలుపెట్టారు. సిట్ అధికారులు బుధవారం ఉదయం నెల్లూరులోని ఆమె ఇంటికి చేరుకుని ప్రత్యేక బృందం పూర్తిగా రోజంతా సుదీర్ఘంగా ప్రశ్నలు సంధించారు. టిటిడిలో ఆమె బోర్డు సభ్యురాలుగా పాత్ర, కొనుగోళ్ళ విధా నాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆమె బోర్డు సభ్యురాలుగా కొనసాగి కొనుగోళ్ళ కమిటీలోనూ నాలుగునెలలుపాటు సభ్యురాలిగా ఉన్నట్లు తేల్చారు. ఆ సమయంలో కమిటీ పనితీరు, మిగిలిన సభ్యులు గురించి ఆరాతీసి కొంత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. కొనుగోళ్ళపై ఎవరి నిర్ణయాలు మేరకు ఆమోదం తెలిపేవారని సమాచారం సేకరించడం విశేషం. టిటిడిలో కొనుగోళ్ళ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో తాను కలుగజేసుకోలేదని, అవగాహన లేదని చెప్పినట్లు తెలిసింది. ఆరున్నరేళ్ళక్రిందట జరిగిన విష యాలను ఇప్పుడు గుర్తుచేసుకోవడం కష్టమని కూడా ఆమె సిట్ అధికారులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. నెయ్యి సరఫరాలో అవకతవకలు గురించి అప్పట్లో తనకు ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేయడం విశేషం. ఇప్పుడు సిట్ దర్యాప్తులో ఇంకెందరి పేర్లు తెరపైకి రానున్నాయనేది మాత్రం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

## సిఎం చంద్రబాబు ఎసిబి కోర్టు తీర్పు పత్రాలు వెల్లడించాలంటూ హైకోర్టులో పిటిషన్

### - కేసు వివరాలను సమర్పించమని రాష్ట్ర సిఐడికి హైకోర్టు ఆదేశాలు

**విజయవాడ,డిసెంబరు 31, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై గతంలో నమోదైన కేసుల తీర్పు ప్రతులను పొందేందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన విన్నపాన్ని కోర్టు తిరస్కరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించమని ఏపీ సీఐడీని హైకోర్టు ఆదేశించింది. అనంతరం, విచారణను వారం రోజుల వరకు వాయిదా వేసింది. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ సంబంధిత కేసులు నమోదు చేసింది. వీటిలో ఫైబర్ నెట్ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు రద్దు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కూడా సీఐడీ ‘మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్’ని కారణంగా చూపుతూ నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో, సువర్ణరాజు ఈ కేసుల రికార్డులు, తీర్పు ప్రతులను తనకు అందించమని అడిగినా, ఏసీబీ కోర్టు నిరాకరించింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

## నరేగా చట్టాన్ని మార్చి కేంద్రం పేదల పొట్టకొడుతోంది: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ,డిసెంబరు 31,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషితో, కాంగ్రెస్ హయాంలో ఈ చట్టానికి బీజం పడిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. గత 20 ఏళ్లలో ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్లు నిధులు వచ్చాయని, పేదలకు అండగా నిలిచిన ఈ పథకానికి మోదీ ప్రభుత్వం ఖివీబీ జీ రామ్ జీఖి పేరుతో తీసుకొచ్చిన కొత్త చట్టం తూట్లు పొడుస్తోందని షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ తెచ్చిన చట్టానికి, బీజేపీ తెచ్చిన కొత్త చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు.కొత్త చట్టం ప్రకారం ఉపాధిని హక్కుగా కాకుండా, కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్చారని ఆమె మండిపడ్డారు. గ్రామసభలకు ఉండాల్సిన నిర్ణయాధికారాన్ని ఢిల్లీ చేతుల్లో పెట్టారని, 100 రోజుల పని దినాలను కుదించి, నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 60 రోజులు పని లేకుండా చేయడం, ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే పనులు కల్పించడం వంటి నిబంధనలు పేదలకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రం ఈ కొత్త విధానాన్ని తెచ్చిందని విమర్శించారు.

## మరింత విస్తృతంగా హిందూ ధర్మప్రచారం

### - సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మప్రచారాన్ని మరింత విస్తృతంగా చేపట్టాలని, ఇందుకు ప్రణాళికలు రూపొందించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆదేశించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో, ఎస్సీఎస్టీ వెనుకబడిన కాలనీల్లో హిందూ ధర్మం గురించి మరింతగా ప్రచారం చేయాలని సూచించారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, టిటిడి బోర్డు సభ్యులు జానకిదేవి, నరేశ్‌కుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్ ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.


MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
Kakinada Municipal Corporation

'e' PROCUREMENT TENDER NOTIFICATION

Roc.No. 8977/2025/E4, Dt: 30-12-2025

Tenders invited through ap e procurement platform for **28 works with an estimated cost value of Rs. 411.61 Lakhs** from the eligible contractors.

**Last date and time for downloading for 13 works: Dt 20-01-2026 upto 10-00 AM**
**Last date and time for downloading for 15 works: Dt 27-01-2026 upto 10-00 AM** Further details can be seen at 'e' procurement market place @ **www.apeprocurement.gov.in**

**Request for Proposal (RFP) - Offline Tenders**

Kakinada Municipal Corporation invites offline tender Request for proposal from interested Agencies/Firms/Companies/ Individuals for

1. Beautification, Operation and Maintenance of Street Lighting Infrastructure and Traffic Safety Works for Jagannaickpur and NTR Bridges under Build-Operate- Transfer (BOT) Model in Kakinada Municipal Corporation.

| | |
|---|---|
| RFP issue Start Date and Time | : 01-01-2026 11.00 AM |
| Pre-Bid Meeting Date and Time | : 05-01-2026 at 04.30 PM |
| RFP issue End Date and Time | : 07-01-2026 up to 5.00 PM |
| RFP document receiving Date and Time | : 08-01-2026 up to 5.00 PM |
| Opening of Technical Bids Date and Time | : 09-01-2026 at 11.00 AM |

2. Development, Operation, Training and Skill Development for Water Sports, Kayaking Club and Allied Activities in the Boat Club Park of Kakinada Municipal Corporation under Public Private Partnership (PPP) Mode
3. Development, Operation, Training and Skill Development for Water Sports, Kayaking Club and Allied Activities in the Vivekananda Park of Kakinada Municipal Corporation under Public Private Partnership (PPP) Mode
4. Development, Operation & Maintenance of Theme Park (Sri Inti Satyanarayana Memorial Park) in Kondayyapalem Stretch Kakinada, under Public-Private Partnership (PPP) Mode in Kakinada.
5. Development, Operations & Maintenance of Convertible Indoor Stadium and Park at Suresh Nagar, Kakinada on Public Private Partnership (PPP) mode in Kakinada Municipal Corporation
6. Establishment, Operation & Maintenance of Kayaking Club and Water Sports Training Centre with Allied Activities in an extent of four (04) Acres at NTR Beach, Kakinada on Public Private Partnership (PPP) mode at Suryaraopeta in Kakinada Rural.

Interested agencies who is having financial capability and technical competency to perform this assignment may offer their bid and the detailed Request for Proposal (RFP) document can be obtained from the O/O Superintending Engineer, Kakinada Municipal Corporation by paying Rs 10,000/- for each individual work in **Sl No. 1 to 5** which is non- refundable in the form of DD drawn in favor of the Commissioner, Municipal Corporation at any Nationalized Bank payable at Kakinada., for work in **Sl No.6** pay Rs. 10,000/- non-refundable in the form of DD drawn in favor of The Managing Director, Kakinada Smart City Corporation Limited.

| | |
|---|---|
| RFP issue Start Date and Time | : 01-01-2026 11.00 AM |
| Pre-Bid Meeting Date and Time | : 12-01-2026 at 04.30 PM |
| RFP issue End Date and Time | : 20-01-2026 up to 5.00 PM |
| RFP document receiving Date and Time | : 21 -01-2026 up to 5.00 PM |
| Opening of Technical Bids Date and Time | : 22-01-2026 at 11.00 AM |

For any Queries Contact: O/O Superintending Engineer, Kakinada Municipal Corporation in working hours.

**Mobile No: 9959799135, 9849906516, Mail: kmcengineeringsection@gmail.com**

Sd/- xxxxxx,
Commissioner(FAC), Municipal Corporation, Kakinada

వార్త


మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. ఒక ఆశ నెరవేరితే మరొకటి ఉంటుంది. జీవితమే ఆశల వల. అదే దు:ఖానికి కారణం.

-సెసిల్

# పటిష్టమైన విత్తన చట్టమే పరిష్కారం


బాధపడుదే తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళన బాటపడుతున్నారు. తమకు ఎంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లికుళ్లి మనసులో బాధపడి చివరకు ప్రాణత్యాగం చేయడానికి కూడా సిద్ధపడతారే తప్ప తమను దగాచేసిన వారిపై కక్షకట్టి దాడులు చేసేందుకు సాహసించలేకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా, దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా సకాలంలో యూరియా లాంటిఎరువులు సరఫరా చేయడంలో పాలకపెద్దలు విఫలమైనా నకిలీ, నాసిరకం క్రిమిసంహారక మందులతో మోసపోయినా తమ కర్మకు తాము బాధపడుతూ మనోరోదనతో ఇంటిముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు, నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.అవి అక్కడక్కడ సమస్యలు వచ్చినప్పుడు జరుగుతున్నాయే తప్ప సంఘటితంగా జరుగుతున్న సంఘటనలు లేవనే చెప్పొచ్చు. ఆరుగాలం అష్టకష్టాలుపడి పండించి తెచ్చిన పంటను అమ్ముకోవడంలో వారుపడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దేశవ్యాప్తంగా పరిశీలించినా అధికశాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలు నిర్ణయించడంలో దగా, ఒక్కటేమిటి ఎక్కడవీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచిఉంటూనే ఉన్నారు. రైతులు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంతకాలం మోసం చేసేవారు ఉంటారన్నట్లు ఈ దళారీ వ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నిస్థాయిల్లోనూ దగా జరుగుతున్నది. దీనిని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. వ్యవసాయానికి మూలం విత్తనాలు. ఆ విత్తనాలే నకిలీ, నాసిరకమో అయితే రైతులు కుప్పకూలిపోతున్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేసి రైతులను దగా చేసిన వారిని ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తేలేదని, పిడి చట్టాన్ని ప్రయోగించి కటకటలా వెనక్కి పంపేందుకు వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నా ఈ నకిలీ విత్తనాల వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. యేడాది యేడాదికి ఈ నకిలీ విత్తన వ్యాపారులు దేశవ్యాప్తంగా ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో అంతకంతకు పెరిగిపోతున్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైన పత్తి, మిరప లాంటి విత్తనాలతో మోసపోయినప్పుడు రైతులు కోలుకోలేకపోతున్నారు. కూరగాయలకు సంబంధించిన నకిలీ విత్తనాలకు అదుపే లేకుండాపోతున్నది. రసీదులు, బిల్లులు లాంటి ఎలాంటి ఆధారాలు లేకుండా వేలాది క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లోకి తెప్పించుకొని ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అన్నదాతలనే సముదాయించి రాజీమార్గాలను అన్వేషిస్తున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఈ నకిలీ వ్యాపారం జరగడంలేదు. అన్ని నగరాల్లోనూ, పట్టణాల్లోనూ బహిరంగంగానే జరుగుతున్నది. మొన్న ఖరీఫ్‌లో కూడా భారీఎత్తున ఈ నకిలీ విత్తనాలు రైతులను నిలువునా ముంచాయి. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా విత్తనాల కొరత దృష్ట్యా ఈనకిలీ వ్యాపారులపై ఆధారపడడం తప్పడం లేదు. ఈ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావడం లేదు. పోలీసులన్నా, చట్టాలన్నా, వ్యవసాయ శాఖ అధికా రులన్నా భయభక్తులు లేకుండాపోయాయి. ఇందుకుఇతర కారణాల కంటే అసలు విత్తన చట్టమే రైతులకంటే దళా రులకే ప్రయోజనకరంగా ఉండడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. కొత్త పటిష్టమైన చట్టం కావాలని రైతులు ఏనాటి నుంచో కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఎట్టకేలకు ఇటీవల కేంద్రప్రభుత్వం ఈ చట్టంలో మార్పులు తెచ్చేందుకు ప్రయత్నాలు ఆరంభించింది.ఈ మేరకు దేశవ్యాప్తంగా అభిప్రాయాలు సేకరిస్తున్నది. వాస్తవంగా మన దేశంలో విత్తనచట్టం 1966 నాటిది. 1983లో విత్తననియంత్రణ ఉత్తర్వులను అప్పటి కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. పర్యావరణాన్ని పరీక్షించాల్సిన చట్టం 1986లో తీసుకువచ్చారు. ఎన్నిచట్టాలు తెచ్చినా, మరెన్ని నిబంధనలు విధించినా అవి విత్తన కంపెనీలకు, మరికొందరు దళారులకు ప్రయోజనకరంగా ఉన్నాయనే విమర్శలు ఏనాటి నుంచో ఉన్నాయి. మన దేశంలో అసలు విత్తనాలు ఎలా తయారు చేస్తున్నారు? వారికున్న వనరులు ఏమిటి? సిబ్బంది ఎంత?తదితర వివరా లేమీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, పర్యవేక్షించకపోవడంతో ఈ దురదృష్టపు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విదేశాల్లో విత్తనాల మోసాలను పకడ్బందీగా నియంత్రించడమే కాదు, రైతులను మోసగిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. చైనా లాంటి దేశంలో వారు తీసుకుంటున్న చర్యల కారణంగా నకిలీ, నాసిరకం విత్తనాలు లేకుం డాపోయాయి. ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తున్నది. మనదేశంలో ఆ పరిస్థితులు లేవు. దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో అధికశాతం విత్తనాల్లో మోసపోయినవారే ఉన్నారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని వాచావాత్సల్యమే కాదు కావల్సింది చేతల్లో చూపాలి. అందుకు ముందుగా రైతులకు రక్షణగా ఉండే విత్తన చట్టమే ఈ సంక్షోభానికి కొంత పరిష్కారం.

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.




ఎడ్వర్డ్

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ

కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితులలోను గ్రామీణ రైతులకు, పని చేసేవారికి బువ్వ పెట్టింది ఉపాధి. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు ఉపాధిహామీనే ఒకముఖ్యమైన మూల స్తంభంగానిలిచింది అయితే ఇప్పుడు తెచ్చిన బిల్ రాష్ట్రాల పైన కొంత భారం మోపుతున్నాయి. వాటిని తెలంగాణ లాంటి రాష్ట్రాలు ఎలా ఎదురుకోవాలి? అంటే తెలంగాణ లాంటి రాష్ట్రాలు ముందు ఒక సలహా సంఘాన్ని ఫామ్ చేయాలి. అంత మాత్రమే కాదు గ్రామాలలో ఎక్కువగా కమ్యూనిటీ మొక్కల పెంపకంను చేపట్టాలి. దీనివల్ల ఎక్కువమంది ఒకే దగ్గరపనిచేయడానికి వీలు అవుతుంది. ఆ కమ్యూనిటీ స్థలాలలో పండ్ల తోటల పెంపకం, కురగాయాల పెంపకం చేపట్టాలి. చిన్నగ్రామ పంచాయతీలకుఆర్థికదన్నుగా అదిఉపయోగపడుతుంది. ముఖ్యంగా నీటి కుంటల నిర్మాణం చేసి, చేపల పెంపకం చేపట్టాలి.

- భారత అవినాష్, జనగామ

### నిబంధనలతో ఎండిపోతున్న రైతు

వ్యవసాయాన్నిఆదుకోవాలనే లక్ష్యంతోరూపొందిన మద్దతు ధరవ్యవస్థే నేడు రైతుకు భారంగా మారుతోందాఅన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సోయాబీన్‌రైతుల విషయంలో నాఫెడ్ అమలు చేస్తున్న నాణ్యతా నిబంధనలు ఈ సందేహాలకు బలం చేకూరుస్తున్నాయి.అకాలవర్షాల కారణంగా పంట తడిసి రంగు మారిందన్న కారణంతోనే ప్రభుత్వ కొనుగోళ్ల నుంచి రైతులను దూరం పెట్టడం ఎంతవరకు సమంజసం?రైతు పంటను పండిస్తాడుగానీ వర్షాన్ని ఆపలేడు. ప్రకృతి ప్రతికూల పరిస్థితుల వల్ల వచ్చిన నష్టానికి రైతునే బాధ్యుడిగా చేయడం విధానపరమైన లోపమే. వ్యవసాయం లాభసాటిగా లేకపోతే రైతు వ్యవసాయాన్ని వదిలివేయడం తప్ప మరొక మార్గం ఉండదు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### తీవ్ర శిక్షలు పడాలి

ఇండియాలో ప్రతిఎనిమిది నిమిషాలకు ఒకచిన్నారి తప్పిపోతున్నట్లు అంచనా. వాళ్లల్లో చాలా మంది ఆచూకీ ఎప్పటికీ తెలియట్లేదు. అభం శుభం తెలియని పిల్లలను అపహరించి సొమ్ము చేసుకుంటూ, కన్నవారికి గర్భశోకం మిగుల్చుతున్న కిరాతకుల్ని కనిపెట్టి, కటకటాల వెనక్కి నెట్టి, తీవ్ర శిక్షలు పడేలా చేయాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

### ప్రమాదకరంగా ప్లాస్టిక్

ప్రస్తుత కాల వాతావరణం, పర్యావరణ రక్షణకు ప్లాస్టిక్,పాలిథిన్ సంచుల విపరీత వినియోగం చాలా ప్రమాదకరంగా ఉన్నది.ప్రభుత్వం లేక సంస్థలు వాటివాడకం తగ్గించాలని ప్రచారం బాగానే ఉంటోంది. విక్రయాల్లో వాడిన వారు వారి వ్యాపారం కోసం వాడకం జరుగుతున్నది. ప్రజలు సదుపాయం కోసం తెలిసినా వాడుతున్నారు. సంచుల విషయంలో ప్రత్యామ్నాయ ఇతర పదార్థాలతో చేసిన ఉత్పత్తులను కేవలం కొన్ని చోట్ల స్వల్పంగా ప్రదర్శనలేక పరిచయం వరకే పరిమితం అవుతున్నది. పూర్తి స్థాయిలో పరిష్కారంకోసం కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ఈ కొత్తరకం సంచులు లేక మెటీరియల్ తయారీని దేశస్థాయిలో పెంచాలి. ఉత్పత్తి కోసం పరిశ్రమలను ముందుకు వచ్చే వారికి ప్రోత్సహిస్తూ వారికి అమ్మకం కోసం రాష్ట్రప్రభుత్వాలు ద్వారా మార్కెట్‌ను పెంచాలి. దీనికి ఇతరశాఖల ద్వారా ప్రజాప్రకటన ఇస్తే తప్పనిసరిగా ప్రజలు వాటినేకొంటారు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### కాలుష్య కోరల్లో ఢిల్లీ

దేశరాజధాని ఢిల్లీ మరోసారి వాయుకాలుష్య కోరల్లో చిక్కుకుంది. ప్రతి ఏడాది శీతాకాలం ప్రారంభంలో పొగమంచు, వాహనాల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాలు, పంట అవశేషాల దహనం కలిపి నగరాన్ని ముసిరేస్తాయి. ఈసారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. పంజాబీ బాగ్ వద్ద ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)మార్క్ దాటటం ద్వారా హాజర్డస్ స్థాయికి చేరింది.అంటే,ఈగాలి పరిస్థితుల్లో సర్వసాధారణ ప్రజలు మాత్రమేకాదు, ఆరోగ్యవంతులైనా ఊపిరిపీల్చడం కష్టమవుతుంది. వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు శ్వాససంబంధ వ్యాధులున్న వారికిది ప్రాణాంతకమని వైద్య నిపుణులు హెచ్చ రిస్తున్నారు.

- కె.సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

### ప్రైవేట్ బస్సులను నియంత్రించాలి

ప్రస్తుతం రోడ్లపై ప్రైవేట్ బస్సుల సంఖ్య పెరుగుతున్నందున వాటిపై కఠినమైన నియంత్రణ అవసరం. ప్రభుత్వం, రవాణా శాఖలు ప్రైవేట్ బస్సుల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు, బీమా పత్రాలు వంటి అంశాలను నిరంతరం తనిఖీ చేయాలి. డ్రైవర్లు సరైన అర్హతలు, అనుభవం కలిగి ఉండాలి. బస్సుల సాంకేతిక స్థితి, టైర్లు, బ్రేకులు,లైట్లుమొదలైన వాటిని సమయానుకూలంగా పరిశీలించాలి.అలాగే బస్సుల్లో అధిక వేగం, ఓవర్‌లోడింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను కఠినంగా నిషేధించాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు?

**అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలు కాకుండా 450 అధ్యాపకుల పోస్టుల్ని మాత్రమే భర్తీ చేస్తారని పలు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అది కూడా కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను మిన హాయించి అంటే ఇక నిరుద్యోగులకు మిగిలే పోస్టులుఎన్ని? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో మరొకసారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినప్పుడే బడుగు, బలహీనవర్గాలకు నాణ్య మైన విద్యను అందించినట్లు అవుతుంది. కేంద్రం,యూజీసీ నుండి రావాల్సిన నిధులు కూడా సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా, ఆశ్రిత పక్షపాతం లేకుండా యూనివర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు చేప ట్టాలన్న నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అడుగులు వేయాలి. అదేవిధంగా ఇటీవలజరిగిన పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు జరి గాయన్న అంశంపై యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి.**

యం.అర్జున్

ఓయూ అంటేనే అనేక సామాజిక ఉద్యమాలకు పురిటిగడ్డ. వందేమాతర ఉద్యమం నుండి మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు సాగిన మలిదశ ఉద్యమానికి సారధి. ఇక్కడ చదివే విద్యార్థుల్లో ఎక్కువ శాతం బడుగు బలహీన వర్గాల నుండి వచ్చిన వారే. రాష్ట్రంలోని నలుమూలల నుండి నాణ్యమైన విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వస్తుంటారు. అటువంటి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయక పుష్కర కాలం దాటింది.దాదాపు 75 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో నియామకాలు ఉంటాయన్న వార్తలు నిత్యకృత్యం అయ్యాయి. కానీ కార్యరూపం దాల్చడం లేదు. ఇటీవలే ఉస్మానియా యూనివర్సిటీలో పార్ట్ టైమ్ అధ్యాపకుల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో విధి విధానాలపై స్పష్టత లేదు. ఏదో నోటిఫికేషన్ ఇచ్చామంటే ఇచ్చామన్నట్టు ఉంది. సిలబస్ లేకుండా పరీక్షల్ని నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా నిర్వహించిన పరీక్షల్లో అభ్యర్థికి వచ్చిన మార్కుల ఆధారంగా కాకుండా, హాజరైన ప్రతి ఒక్కర్ని ఇంటర్వ్యూకు పిలవడం జరిగింది. అసలు పెట్టిన పరీక్షకు ఎన్ని మార్కులు కేటాయించారు.? పీజీ, పీహెచ్‌డితో పాటు నెట్,సెట్ లాంటి వాటికి ఎన్ని మార్కులను కేటాయించారో స్పష్టత లేదు. వాస్తవానికి యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టుల్ని యూజీసీ నియమ, నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. చాలా డిపార్ట్మెంట్లల్లో పీహెచ్‌డి పూర్తి చేసి నెట్/ సెట్ వంటి వాటిల్లో అర్హత సాధించిన వారికి కాకుండా సామాజిక సమీకరణల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఉందని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఓయూ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పలు హామీలు ఇవ్వడం జరిగింది. అందులో ప్రధానంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని దాన్ని కాపాడుకోవాలని చెప్తూ అభివృద్ధికి 1000 కోట్ల రూపాయల్ని మంజూరు చేస్తూ జీవోను కూడా విడుదల చేశారు. దీంతో పాటు నియామకాల్ని బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా, కుల, మతాలకు అతీతంగా చేపట్టాలని తెలిపారు. రెగ్యులర్ పోస్టులు దేవుడెరుగు..కనీసం పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్ని కూడా కుల, మత, వర్గ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారంటే ముఖ్యమంత్రిమాటలకు తను నమ్మిన యూనివర్సిటీ అధికారులు ఇచ్చే విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీకి జీవో నం.21 తీసుకు వచ్చింది. ఈ జీవోలో వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీలతోపాటు పీహెచ్‌డికి కూడా మార్కుల్ని కేటాయించారు.



వివిధ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయిలో నెట్ ఉత్తీర్ణతకు, రాష్ట్ర స్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు కూడా మార్కుల్ని కేటాయించారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నెట్‌లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్రస్థాయిలో నిర్వహించే సెట్‌తో పోల్చితే కొంత కఠినంగా ఉంటుంది. కనీసం ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ జీవో 21 ప్రకారం పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల భర్తీ చేయకపోవడం శోచనీయం. నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. ఇలా జరగకుంటే యూజీసీ నిబంధనల ప్రకారం నెట్/సెట్, పీహెచ్‌డి వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాలులేకుండా పోతాయి. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణతతో పాటు పీహెచ్‌డి పూర్తి చేసి అధ్యాపక ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. వారికి కాదని ఇంటర్వ్యూ ప్యానెల్లో ఉన్న వారు మా కులంవాడని, మా మతం వాడని,మా ప్రాంతం వాడని, లేదా మా భావ జాలం వాడని ఇష్టం వచ్చినట్టు అభ్యర్థుల్ని ఉద్యోగాలకు ఎంపిక చేస్తే ఇక మెరిట్ సాధించిన వారి పరిస్థితి? ఇది ఇలా ఉంటే ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకుల భర్తీ కోసం తీసుకువచ్చిన జీవో 21లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలాది మంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. తెలంగాణ యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకులను భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే ప్రభుత్వ యూనివర్సిటీలు రాజకీయ నిరుద్యోగ పునరావాస కేంద్రాలుగా మిగిలే ప్రమాదంఉంది. ఇంతవరకు అన్ని వర్సిటీల్లో పూర్తి స్థాయి పాలక మండళ్లు కొలువుతీరలేదు. అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలు కాకుండా 450 అధ్యాపకుల పోస్టుల్ని మాత్రమే భర్తీ చేస్తారని పలు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి అది కూడా కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులను మిన హాయించి అంటే ఇక నిరుద్యోగులకు మిగిలే పోస్టులుఎన్ని? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో మరొకసారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినప్పుడే బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. కేంద్రం,యూజీసీ నుండి రావాల్సిన నిధులు కూడా సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా,ఆశ్రిత పక్షపాతం లేకుండా యూనివర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు చేపట్టాలన్న నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అడుగులు వేయాలి. అదేవిధంగా ఇటీవలజరిగిన పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న అంశంపై యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి. ●

# ప్రశాంత కుటుంబాలే విశ్వశాంతికి పునాదులు!

బి.మధుపాళి

డిజిటల్ యుగంలో భూమి ఓ కుగ్రామం అయింది. దేశ సరిహద్దులు రేఖలుగానే మిగిలిపోయాయి. దేశ యువత ప్రపంచ దేశాలకు విస్తరిస్తున్నారు. వసుదైక కుటుంబ భావనలు వ్యాప్తి చెందుతున్నాయి. భాష, యాస, కుల, మత, వర్ణ, వర్గ, జాతి లాంటి విభేదాలు మరిచి, అంతర్జాల వలయంతో అనుసంధానించబడుతూ ప్రపంచమే ఒకకుటుంబం వలే పరిణామం చెందుతున్నది. కుల మతాంతర వివాహాలతో పాటు విదేశీ జంటల వివాహాలు పెరుగుతున్నాయి.అన్ని వర్గాల ప్రజలు ఐక్యత చాటుతున్నారు. విశ్వశాంతి వృక్షాల నీడన మానవాళి ప్రశాంత జీవనాలు గడుపుతున్నారు. కుటుంబాలు పలు రకాలుగా ఉంటాయి.ఉమ్మడి కుటుంబం, న్యూక్లియర్ కుటుంబం, ప్యాట్రిలోకల్ కుటుంబం (భార్య భర్త కుటుంబానికి చేరడం), మ్యాట్రిలోకల్ కుటుంబం (భర్త భార్య కుటుంబానికి చేరడం), ఎక్స్‌టెండెడ్ కుటుంబం(పలు తరాల వ్యక్తులు ఉన్న కుటుంబం), బైలోకల్ కుటుంబం (దంపతులు ఇద్దరు ఇరువురి కుటుంబాల్లో జీవించడం), నియోలోకల్ కుటుంబం (డిజిటల్ యుగపు దంపతుల స్వంత కుటుంబం) అనబడే వివిధ రకాల కుటుంబాలు ఉన్నాయి. కుటుంబ విలువలు పలుచబడితే సమగ్రాభివృద్ధి కుంటుబడుతుంది. విశ్వంలో శాంతి కొలువు తీరాలంటే కుటుంబంలో ప్రశాంతత నెలకొనాలి. నేటి డిజిటల్ యుగంలో కుటుంబ విలువలు తరుగుతున్నాయి. న్యూక్లియర్ ఫ్యామిలీలు పుట్టుకొస్తున్నాయి. అమ్మనాన్నల వెతలు పెరుగుతూ, అనాథాశ్రమాలు పుట్టుకొస్తున్నాయి. తోబుట్టువుల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఆస్తి పంపకాలు రక్తసిక్తం అవుతున్నాయి. ఈ విషయాలను గుర్తించినఐరాస 1994 ఏడాదిని అంతర్జాత కుటుంబాల సంవత్సరంగా ప్రకటించింది. దీనితోపాటు 1997లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం జనవరి 01 రోజును శాంతి కోసం ఒక రోజు (ఏ డే ఆఫ్ పీస్)" అనే నినాదం తీసుకోవాలని సూ



చించింది. యుద్ధాలు, మానవ ప్రేరేపిత సంక్షోభాలు/ విపత్తులు లేని ప్రపంచ నిర్మాణం కావాలని ఐరాస పేర్కొంటున్నది. 2001 నుంచి ప్రతి ఏటా 01 జనవరి రోజును ప్రపంచ కుటుంబ దినం లేదా గ్లోబల్ ఫామిలీ డేగా పాటించాలని ఐరాస సూచించడం జరిగింది. ప్రపంచ కుటుంబ దినం 2025 వేదికగా కుటుంబాలు, పౌర సమాజం,శాంతి అంశాల మధ్య సంబంధాలను వివరించడంతో పాటు ప్రత్యేకంగా కుటుంబాల ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు ప్రపంచ శాంతి విలువను ప్రచారం చేయడం జరుగుతుంది. భవిష్యత్తు తరాల్లో విశ్వ కుటుంబ భావనలు మొలకెత్తే విధంగా 01 జనవరి రోజున ప్రపంచ కుటుంబ దినం వేదికగా సెమినార్లు, వెబినార్లు, కార్యశాలలు, శాంతి స్థాపన చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగాలి. ప్రపంచ కుటుంబ దినం 2026 ఇతివృత్తంగా 'ఐక్య కుటుంబాలతో సుస్థిర భవిష్యత్తు వైపు' అనబడే అంశాన్ని తీసుకున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, అంతర్గత సంక్షోభాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, అమానవీయ పోకడలను గుర్తించి అంతర్జాల వేదికగా శాంతియుత వాతావరణాన్ని కల్పించటానికి అవసరమైన చర్యలను నేటి యువత, శాంతి స్థాపన సంస్థలు, పౌర సమాజం సూచించడం జరగాలి. మూడవ ప్రపంచ యుద్ధ ఆలోచనలను మట్టుపెట్టడం, మానవాళి ఐక్యతతో శాంతియుత సహజీవనం గడపడం అత్యవసరమని నమ్మాలి. కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని వెచ్చిస్తూ, శాంతియుత కుటుంబాలకు సంబంధించిన సినిమాలను వీక్షించడం, శాంతి స్థాపనకు కృషి చేయడం, కుటుంబాలు తమ లక్ష్యాలను నిర్ణయించుకోవడం లాంటి అంశాలను విస్తృతంగా వివరించాలి. కుటుంబం మన ఆస్తిపాస్తుల కన్న మిన్న అంటూ నినదించాలి. కుటుంబంతో నాణ్యమైన సమయం గడపని వారు నిజమైన మానవులే కాదు అని ప్రచారం చేద్దాం. కుటుంబానికి విలువను ఇచ్చే సమాజం వసుధైక కుటుంబ భావనలకు కట్టుబడిఉంటుంది. ప్రపంచ మానవులందరూ ఒకే కుటుంబ సభ్యులు అని నమ్మాలి.శాంతి,ఐక్యతే మానవాళి నిత్యమంత్రం కావాలి. ●

# 'ఉపాధి'కి దూరమవుతున్న కొత్త పథకం!

బొల్లిముంత సాంబశివరావు

ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసి చివరికి రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. నిధులు పెంచకుండా చేసి ఇప్పుడు ఆ పథకాన్నే రద్దుచేసే విధానాలు అమలు చేస్తున్నది. అందులో భాగమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వికసిత్ భారత్ జీరామ్జీ (గ్యారంటీ ఫర్‌రోజ్గార్ అండ్ ఆజీవక్మిషన్గ్రామన్) గాపేరుపెట్టింది. దీనికి సంబంధించిన బిల్లును 16.12.25 పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఎటువంటి చర్చలేకుండానే నిరసనల మధ్య 18.12.25న బిల్లును కేంద్ర ప్రభుత్వం చట్టంగా ఆమోదింప చేసింది. ఈ బిల్లులో పంచాయతీల ద్వారా పనులు అమలు, పనిదినాలను 100 నుచి 125 రోజులకు పెంపు, వ్యవసాయ సీజన్లో కూలీల కొరతలేకుండా ఉపాధి పనులను 60 రోజుల వరకు తాత్కాలిక నిలిపివేత,వికసిత భారత లక్ష్యాలకు అనుగుణంగారాష్ట్ర, జిల్లా, బ్లాకాల స్థాయిలో పనులు, ప్రణాళికలు, వారానికి ఒకసారి కూలి చెల్లింపు, ఏబీసీలు గ్రామపంచాయతీల విభజన, కేంద్ర నిర్ధారించిన పారామీటర్స్ ఆధారంగా రాష్ట్రాల వారీగా ఉపాధి పనుల కేటాయింపు, కేటాయింపులకు అదనంగా నిధులు ఖర్చుచేస్తే దాన్ని రాష్ట్రాలే భరించడం,ఉపాధి పనుల కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధుల కేటాయింపు ఈ బిల్లులోప్రధాన అంశాలుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి తగ్గి,నిరుద్యోగం పెరగడం, ఉపాధికోసం గ్రామీణపేదలు పట్టణాలకు వలస బాటపట్టటం, ప్రభుత్వం వెడల గ్రామీణ పేదల్లో వ్యతిరేకత వ్యక్తం కావడం దృష్టిలో పెట్టుకుని,ఆ వ్యతిరేకతను చల్లార్చేందుకు యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధిహామీ పథకం తేవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నికరమైన ఆదాయ కల్పన, వనరుల ఉత్పాదక,అభివృద్ధి లక్ష్యాలుగా 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యంగా ప్రకటించింది. 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా యూపీఏ ప్రభుత్వం పథకం పేరు మార్చింది. ఈ పథకం కింద జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తామని చెప్పింది. 2024 నాటికి దేశంలో జాబ్‌కార్డులు పొందిన కుటుంబాలు 9 కోట్ల, 2 లక్షలుగా ఉన్నాయి. ఉపాధి పథకం ప్రారంభమైన దగ్గర నుంచి ఇప్పటి వరకు కుటుంబాలకు వందరోజుల పని కల్పించడంలో పాలక ప్రభుత్వాలన్నీ విఫలం అయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 40.70 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని లభిస్తే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6.74 లక్షల కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని లభించింది. యూపీఏ ప్రభుత్వ పాలనలోనే పథకాన్ని నీరుగార్చే విధానాలు ప్రారంభమై నేడు కేంద్ర ప్రభుత్వ పాలనలో అది తీవ్రమైంది. అందుకు అనుగుణంగానే పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం లేదా పెంచకపోవడం జరిగింది.4కోట్ల,57లక్షల జాబ్ కార్డులు తొలగించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 18.34 జాబ్‌కార్డులు తొలగించి 100 రోజులు పని కల్పించడంలో విఫలమైంది. ఈ విషయాన్ని కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌవాన్ 9.12.2025న పార్లమెంట్‌కు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 18.34 లక్షల జాబ్



కార్డులు తొలగించింది. 2019-20, 2024-25 మధ్య అత్యధికంగా తొలగించబడిన జాబ్‌కార్డుల సంఖ్య కోటి, 4 వేలమంది.రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా 11మంది జాబ్‌కార్డులు తొలగించబడ్డాయి. తెలంగాణలో 3,45,445, ఒడిశాలో 80,896, ఉత్తరప్రదేశ్లో 91.48 లక్షలు జాబ్‌కార్డులు తొలగించబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్ నిధుల కేటాయింపులు పెంచడంలేదు. 2020-21 వార్షిక బడ్జెట్లో 63 వేలు కేటాయించిన తర్వాత కోవిడ్ రావడంలో పట్టణాలకు వలసవెళ్లిన ప్రజలందరూ తిరిగి గ్రామాలకు రావడంలో వారికి ఉపాధి సమస్యగా మారడం, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు రావడంతో, గ్రామీణజాతీయ ఉపాధి పథకానికి 63వేల కోట్ల నుంచి 1,11,170 కోట్లకు నిధులు కేటాయింపు జరిగింది. ఆమరుసటి ఆర్థిక (2022-23) సంవత్సరం బడ్జెట్ కేటాయింపు మాత్రం 73 వేల కోట్లకే పరిమితమైంది. 2024-25 బడ్జెట్లో 60వేలకోట్లు కేటాయించి,ఆ తర్వాత 86 కోట్లుగా ప్రకటించింది.2025-26వార్షిక బడ్జెట్లో 89,153.73 కోట్లు ప్రకటించింది. గత బడ్జెట్ కన్నా పెంపుదల 3వేలు మాత్రమే. దీన్ని పెంపుదల అనలేం. కోవిడ్ సమయంలో తప్ప ఉపాధి పథకానికి నిధుల పెంపుదల జరగలేదు. వికసిత్ భారత్ జీ రామ్ జీ బిల్లులో ప్రతిపాదించిన సెక్షన్ 5(1) ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాంతాలను నోటిఫై చేస్తుందో, అక్కడ మాత్రమే ఈ పథకం అమలు జరుగుతుంది. కేంద్రం నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే నైపుణ్యంలేని పనిచేయడానికి ముందుకు వచ్చే కుటుంబాలకు 125రోజులకు తగ్గకుండా గ్యారంటీ పనిని రాష్ట్రప్రభుత్వ కల్పిస్తుంది. నోటిఫై చేయని ప్రాంతాల్లో పేద కుటుంబాలకు కొత్తపథకంలో పని లభించదు.కొత్త పథకంలోని సెక్షన్ 5(1) రాష్ట్రాల హక్కులను హరిస్తుంది. ఇంతకు ముందు ఉపాధి చట్టంలో పనులు ఏప్రాంతాల్లో నిర్ణయించాలన్నది రాష్ట్రప్రభుత్వాలు ఉండేవి. ఇప్పుడు కొత్త ఉపాధి పథకం రాష్ట్రాల హక్కును తొలగించి, కేంద్ర ప్రభుత్వానికి కట్టబెట్టింది. కేంద్రప్రభుత్వం, తనకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాల్లో పనుల కేటాయింపులలో వివక్షకు అవకాశం ఉంది. ఉపాధి వేతనాల్లో ఖర్చులో కూడా గతంలో ఉన్న కేంద్రం 90 శాతం, రాష్ట్రాల 10శాతం నిధులను 60:40 నిష్పత్తిలో పంచుకోవాలి. ఇది రాష్ట్రాలపై భారం మోపడమే. ఈ భారాన్ని ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాలు భరించలేక ఉపాధి పనులను గణనీయంగా తగ్గిస్తాయి.ఫలితంగా జాబ్ కార్డు పొందిన కుటుంబాలకు పని లభించదు.ఉపాధి హామీ పథకంలో రోజు కూలీ 307రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.వాస్తవ రూపంలో రూ.240లకు మించి రావడం లేదు.వ్యవసాయ,వ్యవసాయేతర పనుల్లోనూ రోజు కూలి రూ.500గా ఉంది. దీన్ని గమనిస్తే ఉపాధి పథకం కూలి ఎంత తక్కువగా ఉందో తెలుస్తుంది. వ్యవసాయ సీజన్లో 60 రోజులపాటు ఉపాధి పనులు ఉండవని తాజా బిల్లులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగం వల్ల గ్రామీణ పేదలకు లభించే ఉపాధిలో80శాతం తగ్గిపోయింది.గ్రామీణ ఉపాధి పనులే వారికి ఆధారం. వ్యవసాయ సీజన్ పేరుతో ఉపాధి పథకం పనులు నిలిపివేస్తే పేదకుటుంబాలు పనులు దొరక్క తీవ్ర సంక్షోభంలో పడతాయి. ఉపాధి పనుల కూలీలకు వారం రోజుల్లోనే వేతనాలు చెల్లించాల్సిఉండగా,నెలల తరబడి వారికి కూలిడబ్బులు అందకపోగా ఉపాధి బకాయిలు మాత్రం పేరుకుపోతున్నాయి. ఉపాధి పనులకు చెల్లించాల్సిన బకాయిల మొత్తం దేశవ్యాప్తంగా 1,340 కోట్లు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యధికంగా 402.93 కోట్ల బకాయిలు ఉన్నాయి. కేరళలో 339.87కోట్లు, తమిళనాడులో 220.13కోట్లు, మధ్యప్రదేశ్ 131 కోట్లు బకాయిలున్నాయి.మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథక లక్ష్యం అనుగుణంగా పనిచేయకపోయినా, అవకతవకలు, అవినీతితో నిండిఉన్నా గ్రామీణ, ఆదివాసీ ప్రజలకు పథకం కొంతమేరకు ఉపశమనంగా ఉంది. దీన్ని కూడా వారికి లేకుండా చేసేందుకే కేంద్ర నాయకత్వాన ఉన్న ఎన్‌డియే ప్రభుత్వం తెచ్చిన కొత్తగ్రామీణ ఉపాధి చట్టం. ఉపాధి పొందడం ప్రజల హక్కు. అది భిక్షకాదు. ●

# రెండు ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు కేంద్రం ఓకే

- రూ.19,142కోట్లతో నిర్మాణం - నాసిక్ - షోలాపూర్ కారిడార్ కర్నూలు - కడప - చెన్నై వరకు విస్తరణ - నాసిక్ - షోలాపూర్ 6 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం - కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం - వొడాఫోన్- ఐడియాకు ఉపశమన ప్యాకేజీ ప్రకటన - కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రుల కమిటీ రూ.19,142 కోట్లతో రెండు నేషనల్ హైవే ప్రాజెక్టుల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అలాగే వొడాఫోన్- ఐడియాకు ఉపశమన ప్యాకేజీ ప్రకటించింది. మంత్రివర్గ సమావేశ వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. మహారాష్ట్రలోని నాసిక్- షోలాపూర్ - అక్కల్‌కోట్ మార్గాన్ని ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మించడంతోపాటు నాసిక్- షోలాపూర్ కారిడార్‌ను కర్నూలు, కడప మీదుగా చెన్నై వరకు విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. నాసిక్ -షోలాపూర్ - అక్కల్‌కోట్ మార్గం 6 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే దాదాపు 374 కిలోమీటర్లు నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.19,142 కోట్లు, ఎన్‌హెచ్ఎఐ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కెబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. 374 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టును బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బిఒటి) టోల్ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద భారతదేశ సమగ్ర రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ ప్రాంతీయ, అంతర్ రాష్ట్ర కనెక్టివిటీని మెరుగుపరచడం లక్ష్యంలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

**వొడాఫోన్- ఐడియాకు ఉపశమన ప్యాకేజీ**

రుణాల భారం, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాకు కేంద్ర ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీని ప్రకటించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఎజిఆర్) బకాయిలను రూ.87,695 కోట్లకు సర్దుబాటు చేసి స్తంభింపచేసింది. 2032-41 ఆర్థిక సంవత్సరాల మధ్య రూ.87,695 కోట్ల బకాయిలను చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ఏజీఆర్ సంబంధిత అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పునః పరిశీలించాలని 2020లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో 20 కోట్ల మంది వొడాఫోన్ ఐడియా వినియోగదారుల ప్రయోజనాలకు రక్షణ ఏర్పడుతుందని, టెలికం రంగం మనుగడ, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు ఒక లైఫ్‌లైన్ అవుతుందని అంచనా వేస్తున్నారు.



# డిఆర్‌డిఓ మరో రికార్డు

**ఒకే లాంచర్ నుంచి 2 ప్రళయ్ క్షిపణుల ప్రయోగం**

**దేశీయంగా సెమీ బాలిస్టిక్ క్షిపణి ప్రళయ్ తయారీ**

**డిఆర్‌డిఓ అధికారులను ప్రశంసించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** దేశ రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) మరో రికార్డు సాధించింది. ఒకే లాంచర్ నుండి రెండు ప్రళయ్ క్షిపణులను ప్రయోగించి చరిత్ర సృష్టించింది. ఒడిశా తీరం చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఒకే లాంచర్ నుండి రెండు ప్రళయ్ క్షిపణులను డిఆర్‌డిఓ విజయవంతంగా ప్రయోగించింది. ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా నిర్ధారించబడిన గగనతల లక్ష్యాలను చేరుకోవడానికి రెండు క్షిపణులు ఉద్దేశించిన పథాన్ని అనుసరించాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. టెర్మినల్ ఈవెంట్‌లను షిప్‌లో ఇన్‌స్టాల్ చేయబడిన టెలిమెట్రీ సిస్టమ్‌లు నిర్ధారించాయి, ఇంపాక్ట్ పాయింట్ల దగ్గర మోహరించబడ్డాయి. ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి అత్యాధునిక మార్గదర్శకత్వం, నావిగేషన్‌ను ఉపయోగించే స్వదేశీంగా అభివృద్ధి చేయబడిన ఘన చోదక క్వాసీబాలిస్టిక్ క్షిపణి. ఈ క్షిపణి వివిధ లక్ష్యాలకు వ్యతిరేకంగా బహుళ రకాల వార్‌హెడ్‌లను మోయగలదు. ఈ క్షి పణిని ఇతర డిఆర్‌డిఓ ప్రయోగశాలల సహకారంతో హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్ఐఇ) అభివృద్ధి చేసింది. ఈ పరీక్షలను డిఆర్‌డిఓ సీనియర్ శాస్త్రవేత్తలు, భారత వైమానిక దళం, భారత సైన్యం నుండి వినియోగదారుల ప్రతినిధులు అలాగే అభివృద్ధి కమ్ ప్రొడక్షన్ భాగస్వాములతో సహా పరిశ్రమ ప్రతినిధులు వీక్షించారు. క్షిపణులను త్వరితగతిన విజయవంతంగా ప్రయోగించడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిఆర్‌డిఓ, భారత వైమానిక దళం, భారత సైన్యం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ప్రశంసించారు. ప్రళయ్ క్షిపణి సాల్వో ప్రయోగం విజయవంతంగా పూర్తి చేయడం వల్ల క్షిపణి విశ్వసనీయత స్థిరపడిందని ఆయన అన్నారు.



# టోంక్‌లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం

- కారు, పేలుడు సామగ్రి, ఫ్యూజువైర్లు కూడా ...
- ఇద్దరు నిందితుల అరెస్టు

**జైపూర్, డిసెంబరు 31:** రాజస్థాన్‌లో భారీ మొత్తంలో పేలుడు పదార్థాన్ని సీజ్ చేశారు. ఆ రాష్ట్రంలో టోంక్ ప్రాంతంలో ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. మారుతీ కారులో సుమారు 150 కిలోల అమోనియం నైట్రేట్ తీసుకెళ్తున్నారు. యూరియా బస్తాల్లో అమోనియం నైట్రేట్‌ను తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు సుమారు 200 ఎక్స్‌ప్లోజీవ్ బ్యాటరీలు, 1100 మీటర్ల పొడువైన వైరును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు. ఒకర్ని సురేంద్రగా, మరో వ్యక్తిని సురేంద్ర మోచీగా గుర్తించారు. టోంక్ పోలీసుల జిల్లా స్పెషల్ టీమ్ డిఎస్టీ 200 క్యాట్రిడ్జిలు, ఆరు బండిళ్లలో ఉన్న ఫ్యూజ్‌వైర్‌ను కూడా సీజ్‌చేసారు. సురేంద్ర పట్వా, సురేంద్రమోచిలను అదుపులోకి తీసుకున్నామని, వీరిద్దరూ కూడా బుండి జిల్లాకు చెందినవారని డిఎస్టీ పోలీసులు తెలిపారు. బరోని పోలీస్ స్టేషన్ ప్రాంతంలో వీరిని వెంబడించింది. యూరియా బస్తాల్లో దాచి అమ్మోనియం నైట్రేట్‌ను తీసుకెళుతున్నట్లు డిఎస్పి మృత్యుంజయ్ మిశ్రా వెల్లడించారు. ఈ పేలుడు సామగ్రి బుండినుంచి టోక్‌లో సరఫరాకోసం తీసుకెళుతున్నట్లు నిందితులు తెలిపారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు, మొత్తం సామగ్రిని స్వాధీనంచేసుకున్నారు. ఈ రవాణా అక్రమ కార్యకలాపాలకోసమా లేక మైనింగ్‌కోసమా అన్నది నిందితులను ప్రశ్నిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు.

# ఖలీదాకు కన్నీటి వీడ్కోలు

- ఢాకాలో భర్త సమాధి పక్కనే అంత్యక్రియలు
- లక్షలాది ప్రజలు తరలిరావడంతో జనసంద్రంగా మారిన మానిక్ మియా అవెన్యూ
- భారత్ తరఫున హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్



**ఢాకా, డిసెంబరు 31:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఛైర్‌పర్సన్ బేగం ఖలీదా జియా అంత్యక్రియలు బుధవారం ఢాకాలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఆమెకు కడసారి వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అభిమానులు, ప్రజలు తరలిరావడంతో మానిక్ మియా అవెన్యూ జనసంద్రంగా మారింది. ఈ అంత్యక్రియలకు భారత ప్రభుత్వం తరఫున విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ హాజరయ్యారు. ఢాకాలోని జాతీయ పార్లమెంట్ భవనం సమీపంలో ఉన్న మానిక్ మియా అవెన్యూలో ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్ఎజనజా) నిర్వహించారు. అనంతరం, ఆమె భర్త, మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ సమాధి పక్కనే షేర్ఎబంగ్లా నగర్‌లోని చంద్రినా ఉద్యాన్‌లో ప్రభుత్వ లాంఛనాలతో ఖననం చేశారు. ఈ కార్యక్రమానికి బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రత్యేక విమానంలో ఢాకా చేరుకున్న జైశంకర్ ఖలీదా జియా కుమారుడు, బీఎన్పీ యాక్టింగ్ చైర్మన్ తారిక్ రెహమాన్‌ను కలుసుకున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పంపిన వ్యక్తిగత సంతాప సందేశాన్ని ఆయనకు అందజేశారు. భారత ప్రభుత్వం, ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు జైశంకర్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఖలీదా జియా మృతి పట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మంగళవారమే ఓ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఖలీదా జియా (80) మంగళవారం ఉదయం ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె లివర్ సిర్రోసిస్, ఆర్థరైటిస్, డయాబెటిస్ వంటి పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. బంగ్లాదేశ్‌కు తొలి మహిళా ప్రధానిగా ఆమె చరిత్రకెక్కారు. మూడుసార్లు ప్రధానిగా ఆమె సేవలందించారు.

# తల్లికి అంత్యక్రియలు.. శ్మశానవాటికలో ఉండగా చేతికి నామినేషన్ పేపర్లు!

**ముంబయి, డిసెంబర్ 31:** మహారాష్ట్రలో ఓ అనూహ్య ఘటన జరిగింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు నగారా మోగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తోన్న సమయంలో శివసేన నాయకుడు యోగేష్ గొన్నాడేకి ఎలక్షన్ టికెట్ లభించింది. శ్మశానవాటికలో ఉండగా తన అభ్యర్థిత్వానికి పార్టీ నుంచి ఆమోదం లభించడంపై ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్రలో 29 మున్సిపల్ కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న యోగేష్ గొన్నాడే తల్లి మరణించింది. దీంతో పోటీ చేయాలనుకున్న ఆశను వదులుకున్నారు. అయితే పార్టీ మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. నామినేషన్‌కు చివరిరోజు కావడంతో పార్టీ నేతలు నామినేషన్ పత్రాలతో హుటాహుటిన శ్మశానవాటికకు చేరుకున్నారు. గొన్నాడే తల్లి అంత్యక్రియలు జరుగుతుండగానే వారు ఆయనకు నామినేషన్ పత్రాలు అందచేశారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు.

# గిగ్‌వర్కర్ల మెరుపు సమ్మె

## ప్రోత్సాహకాలు పెంచుతున్న స్విగ్గీ, జొమాటో

**ముంబయి, డిసెంబరు 31:** నూతన సంవత్సర వేడుకల ఉత్సాహంలో ఉన్న ప్రజలకు, ముఖ్యంగా ఆన్‌లైన్ ఆర్డర్లపై ఆధారపడే వారికి గిగ్‌వర్కర్లు షాక్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది గిగ్ వర్కర్లు అంటే డెలివరీ బాయ్స్ బుధవారం సమ్మెకు పిలుపునిచ్చారు. జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న డెలివరీ భాగస్వాములు ఈ నిరసనలో పాల్గొంటున్నారు. దీనివల్ల ఇయర్ ఎండ్ వేడుకల సమయంలో ఫుడ్ డెలివరీలు, క్విక్ కామర్స్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఏటీ) సంయుక్తంగా ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. సంస్థలు చెల్లించే పారితోషికం (పే అవుట్స్) దారుణంగా పడిపోవడం, పని గంటలు విపరీతంగా పెరగడం, కనీస సామాజిక భద్రత లేకపోవడమే ఈ నిరసనకు ప్రధాన కారణమని యూనియన్ నేతలు పేర్కొంటున్నారు. ఇన్సూరెన్స్ లేకపోవడం, కంపెనీలు విధిస్తున్న భారీ జరిమానాలు తమను ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఏడాదిచివరిరోజు 31న ఫుడ్, గ్రాసరీ డెలివరీలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అయితే డెలివరీ బాయ్స్ సామూహికంగా యాప్‌ల నుంచి లాగ్‌ఆఫ్ అవ్వడం వల్ల హైదరాబాద్, బెంగళూరు, పూణె, ఢిల్లీ వంటి నగరాల్లో ఆర్డర్లు క్యాన్సిల్ అవ్వడం లేదా డెలివరీ సమయం విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. తమ నిరసన కస్టమర్లను ఇబ్బంది పెట్టడానికి కాదని, సమస్యల పట్ల ప్రభుత్వం, కంపెనీలు స్పందించేలా చూడటమే తమ లక్ష్యమని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. ఇదిలా ఉంటే ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలు జొమాటో, స్విగ్గీ సంస్థలు తమ డెలివరీ భాగస్వాములకు ప్రోత్సాహకాలను పెంచుతున్నట్లుప్రకటించాయి. పండుగ సీజన్లలో అనుసరించే విధానం వర్తింపచేస్తామని దీనివల్ల గిగ్‌వర్కర్లకుప్రోత్సాహంగా ఉంటుందని సంస్థలు ప్రకటించాయి. జొమాటో రూ.120 నుంచి రూ.150వరకూ ఒక్కొక్క బుకింగ్‌కు పీక్ అవర్స్‌లో ఇస్తామని ప్రకటించింది.




# సంక్షిప్తంగా..

## హిజాబ్ వివాదం.. విధుల్లో చేరని డాక్టర్ నుస్రత్ పర్వీన్




**పాట్నా, డిసెంబర్ 31:** ఇటీవల బీహార్‌లో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఓ వైద్యురాలి హిజాబ్‌ను తొలగించడంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఆ ఘటనతో ఇబ్బందిపడిన వైద్యురాలు నుస్రత్ పర్వీన్ ఇంకా విధుల్లో చేరలేదని స్థానిక అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వైద్యులు పోస్టింగ్‌లో చేరడానికి ఇచ్చిన డెడ్‌లైన్ నేటితో ముగుస్తుందని సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధుల్లో చేరాల్సిన ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. ఈ రోజు రిపోర్టు చేయకపోతే ఆమె అపాయింట్‌మెంట్‌ను రద్దు చేయాల్సి ఉంటుందని అన్నారు. కాగా హిజాబ్‌వివాదం తర్వాత పర్వీన్ కుటుంబం పాట్నా నుంచి కోల్‌కతాకు మారినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి.

## కదులుతున్న కారులో సామూహిక లైంగిక దాడి




**ఫరీదాబాద్, డిసెంబరు 31:** హర్యానాలోని ఫరీదాబాద్‌లో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న వ్యాన్‌లో 28 ఏళ్ల ఓ యువతిపై దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘాతుకం జరిగింది. బాధిత మహిళ రాత్రి ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం వేచి చూస్తుండగా ఓ వ్యాన్ ఆమె వద్ద ఆగింది. ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి ఇద్దరు యువకులు ఆమెను వాహనంలోకి ఎక్కించుకున్నారు. అనంతరం వ్యాన్‌ను గుర్గావ్ రోడ్డు వైపు మళ్లించి, సుమారు రెండున్నర గంటల పాటు ఆమెపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఎంత వేడుకున్నా వినిపించుకోకుండా బెదిరింపులకు దిగారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఎస్‌జీఎమ్ నగర్‌లోని రాజా చౌక్ సమీపంలో ఆమెను కదులుతున్న వ్యాన్ నుంచి బయటకు తోసేశారు. ఆమె ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి.

## రైతు కళ్లల్లో కారం కొట్టి రూ. 25 లక్షలు చోరీ

**తమోయిచక్(ఎంపి)డిసెంబరు 31:** మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. దారి కాచి ఓ రైతు కండ్లలో కారం కొట్టి అతని నుంచి రూ.లక్షలు దోచుకున్నారు. ఈ ఘటన తమోయియా చక్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన 47 ఏండ్ల రైతు ల ఖ్వేందర్ అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ.25 లక్షలు తీసుకొని బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గం మధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. రైతుతో మాటలు కలిపారు. కాసేపటికి తమ వెంట తెచ్చుకున్న కారం ఖ్వేందర్ కండ్లలో కొట్టి అతని వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్‌మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది.

## అమెరికా ట్రక్కుడ్రైవర్లకు ఊరట!



**వాషింగ్టన్, డిసెంబరు 31:** అమెరికాలోని ప్రవాస ట్రక్ డ్రైవర్లకు తాత్కాలికంగా ఊరట లభించింది. గడువు తేదీల్లో సమస్యలు ఉన్నాయంటూ కాలిఫోర్నియా ప్రభుత్వం 17 వేల కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ లను రద్దు చేసింది. దీనిపై ట్రక్ డ్రైవర్లు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం తాజాగా వెనక్కి తగ్గింది. 2026 మార్చి వరకూ ఈ లైసెన్స్ లు చెల్లుబాటు అవుతాయని ప్రకటించింది. చట్టబద్ధంగా లైసెన్స్ పొందినవారు అప్పటివరకు వాటిని కొనసాగించవచ్చని వెల్లడించింది. లైసెన్స్ లను రద్దు చేస్తూ ఇటీవల కాలిఫోర్నియా ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనపై ప్రవాస ట్రక్కు డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ట్రక్కు డ్రైవర్లు కోర్టును ఆశ్రయించారు. రవాణా ఏజెన్సీ తప్పులే లైసెన్సుల రద్దుకు కారణమని పౌర హక్కుల సంఘాలు కూడా ఆరోపించాయి. వీటిని సరిదిద్ది, లైసెన్స్‌లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి.

# సొరంగం తవ్వి జర్మనీ బ్యాంకులో చోరీ

**రూ.300 కోట్ల విలువైన నగలు, నగదు తస్కరణ**

**బెర్లిన్, డిసెంబరు 31:** జర్మనీలోని ఓ బ్యాంకులో భారీ చోరీ జరిగింది. వరుస సెలవులతో మూసి ఉన్న బ్యాంకులో దొంగలు పడి సుమారు రూ. 300 కోట్ల విలువైన నగలు, నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. బ్యాంకు పక్కనే ఉన్న పార్కింగ్ గ్యారేజ్ నుంచి సొరంగం తవ్వి బ్యాంకు లోపలికి వెళ్లిన దొంగలు 3 వేలకు పైగా లాకర్లను తెరిచి ఖాతాదారులు దాచుకున్న సొమ్మును కాజేశారు. హాలీవుడ్ సినిమా ఓషియన్స్ ఎలెవన్ సినిమా తరహాలో ఈ చోరీ జరిగింది. జర్మనీ బ్యాంకుల రూల్స్ ప్రకారం ఖాతాదారులు తమ లాకర్లకు ఇన్సూరెన్స్ చేయించడం తప్పనిసరి. ఈ ఇన్సూరెన్స్ వివరాల ఆధారంగా 3 వేలకు పైగా లాకర్లలో దాదాపు 300 కోట్ల విలువైన నగలు, వస్తువులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. నార్త్ రైన్‌వెస్ట్‌ఫాలియా రాష్ట్రంలోని గెల్సెన్‌కిర్చెన్ సిటీలో ఈ భారీ దొంగతనం జరిగింది. క్రిస్మస్ సందర్భంగా గురు, శుక్రవారాలు బ్యాంకుకు సెలవు కాగా శని, ఆదివారాలు జర్మనీలోని బ్యాంకులకు సాధారణ సెలవు దినాలు. నాలుగు రోజులు బ్యాంకు సెలవులను తమకు అనుకూలంగా మలుచుకున్న దొంగలు పక్కాగా ప్లాన్ చేసి భారీ పనిముట్లతో రంగంలోకి దిగారు. గ్యారేజ్ లో నుంచి బ్యాంకులోకి సొరంగం తవ్వారు. లోపలికి వెళ్లి లాకర్ రూంలోని 3,250 లాకర్లలో 3 వేలకు పైగా లాకర్లను తెరిచారు. అందులోని విలువైన వస్తువులు, నగలను ఎత్తుకెళ్లారు. ఉదయం ఫైర్ అలారం మోగడంతో బ్యాంకులో చోరీ విషయం బయట పడింది. చోరీ సమాచారం తెలిసి వందలాది మంది ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండడంతో బ్యాంకును అధికారులు మూసివేశారు. కాగా, శుక్రవారం ఉదయం బ్యాంకు పక్కనే ఉన్న గ్యారేజ్ లో నుంచి కొంతమంది ముసుగులు ధరించిన వ్యక్తులు ఆడి కారులో వెళ్లడం చూసినట్లు స్థానికులు తెలిపారు. దీంతో పోలీసులు ఆరా తీయగా.. దొంగలు పక్కా ప్లాన్ తో ముందుగా ఒక కారును దొంగిలించారు.

# కలుషిత జలాలతో 1,100 మందికిపైగా అస్వస్థత

**ఆసుపత్రుల్లో 150 మందికి చికిత్స,**

## ఏడుగురు మృతి

**స్వచ్ఛనగరం ఇండోర్‌లో కలుషిత జలాల సమస్య**

**ఇండోర్, డిసెంబరు 31:** రాష్ట్రంలోని ఇండోర్‌లో కలుషిత జలాలు సేవించడంవల్లసుమారు వెయ్యిమంది అస్వస్థతకు లోనయ్యారు. ఇండోర్‌నగరంలోనే ప్రభుత్వపరిధిలోనిమంచినీటి పైప్‌లైన్‌ద్వారా సరఫరాచేసిన మంచినీటిని తాగి అస్వస్థతకు గురయినట్లు తేలింది. భగీరథ్‌పురాకు చెందిన వీరందరిని నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చేర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఇండోర్ నగరాన్ని వరుసగా ఎనిమిదోసారి అత్యంత స్వచ్ఛనగరంగా అవార్డు ఇచ్చిన తరుణంలో ఇలా కలుషిత జలాల సరఫరాపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వీరందరికీ వాంతులు విరేచనాలు జ్వరం వంటివి రావడంతో వైద్యులు డయేరియాగా నిర్ధారించారు. ఇండోర్‌మేయర్ మాట్లాడుతూ ఏడుగురుచనిపోయారని 150మందికిపైగా అస్వస్థతకు గురయినట్లు వెల్లడించారు. గడచిన వారంరోజులుగా భగీరథ్‌పురలో సుమారు 1100 మందికిపైగా కలుషిత జలాల బారినపడ్డారని, వైద్యులు చెపుతున్నారు. వీరిలో అత్యంత విషమంగా ఉన్న 150 మందిని ఆసుపత్రుల్లో చేర్పించామని చెప్పారు. ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ మాట్లాడుతూ ఏడుగురుచనిపోయారని, 150 మందికి చికిత్స జరుగుతోందన్నారు. ఇండోర్ జిల్లామేజిస్ట్రేట్ శివమ్ వర్మ మాట్లాడుతూ మొత్తం 27 ఆసుపత్రుల్లో 149 మంది చికిత్సపొందుతున్నారని వారి ఆరోగ్యస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నట్లు చెప్పారు.

## ఇరాన్ కరెన్సీభారీ పతనంతో

# ప్రజల తిరుగుబాటు!



**టెహ్రాన్, డిసెంబరు 31:** ఇరాన్ రాజధాని టెహ్రాన్ ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, కరెన్సీ రియాల్ విలువ గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోవడంతో వ్యాపారులు, సామాన్య ప్రజలు తిరుగుబాటు చేపట్టారు. డాలర్‌కు 1.42 మిలియన్ల రియాల్స్‌గా కొనసాగుతోంది. టెహ్రాన్‌లోని ప్రధాన వాణిజ్య కేంద్రాలు, మొబైల్ మార్కెట్లు, చారిత్రక గ్రాండ్ బజార్లు మూతపడ్డాయి. జంహూరీ ఏరియాలో వేలాది మంది వ్యాపారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో టెహ్రాన్ వీధులు రణరంగాన్ని తలపించాయి. ఇరాన్ దుస్థితికి కేవలం కరెన్సీ పతనం మాత్రమే కారణం కాదు. 2025 జూన్‌లో ఇజ్రాయెల్, అమెరికా జరిపిన 12 రోజుల వైమానిక దాడులు దేశాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ దాడుల్లో వెయ్యి మందికి పైగా మరణించడమే కాకుండా, కీలక అణు కేంద్రాలు, సైనిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అమెరికా విధిస్తున్న కఠినమైన ఆర్థిక ఆంక్షలు, తీవ్రమైన నీటి ఎద్దడి, ఇంధన సంక్షోభం ఆ దేశాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. ద్రవ్యోల్బణం 50 శాతానికి చేరువలో ఉండగా, ప్రభుత్వం పన్నులను 62 శాతం పెంచడం ప్రజల ఆగ్రహానికి ఆజ్యం పోసింది. ప్రజల నిరసనలు మిన్నంటడంతో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కరెన్సీ పతనానికి బాధ్యత వహిస్తూ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ మహమ్మద్ రెజా ఫర్జిన్ రాజీనామా చేయగా, ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌ను నియమించారు. ప్రజల డిమాండ్లు న్యాయమైనవేనని అంగీకరించిన అధ్యక్షుడు నిరసనకారుల ప్రతినిధులతో చర్చలు జరపాలని అంతర్గత వ్యవహారాల మంత్రిని ఆదేశించారు. అయితే, ఒకవైపు పశ్చిమ దేశాల ఒత్తిడి, మరో వైపు దేశవ్యాప్త అసమ్మతి మధ్య ఇరాన్ ప్రభుత్వం ఈ సంక్షోభం నుంచి ఎలా బయట పడుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం

## ఏఎస్‌పేటలో అభివృద్ధి కార్యక్రమాల జాతర

**• మంత్రి ఆనం, ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద**

అనుమసముద్రంపేట (నెల్లూరు), డిసెంబరు 31 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా అనుమసముద్రం పేటలో రూ.4.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేశారు. అనంతరం వారు శ్రీశ్రీశ్రీ ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మల దర్గాలో సమాధుల వద్ద చాదర వస్త్రాలను సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈసందర్భంగా నేతలకు దర్గా కమిటీ సభ్యులు స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం వారు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి, ఎంపి, ఎమ్మెల్సీలు ప్రారంభించారు. రూ.15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించి రూ.27 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.50.50లక్షల తాగునీటి పథకానికి వారు శంకుస్థాపన చేశారు. రూ.2.12 కోట్లతో నిర్మించనున్న కెజిబివి జూనియర్ కాలేజీ భవనాలకు శ్రీకారం చుట్టారు. రూ.43 లక్షలతో ల్యాబ్ భవనాల గదులకు కూడా శంకుస్థాపన చేశారు. మోడల్ స్కూల్లో రూ.15 లక్షలతో మరమ్మత్తు పనులకు మంత్రి, ఎంపి, ఎమ్మెల్సీలు శ్రీకారం చుట్టారు. ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు తాళ్ళూరి గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, రాష్ట్ర పాఠశాల మరియు సంక్షేమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, రాజవోలు సొసైటీ చైర్మెన్ కాంటరెడ్డి నారసింహారెడ్డి టిడిపి మైనార్టీ నాయకుడు, సర్పంచ్ భర్త షేక్ జిలానీబాషా, జిల్లా తెలుగుయువత మాజీ అధ్యక్షుడు ఏలూరి మాల్యాద్రి నాయుడు, మండల ఉపాధ్యక్షుడు పులిమి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు షేక్ షబ్బీర్‌బాషా, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండగలా ప్రజాసేవలో ప్రభుత్వం

**• టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**



విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజల సేవలో ప్రభుత్వం కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు.. ఆ పార్టీ నేతలకు సూచించారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేణులపై ఉందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. డిసెంబరు 31, జనవరి ఒకటో తేదీల్లో ప్రజలకు వివరించాలన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లతో పాటు మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు, నేతన్నలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని చెప్పారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ అందరికీ అన్ని అవకాశాలు కల్పిస్తుందని, అందరూ ఉత్సాహంగా పని చేయాలని కోరారు. మై టిడిపి యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వ పనితీరును తెలుసుకోవాలన్నారు.

## నూతనోత్తేజంతో సరికొత్త ప్రయాణానికి నాంది పలకాలి

**రాష్ట్ర ప్రజలకు మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి కొత్త సంవత్సర శుభాకాంక్షలు**



విజయవాడ, డిసెంబరు 31 ప్రభాత వార్త ప్రతినిధి: గత సంవత్సరపు మధుర జ్ఞాపకాలను మదిలో గుర్తు తెచ్చుకుంటూ సరికొత్త ప్రయాణానికి సిద్ధమ వుతున్న వేళ.. రాష్ట్ర ప్రజ లందరికీ నూతన సంవత్సర శుభా కాంక్షలు.. ఎన్నో ఆశలు, ఆశయాలతో, నూతనోత్తేజంతో సరికొత్త ప్రయాణానికి నాంది పలికే తరుణంలో.. ప్రతి ఒక్కరి కలలు సాకారం చేయాలని ఆ భగవం తుణ్ని ప్రార్థిస్తూ... కొత్త ఏడాది మీ జీవితాల్లో నిత్య నూతన వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను.. నూతన సంవత్సరంలో ప్రజలంతా చిరునవ్వులతో, సిరి సంపదలతో తులతుగాలని ఆకాంక్షిస్తున్నా.. స్వర్ణాంధ్ర రూపశిల్పి, నవ్యాంధ్ర రథసారథి.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కొత్త ఏడాది 2026వ సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి దిశలో మరింత బలమైన అడుగులు పడాలని ఆశిస్తున్నా.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా.. అభివృద్ధి - సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా, సుపరిపాలన అందించేందుకు మా కూటమి ప్రభుత్వం అనుక్షణం ఆలోచిస్తోంది. అంటూ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతి ఇంటా పింఛన్ల వెలుగులు

**• మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి**



నెల్లూరు, డిసెంబరు 31 ప్రభాతవార్త- వైద్యం: వృద్ధాప్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సిఎం చంద్రబాబునాయుడు అండగా నిలిచారని తెలిపారని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలో 54వ డివిజన్‌లోని భగత్ సింగ్ కాలనీలో పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం పండుగలా జరిగింది. ఒక్క రోజు ముందే మంత్రి నారాయణ ఇంటింటికి వెళ్లి పెన్షన్‌లు అందజేశారు. వృద్దులు, వికలాంగుల బాగోగుల స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మంచును సైతం లెక్కచేయకుండా తెల్లవారుజామునే ఆ ప్రాంతానికి వచ్చిన మంత్రి నారాయణ, కమీషనర్ నందన్, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మసీదులో మంత్రి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. పెన్షన్ దారులు కళ్ళలో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. రేపు నూతన సంవత్సరం కవడంతో సిఎం ఆదేశాలతో ముందు రోజే పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు. పెన్షన్ 3 వేల నుంచి 4 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. జూన్ 12 నుంచి తల్లికి వందనం అమలు చేస్తున్నామని, రైతులకు రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో మరో 70 అన్నా క్యాంటీన్లు త్వరలో ప్రారంభిస్తామన్నారు. పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు యువనేత లోకేష్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి వైసీపీ నేతలు ఓర్వలేకున్నారని, విమర్శలు చేయటమే పనిగా పెట్టుకొన్నారని ధ్వజమెత్తారు. మంచి పనిని కూడా చేదుగా వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్నీ ఆటంకాలు సృష్టించిన సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదల కళ్ళల్లో ఆనందం చూడాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒక రోజు ముందుగా అందించారన్నారు. ప్రజలు నూతన సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించుకునే విధంగా పింఛన్లు అందజేయడం జరిగిందన్నారు. నగర ఇన్‌చార్జి మేయర్ రూపు కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదవాళ్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెన్షన్లను రూ.4 వేలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ నందన్, 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియా, డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి జహీర్, కో ఆప్షన్ మెంబర్ జమీర్, 54 డివిజన్ ప్రెసిడెంట్ షాహిద్, యూనిట్ ఇన్‌చార్జి ఖాదర్ భాషా, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు

**ఎపిలో 22 మంది మృతి**

విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు గణనీయంగా పెరిగాయి. గత రెండేళ్ల లోనూ ఏటా వేయికి పైగా కేసులు వచ్చినా, అధికారికంగా మరణాలు నమోదు కాలేదు. కానీ ఈ సారి ఏకంగా పాజిటివ్ కేసుల్లో మరణాల సంఖ్య 22కి చేరింది. అన్ని జిల్లా ల్లోనూ కేసులు గుర్తిస్తున్నా గత మూడేళ్లుగా చిత్తూరు జిల్లాలోనే తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో 2023లో 548 పాజిటివ్ కేసులు రాగా, 2024లో 514, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 491వరకు నమోదయ్యాయి. 2023లో తిరుపతి జిల్లాలోనూ 276, 2024లో 184, ఈ ఏడాది 99 కేసులు బయటపడ్డట్టు అధికారుల నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది కేసుల తీవ్రతలో కాకినాడ (198), విశాఖపట్నం (158) జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తిస్తే సమస్య ఉండదని అవగాహన కల్పిస్తున్నప్పటికీ తొలుత జ్వరాలకు వాడే సాధారణ మందులు వేసుకొని, పరిస్థితి చేయిదాటాక ఆసుపత్రుల్లో చేరుతుండ టంతో ప్రాణాల మీదకు వస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పరిసరాల అపరి శుభ్రత, జాగ్రత్తలపై అవగాహన లేమి సమస్యగా మారుతున్నాయన్నారు. చిగ్గర్ అనే చిన్న పురుగు కుట్టడం వల్ల శరీరంపై నల్ల పొక్కు వస్తుంది. పురుగు కుట్టిన వారం రోజుల్లో చలిజ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలతో శరీరంపై నల్లని పొక్కు ఉంటే స్క్రబ్ టైఫస్‌గా నిర్ధరించు కోవచ్చని వైద్యులు చెబుతున్నారు. శరీరంపై ఎలాంటి మచ్చ లేకుండా ఈ లక్షణాలు కనిపిస్తే ఎలైసా పరీక్ష నిర్వహించి స్క్రబ్ టైఫస్‌ను తెలుసుకోవచ్చు. శుభ్రత లేమి, తేమ ఉన్న పొదలు, వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో తేవీటి పురుగు (చిగ్గర్ మైట్) సంచారం ఎక్కువ. ఇది కొత్తగా పుట్టుకొచ్చిన కీటకం కాదని, ఏళ్లుగా సంచరిస్తున్నదేనని నిపుణులు చెబుతున్నా కీటకం ప్రమాదకరంగా రూపాంత రం చెందడం వెనుక కారణాలు అంతుచిక్కడం లేదంటున్నారు దేశవ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు వస్తున్నా, ఏపీలోనే మర ణాలు నమోదవుతుండటం కలవరానికి గురి చేస్తోంది. ఈ ఏడాది మొత్తం 11,271 పరీక్షలు నిర్వహించగా.. 2,150 మంది పాజిటివ్ గా నమోదైంది. అయితే, అంటువ్యాధుల కట్టడికి జాతీయ వైద్యసంస్థలు, కీలక రంగాల నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ వ్యాధి నియంత్రణకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది. ఏపీలోని చిత్తూరు, తిరుపతి, కాకినాడ, విశాఖపట్టణంలో కేసులు అధికంగా నమోదవుతున్నాయి. స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తిస్తే సమస్య ఉండదని అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. తొలుత జ్వరాలకు వాడే సాధారణ మందులు వేసుకొని, పరిస్థితి చేయిదాటాక ఆస్పత్రుల్లో చేరుతుండటంతో ప్రాణాలమీదకు వస్తోందన వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి నిర్ధారణ జరిగితే సాధారణ యాంటిబయాటిక్స్‌తో నయం అవుతుందని, అస్వస్థతకు గురవ్వగానే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించు కోవాలని వైద్యులు సూచించారు. అయితే, ఈ స్క్రబ్ టైఫస్ కీటకం కొత్తగా పుట్టుకొచ్చింది కాదు. ఏళ్లుగా సంచరిస్తున్నదేనని నిపుణులు చెబుతున్నారు. కీటకం ప్రమాదకరంగా రూపాంతరం చెందడం వెనుక కారణాలు అంతుచిక్కడం లేదు. దేశవ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు వస్తున్నా, ఏపీలోనే మరణాలు నమోదుకావడం కలవరపెడుతోంది. వ్యాధి పూర్వాపరాలపై లోతుగా అధ్యయనానికి, బ్యాక్టీరియాలో రకాలు గుర్తించడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

## ఎన్‌టిఆర్ వైద్యవిశ్వవిద్యాలయం ఉద్యోగులకు
# సిపిఆర్‌పై అవగాహన



విజయవాడ (గన్నవరం), డిసెంబరు 31 ప్రభాతవార్త: అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే సిపిఆర్ విధానంపై విజయవాడలోని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యా లయం ఉద్యోగులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించా రు. విశ్వ విద్యాలయంలోని ఆలోచన హాల్‌లో ఈకార్యక్ర మాన్ని విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.చంద్ర శేఖర్ ప్రారంభించారు. ఈసంద ర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేవలం వైద్య వృత్తి నిపుణులకు మాత్రమే కాకుండా సామన్య ప్రజలకు సిపిఆర్‌పై అవగాహన కల్పించటం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడేందుకు వీలవుతుందన్నారు. అకస్మాత్తుగా గుండె ఆగిపోవటం (కార్డియాక్ అరెస్ట్)కు గురైన వ్యక్తికి సత్వరమే సిపిఆర్ చేయటం ద్వారా సదరు వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. దేశంలోని ప్రతిపౌరునికి ఈవిధానం పట్ల అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా సిపిఆర్ చేసే విధానాన్ని డమ్మీపై చేసి చూపించటంతో పాటు, ఉద్యోగులతోనూ చేయించారు. ఈకార్యక్రమంలో ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి. చక్రరావు, ఎన్‌టిఆర్ వైద్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ప్రొఫెసర్ సుశీల తదితరులు ప్రసంగించారు.



## ఉద్యోగవిరమణ చేసిన ఇంటెలిజెన్స్ అధికారికి సన్మానం

విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త: రాష్ట్ర పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగంలో సీనియర్ ఎనలిటికల్ అధికారిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన అల్లంశెట్టి భానోజీరావును ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఇంటె లిజెన్స్ అదనపు డిజి మహేష్‌చంద్ర లడ్డా కార్యా లయంలో జరిగిన కార్యక్రమంలో మహేష్‌చంద్ర లడ్డా భానోజీ రావు, హేమలత దంపతులను సత్కరించారు. గత 28 సంవత్సరాలుగా ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన భానోజీరావు ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని కమీషనర్ కార్యాలయంలో 1992లో విధుల్లో చేరి 1997 నుండి ఇంటెలిజెన్స్ విభాగంలోకి మారారు. పలువురు ఉద్యోగులు భానోజీరావును పూలమాలలతో సత్కరించారు.



ఐఎస్‌వో గుర్తింపు పత్రాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు


## కాణిపాకం ఆలయానికి ఐఎస్ఓ త్రీ స్టార్ గుర్తింపు

కాణిపాకం, డిసెంబరు 31 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో పరిపాలనా పరంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల నాణ్యతా ప్రమాణాలకు భారతీయ ప్రమాణాల సంస్థ (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) మూడు రకాల త్రీస్టార్ గుర్తింపు పత్రాలను ఆలయ అధికారులకు బుధవారం అందజేసింది. రాష్ట్రం లోని ఆలయాలు, సంస్కృతీ, సంప్రదాయాలు గురించి ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికి ఆలయాలకు ఐఎస్ఓ గుర్తింపు పత్రాలను అందిస్తోంది. ఈమేరకు కాణిపాకం దేవస్థానంలో పరాపాలనాపరంగా అమలువుతున్న వివిధ కార్యక్రమాల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు ఈ గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈమేరకు ఆలయంలో పరిపాలనా విభాగంలో అమలు చేస్తున్న లడ్డుపోటు, ప్రసాదాల నాణ్యత, అన్నదాన భవన్‌లో భోజనం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి ఐఎస్ఓ త్రీస్టార్ గుర్తింపు పత్రాలను అందజేశారు. దేవస్థానంలో క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్య నిర్వహణ, లడ్డూ ప్రసాదాలను, అన్న ప్రసాదాల నాణ్యత వంటి వాటిని పరిశీలించిన ఐఎస్ఓ ఈపత్రాలను అందజేసింది. క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, లడ్డూ ప్రసాదాలను,అ న్న ప్రసాదాల నాణ్యత వంటివి ఐఎస్ఓ మార్గదర్శకాలకు అనుగుణంగా వున్నాయా? లేదా? అని పరిశీలించిన అనంతరం దేవస్థానంకు ఈగుర్తింపు పత్రాలను అందజేశారు. ఈపత్రాలను ముందుగా ఆలయం ఎదుట వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభం వద్ద ఐఎస్ఓ సీఈఓ శివయ్య పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ చేతుల మీదుగా దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లకు అందజేశారు. ఈసందర్భంగా సంస్థ సీఈఓ శివయ్య మాట్లాడుతూ ఆలయంలో పరిపాలనాపరంగా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ఆడిట్ నిర్వహించి ఈపత్రాలను అందజేసినట్లు తెలిపారు. అలాగే ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు మాట్లాడుతూ దేవస్థానంకు ఐఎస్ఓ త్రీస్టార్ గుర్తింపు రావడం సంతోషంగా వుందన్నారు. గుర్తింపు పత్రాలు రావడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, పాలకమండలి సభ్యులు నాగరాజునాయుడు, కృష్ణవేణి, స్థానిక టిడిపి నాయకులు గిరిధర్ బాబు, నాగేశ్వర చౌదరి తదితరులు పాల్గొనా న్నరు.



## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు

కాణిపాకం, డిసెంబరు 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని బుధవారం పలువురు ప్రముఖులు కుటుంబసమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంలు కుటుంబసమేతంగా వేర్వేరుగా దరి ్శంచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట సూపరింటెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బాలాజినాయుడు, రవి, ఎస్ఐ నరసింహులు, చిత్తూరు కోర్టు సిబ్బంది, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గుడిమల్లం ఆలయం యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

## గుడిమల్లం అలయ యూట్యూబ్ ఛానల్ ప్రారంభం

శ్రీకాళహస్తి, డిసెంబరు 31 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని కొండ కోనల్లో జలపాతాల మధ్య వెలసిన దివ్యక్షేత్రం గుడిమల్లం. ఈ ఆలయాన్ని ప్రస్తుతం పురావస్తుశాఖ పర్యవేక్షణలో సాగుతుంది. ఈ ఆలయానికి సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ 'యూట్యూబ్ చానల్‌ను' ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిమల్లంలో ఉన్న పరశురామేశ్వరుని ఆలయం భారతదేశంలోనే అత్యుత్తమమైనదని, శివాలయాల్లో ప్రసిద్ధి చెందిన అతి పురాతనమైన ఆలయమని వివరించారు. ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు వచ్చి భక్తులకు బస సదుపాయాలు, మధ్యాహ్నం భోజన వసతుల కల్పనకు నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించుటకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. ఆలయానికి విస్తృత ప్రచారం నిర్వహించుటకు యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేసుకోవటం అభినందనీయం అన్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి పుణ్యక్షేత్రాల చెంత ఉన్న గుడిమల్లం ఆలయాన్ని అభివృద్ధి పరచుటకు రాష్ట్ర పర్యాటక శాఖ తమ బస్సులను నడుపుటకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగరాజు నాయుడు, ధనుంజయులు నాయుడు, వేమూరి బాలాజి, కమిటి సభ్యుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# టెంపో డ్రైవర్ సజీవదహనం


**• రంగారెడ్డిపల్లిలో రోడ్డు ప్రమాదం • వాహన యజమానికి గాయాలు**

**• ప్రకాశం జిల్లా రాచర్ల మండలం రంగారెడ్డిపల్లి వద్ద ఘటన**



రాచర్ల, డిసెంబరు 31 ప్రభాతవార్త: ప్రకాశం జిల్లా రాచర్ల మండలం రంగారెడ్డి పల్లి గ్రామ సమీపంలోని నంద్యాల- ఒంగోలు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎర్రిస్వామి(50) సజీవ దహనం కాగా డ్రైవర్ ప్రక్క ఉన్న వాహన యజమాని కన్నంపల్లి జయరామిరెడ్డికి గాయాలయ్యాయి. ముందున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రమాద తీరును బట్టి తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే ఎపి02 టిహెచ్ 4111 నంబర్ గల వాహనం జీడిపప్పు లోడుతో తుని నుండి అనంతపురం వెళ్తున్నది. బుధవారం తెల్లవారుజామున 5:45గంటల ప్రాంతంలో రాచర్ల మండలం రంగారెడ్డిపల్లి సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్ర మత్తు కారణం లేదా ప్రమాదవశాత్తు ముందున్న, లేదా వెళ్తున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో డ్రైవర్ వాహన క్యాబిన్‌లో స్టీరింగ్, సీట్ మధ్యలో ఇరుక్కుపోయి బయటపడే వీలు లేకపోవడంతో సజీవ దహనమయ్యాడు. డ్రైవర్ ప్రక్కన ఉన్న వాహన యజమాని స్వల్ప గాయాలతో బయటపడగా 108 వాహనం ద్వారా అతనిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిఐ పి చంద్రశేఖర రావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమవుతున్న వాహనం మంటలను ఆర్పివేశారు. రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటుచేసి, సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని యడవల్లి వీఆర్వో ఎస్ రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# వక్ఫ్‌బోర్డు సమావేశం... ముతావలీల నియామకం



విజయవాడ (గన్నవరం), డిసెంబరు 31 ప్రభాతవార్త: వక్ఫ్‌బోర్డు సమావేశంలో పలు మేనేజింగ్ కమిటీలు, ముతావల్లిలను నియమించారు. వక్ఫ్‌బోర్డు 11వ సమావేశం బుధవారం విజయవాడ కాళేశ్వరావు మార్కెట్‌లోని ఏపివక్ఫ్‌బోర్డు కార్యాలయంలో చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 28జిల్లాల ఇన్స్‌పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్‌లతో జిల్లాల, శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు, ఫిర్యాదులు, పాత ఉత్తర్వుల అమలుపై చర్చించారు. మెమొలు క్లియర్ చేయటంపై జరుగుతున్న ఆలస్యంపై చైర్మన్ అధికారులను వివరణ కోరారు. ఫేస్-1 ఉమీద్ పోర్టల్ నమోదు 100శాతం పూర్తిచేసినందుకు ఇన్స్‌పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్‌లను అభినందించారు. ఈస్ఫూర్తితో ఫేస్-2 నమోదును సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. పెండింగ్ పనుల్లో నిర్లక్ష్యం వీడి పనులను వేగవంతం చేయాలని, నిర్దిష్టగడువు నిర్దేశించుకుని పనులు పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బోర్డుసభ్యులు ఎమ్మెల్సీ రూహుల్లా, ఎమ్మెల్యే మొహమద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్‌బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకిర్ అహ్మద్, సీఈఓ మొహమద్ ఆలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.



# బర్డ్ ఆస్పత్రిలో త్వరలో వైద్యులు భర్తీ

**మోకాలిమార్పిడి శస్త్రచికిత్సల రోగులకు చెన్నై ట్రస్ట్ ఉదారత**

తిరుమల, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: దక్షిణ భారతదేశంలోనే పేరెన్నికగన్న ప్రముఖ ఆర్థో ఆస్పత్రి టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో ఖాళీలను భర్తీచేయడానికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆదేశించారు. ఇప్పటికే అవసరమైన వైద్యుల నియామకం, ఖాళీల భర్తీపై మరింతమంది డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది నియామకం కానున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు కలిగిఉండి, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుంటున్న రోగులలో ఏటా వందమంది నుండి 150మంది రోగులకు అయ్యే పూర్తి ఖర్చును భరించడానికి చెన్నైకి చెందిన గువీ హెల్త్‌కేర్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను వినియోంచుకోవడంపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, టిటిడి బోర్డు సభ్యులు జానకిదేవి, నరేశ్‌కుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.


శ్రీవాసుదేవానంద సరస్వతి జీకి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మవారి సేవలో శ్రీవాసుదేవానంద సరస్వతి జీ

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 31 ప్రభాతవార్త: శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లోని ముఖ్యమైన ధర్మకర్తలలో ఒకరైన పూజ్య శ్రీ స్వామి వాసుదేవానంద సరస్వతి జీ మహారాజ్ (ప్రయాగ్‌రాజ్) బుధవారం దుర్గమ్మవారి దర్శనానికి రాగా ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామిజీ శ్రీఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దుర్గమ్మవారి ఆలయానికి విరాళాలు:**

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన మద్దూరి శ్రీనివాసరావు, వీర వెంకట శ్రీ లక్ష్మి దంపతులు, వారి పిల్లలు సాన్వి, షైవి రూ. 1 లక్ష విరాళం అందించారు. విశాఖపట్నంకు చెందిన వంగపండు తిరుపతి, సత్యవతి దంపతులు శ్రీ కనకదుర్గ దేవస్థానం డెవలప్‌మెంటల్ ట్రస్ట్ పథకం కింద ఆలయానికి రూ. 1,00,116/ విరాళంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. ఆలయ అర్చకులు, అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

## వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని, నేరాలు పెరిగాయని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని తెలిపారు. బాధిత మహిళలకు వైసిపి అండగా ఉంటుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల్లో జాతీయ స్థాయిలో రాష్ట్రం అట్టడుగున ఉందన్నారు. శాంతిభద్రతల వైఫల్యంపై సిఎం చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ రాశారని, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు స్వయంగా తెలిపారని వివరించారు. జగన్ హయాంలో దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటుచేసి మహిళలకు అండగా ఉన్నామన్నారు. ఇక యాప్ పేరుతో సచివాలయ ఉద్యోగులను వేధించడం సరికాదని, వాట్సాప్ గవర్నెన్స్ ఫెయిలైతే ఆ నెపం సచివాలయ ఉద్యోగులపై పెడితే ఎలాగని వైసిపి ఉద్యోగుల విభాగం నాయకులు చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. మనమిత్ర యాప్ పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ సేవలను 68 శాతం మంది ప్రజలు ఉపయోగించడం లేదని ప్రభుత్వ సర్వేలో వెల్లడైందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ బాగుందని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలపై బలంగా రుద్దారన్నారు.

**ప్రసాదంలో నత్త ఉందన్న వారిపై కేసు: నాగార్జున యాదవ్**

సింహాచలం ఆలయంలోని పులిహోరలో నత్త వచ్చిందని ఫిర్యాదు చేసిన వ్యక్తిపైనే కేసు నమోదు చేశారని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అన్నారు. పులిహోరలో నత్త ఉందని యాత్రికులు ఫిర్యాదు చేస్తే ప్రసాదాన్ని లాక్కొని దిక్కున్నచోట చెప్పుకోవాలన్నారని, సోషల్ మీడియాలో పెడితే వారిపై అన్యాయంగా కేసు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పవర్ చాలా కీలకం

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్
- ఎపి పవర్ యుటిలిటీస్ డైరీ 2026 ఆవిష్కరణ


ఎపి పవర్ యుటిలిటీస్ డైరీ 2026 ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: అన్ని రంగాల్లోకన్న విద్యుత్తు రంగం చాలా కీలకమైనదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయా నంద్ అన్నారు. 24 గంటలూ విద్యుత్తు సరఫరా చేయడం అనేది మన లక్ష్యమన్నారు. ఏపీ పవర్ యుటిలిటీస్ డైరీ 2026 ఆవిష్కరణ, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ 6వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కె.విజయానంద్ పాల్గొన్నారు. విజయానంద్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోకన్న విద్యుత్తు రంగం చాలా కీలకమైనదని 24 గంటలూ విద్యుత్తు సరఫరా చేయడం అనేది మన లక్ష్యమన్నారు. నాణ్యతతో కూడిన విద్యుత్ నిరంతర సరఫరాతో ప్రజల్లో సంతృప్తి స్థాయి ప్రభుత్వంపై గౌరవం పెరుగుతాయన్నారు. విద్యుత్ రంగ సెక్టార్‌లో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. దేశంలో సాంకేతికతను వినియోగించుకునే సంస్థల్లో విద్యుత్ రంగ సంస్థ కూడా ఒకటన్నారు. విద్యుత్ సరఫరాలో తక్కువ స్థాయిలో అనగా 9.6 శాతం మాత్రమే విద్యుత్ లాస్‌తో సరఫరా చేసే రాష్ట్రంగా మనం గుర్తింపు పొందామన్నారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని నాణ్యతను మెరుగు పరుస్తూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేలా మన సంస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ ఆర్థిక సంస్థల సహకారంతో పూర్తి స్థాయిలో నూరు శాతం రాష్ట్రాన్ని విద్యుదీకరించుకున్నామన్నారు. కొండ ప్రాంతాలు గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ అందిస్తున్నామన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో విద్యుత్ రంగం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విద్యుత్ శాఖలో క్రింది స్థాయి నుండి పై స్థాయి అధికారి వరకూ ప్రతీ ఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వర్తించడం మనకు గర్వకారణం అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో విద్యుత్ రంగ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రి ఫేస్ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 2026 ఆర్థిక సంవత్సరానికి యూనిట్ కాస్ట్ 4 రూపాయల 60 పైసలు ఉండేలా అదేవిధంగా 2029 నాటికి కాస్ట్ అఫ్ పవర్ రూ.4 లక్ష్యంతో ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని సిఎస్ కె. విజయానంద్ అన్నారు.

ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ ఏపీ సీపీడీసీఎల్ ఆరవ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక సాంకేతికథ వినియోగించుకొని విద్యుత్ సరఫరాలో లాస్ తగ్గిస్తూ మెరుగైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలు చేస్తూ సాంప్రదాయేతర వనరులు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి తదితర రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటానికి అధికారులు, సిబ్బంది సిద్దంగా ఉండాలని నాగలక్ష్మి అన్నారు.

నెడ్ క్యాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం కమలాకర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించుకున్న ఇంధన లక్ష్యాలను, ముఖ్యంగా సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో సాధించాల్సిన ప్రగతిని వివరించారు.. 2029 నాటికి నిర్దేశించుకున్న ఇంధన సామర్థ్య లక్ష్యాలను చేరుకోవడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఏపీ సిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎపిసిపిఎల్ కంపెనీని ఇంకా ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో కష్టపడుతున్నారని రాబోయే కాలంలో కూడా ఇలాగే పని చేయాలన్నారు.. పీఎం సూర్యఘర్‌ను ప్రతి ఇంటిపైన ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయం కోసం కృషి చేస్తున్నామన్నారు. గతంలో 60 62 ఉన్న ప్రజాభిప్రాయం, డిసెంబర్ నాటికి 75కి చేరింది. దీనిని 85కి తీసుకెళ్లడమే లక్ష్యం అని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్, సరైన వోల్టేజ్ అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను అరికట్టి భద్రతా ప్రమాణాలను పాటించడంపై దృష్టి సారించా మన్నారు. రాష్ట్రాన్ని విద్యుత్ ప్రమాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం, "100 సేఫ్టీ 0 యాక్సిడెంట్స్" అనే లక్ష్యాన్ని చేరుకోవడం మన విధి అన్నారు. విద్యుత్ ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడం ఒక ఉద్యమంలా జరగాలన్నారు. ప్రతి ఇంట్లోనూ మెయిన్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇది షార్ట్ సర్క్యూట్, లీకేజ్ కరెంట్ మరియు ఫాల్ట్ వైరింగ్ వంటి సమస్యల నుండి రక్షణ ఇస్తుందని విజయలక్ష్మి అన్నారు.

జేఎండి (హెచ్ఆర్‌డి) జేఎండి (విజిలెన్స్) సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ గత ఏడాది సుమారు 130 కిలోమీటర్ల సర్క్యూట్ లైన్లను మరియు 1200 మెగా వాట్ల అదనపు ట్రాన్స్మిషన్ సామర్థ్యాన్ని జోడించడం జరిగిందన్నారు. డిస్కాముల పరిధిలో కొత్తగా 27 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గత ఏడాది దాదాపు 80,000 మిలియన్ యూనిట్ల విద్యుత్తును సరఫరా చేయగా, గరిష్ట డిమాండ్ 13,120 మెగావాట్లకు చేరుకుందన్నారు. రాష్ట్ర విద్యుత్ సామర్థంలో సుమారు 40 వాటా సోలార్ మరియు విండ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులదే అని సూర్య సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. అనంతరం విద్యుత్ రంగ సంస్థలకు చెందిన 2026 నూతన క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ పృథ్వీతేజ్, సిజియంలు, జియంలు, సిఇలు, ఎస్ఇలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# సీనియర్ రెసిడెంట్లుగా 784 మంది స్పెషలిస్టులకు పోస్టింగులు

- మానవ జోక్యానికి చెక్
- ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానంలో పిజి వైద్యులకు ఆటోమేటిక్‌గా ఉత్తర్వులు
- 6 నెలల అనంతరం మరో ఆస్పత్రిలో విధులు
- మార్కుల ప్రాతిపదికన పారదర్శకంగా పోస్టింగులు
- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ, డిసెంబరు 31 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలోని సెకండరీ/ టీచింగ్ ఆసుపత్రుల్లో సీనియర్ రెసిడెంట్‌గా ఏడాదిపాటు పనిచేసేలా పీజీ మెడికల్ వైద్యులకు పోస్టింగులు ఇచ్చినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మానవ ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 23 డిపార్ట్మెంట్లలో పోస్టింగులు ఇచ్చినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టింగులు పొందిన వైద్యులు జనవరి 5వ తేదీలోగా సదరు ఆసుపత్రుల్లో విధుల్లో జాయిన్ కావాలని స్పష్టం చేసారు. 202223 విద్యా సంవత్సరంలో రాష్ట్ర కన్వీనర్ కోటాలో, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలలో ప్రవేశాలు పొంది, పీజీ పూర్తిచేసిన వైద్యులు ఏడాదిపాటు తప్పనిసరిగా ప్రాంతీయ, సామాజిక, జిల్లా, బోధనాసుపత్రుల్లో పనిచేసే విధానం అమల్లోకి వచ్చింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గత వారం జారీచేసిన నోటిఫికేషన్ అనుసరించి కన్వీనర్ కోటాలో 784 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో 8 మంది మినహా మిగిలిన వారు ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 348 మందికి (13 డిపార్ట్మెంట్‌లు) జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనిక్, పిడియాట్రిక్, ఇతర స్పెషాలిటీల్లో పనిచేసేలా సెకండరీ (సీహెచ్‌సీ, ఏరియా, డిస్ట్రిక్ట్) ఆసుపత్రుల్లో పోస్టింగులు ఇచ్చారు. మిగిలిన వారిని బోధనాసుపత్రులకు కేటాయించారు. ప్రతి వైద్యుడు 6 నెలలపాటు ఒక బోధనాసుపత్రి, మరో 6 నెలలపాటు సెకండరీ అనుపత్రిలో పనిచేయాల్సి ఉంటుందని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు వెల్లడించారు. ప్రస్తుతం వైద్యులకు అందజేసిన పోస్టింగు ఉత్తర్వుల్లోనే 6నెలల అనంతరం ఏ ఆసుపత్రిలో పనిచేయాలో కూడా స్పష్టంగా తెలిపినట్లు పేర్కొన్నారు. నాన్ క్లినికల్ (ఆరు బ్రాంచ్‌లు) వైద్యులు బోధనాసుపత్రుల్లోనే పనిచేయాలి. అలాగే రేడియోషన్ ఆంకాలజీ వంటి బ్రాంచెస్ వారికీ కూడా టీచింగ్ ఆసుపత్రులలోనే పోస్టింగులిచ్చారు.

మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, పీజీ, ఇతర ప్రవేశాల్లో అనుసరించిన ఆన్లైన్ కౌన్సెలింగ్ విధానాన్నే సీనియర్ రెసిడెంట్స్‌కు పోస్టింగులు ఇవ్వడంలోనూ అనుసరించినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. పీజీ వైద్య విద్య పరీక్షల్లో సాధించిన మార్కుల ప్రతిపాదికన ప్రాధాన్యతా క్రమంలో పోస్టింగులు ఇచ్చామన్నారు. పారదర్శకగా ఈ ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనని వారికి ఒరిజినల్ డిగ్రీ పట్టాల జారీ జరగదని, లేదంటే జరిమానా కింద రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశాను. 784 మందిలో 8 మంది ఆప్షన్లు ఇవ్వలేదని చెప్పారు. నిబంధనల ప్రకారం వీరికి కూడా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పీజీ వైద్య విద్య పూర్తిచేసిన వారు 18 నెలల్లోగా ఏడాదిపాటు ప్రభుత్వ సర్వీసులో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

## రాజస్థాన్ ఓపియం

# స్మగ్లర్ల బెయిల్ రద్దు

**హైదరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో అమాయకులను మాదకద్రవ్యాల వ్యసనపరులుగానూ, చిన్నపాటి స్మగ్లర్లుగా మార్చి లక్షల రూపాయలు సంపాదిస్తున్న రాజస్తాన్‌కు చెందిన ముగ్గురు ఓపియం స్మగ్లర్లకు నాంపల్లి కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను హైకోర్టులో ఈగల్ పోలీసు లు రద్దు చేయించారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. రాజస్తాన్‌లోని జాలోర్‌కు చెందిన సావ్‌లారాం బిష్ణోయ్, హాపురాం బిష్ణోయ్, లాలారాం బిష్ణోయ్‌లు ఈ ఏడాది జూలై నెలలో రాజస్తాన్ నుంచి భారీగా ఓపియం తె స్తూ ఈగల్ పోలీసులకు హైదరాబాద్‌లో పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేసి విచారించగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. అమాయకులను ఓ పియం వ్యసరప రులుగా వీరు మారుస్తున్నట్లు తేలింది. శృంగార సామర్థ్యం పెంచేందుకు ఓపియం వాడాలని యువతను పాడు చేస్తున్నట్లు తేలింది, ఓపియంకు అలవాటుపడిన వారు ఆ తరువాత శారీరకంగా బలహీనంగా మారి అనా రోగ్యం పాలై చివరకు చనిపోతున్నట్లు తేలింది. ఈ ముగ్గురి కారణంగా అనేక మంది వ్యసనపరులుగా మారగా కొందరు స్మగ్లర్లుగా మారారు. వీరిని చంచల్‌గూడ జైలులో నిర్బంధించగా నాంపల్లి కోర్టు వీరికి ఇ టీవలే బెయిల్ ఇచ్చింది. కాగా బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులు మళ్లీ ఇదే దందాను మొదలు పెట్టడంతో నాంపల్లి కోర్టు నిర్ణయాన్ని ఈగల్ పోలీసులు హైకోర్టులో సవాల్ చేసి ముగ్గురి బెయిల్‌ను తాజాగా రద్దు చేయించారు. అనంతరం ముగ్గురిని మళ్లీ అరెస్టు చేసి జైలుకు తరలించారు.

# మహారాష్ట్ర డిజిపిగా సదానంద్ దాతే

## ముంబయి ఉగ్రదాడుల ఏరివేత హీరోకు అత్యున్నత పదవి



**ముంబయి, డిసెంబరు 31:** మహారాష్ట్ర కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి, 26/11 ముంబై ఉగ్రదాడుల హీరో సదానంద్ వసంత్ దాతే నియమితులయ్యారు. ప్రస్తుత డిజిపి రష్మీ శుక్లా జనవరి 3న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆమె స్థానంలో దాతేను నియ మిస్తూ మహారాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన సదానంద్ దాతే, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తూ ఇటీవలే మహారాష్ట్ర కేడర్‌కు తిరిగి వచ్చారు. 2008 నవంబర్ 26న ముంబైపై ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు, అప్పటి అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న దాతే చూపిన ధైర్యసాహసాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. కామా అండ్ అల్బెస్ ఆసు పత్రిలో ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబు ఇస్మాయిల్‌లతో ఆయన ముఖాముఖి తలపడ్డారు. ఈ క్రమంలో ఉగ్ర వాదులు విసిరిన గ్రెనేడ్ పేలడంతో తీవ్రంగా గాయ పడినప్పటికీ, ఆయన వెనక్కి తగ్గకుండా పోరాటం కొనసాగించారు. ఆయన సాహసానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి శౌర్య పతకంతో సత్కరించింది. సదానంద్ దాతే తన కెరీర్‌లో అనేక కీలక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్‌గా, ముంబై జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్, క్రైమ్ బ్రాంచ్‌లోనూ పని చేశారు. మీరాభయం దర్, వసాయి విరార్ (ఎంబీవీవీ) పోలీస్ కమిషనరేట్‌కు తొలి కమిషనర్‌గా కూడా ఆయనే వ్యవహరించారు. కేంద్ర సర్వీసుల్లో భాగంగా సీబీఐలో డీఐజీగా, సీఆర్పీఎఫ్‌లో ఐజీగా కూడా సేవలం దించారు. విద్యాపరంగా కూడా ఆయన ఉన్నత అర్హతలు కలిగి ఉన్నారు. పుణే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందడమే కాకుండా, క్వాలిఫైడ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌గా కూడా గుర్తింపు పొందారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఎంప్యానెల్‌మెంట్ కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన నియా మకాన్ని ఖరారు చేసింది. జనవరి 3న బాధ్యతలు స్వీకరించ నున్న సదానంద్ దాతే, సుమారు 2 లక్షల మంది సిబ్బంది ఉన్న మహారాష్ట్ర పోలీస్ దళానికి నేతృత్వం వహించనున్నారు.

# ఏడు బ్యాంకుల్లో 13.40 కోట్లు

## పైరసీ లావాదేవీల్లో ఐబొమ్మరవి సంపాదన

## ఇంకా బహిర్గతంకాని పలు వివరాలు

## 12 రోజులు విచారణ జరిపిన పోలీసులు




**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** పైరసీ కేటుగాడు ఐ బొమ్మ రవి మూడవ దఫా కస్టడీ విచారణ కు సంబంధించిన రిమాండు రిపోర్టులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. 12 రోజుల పాటు ఇతన్ని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించి సినీ పైరసీకి సంబంధించి కీలక విషయాలను వెలుగులో కి తేవడం తెలిసిందే. దీనిపై సైబర్ క్రైం పోలీసులు బుధవారం నాంపల్లి కోర్టులో రిమాండు రిపోర్టును సమర్పించారు. సినిమా పైరసీ కోసం రవి రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను కొన్నాడని ఇందులో నార్మల్ దానికి 100డాలర్లు, హెచ్‌డి ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడని పోలీసుల రిమాండు రిపోర్టులో వుంది. ఈ సందర్భంగా జరిగిన లావాదేవీలలో సంపాదించిన డబ్బులను దాచుకునేందుకు రవి మొత్తం ఏడు బ్యాంకు ఖాతాలను వాడినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో మొత్తం 13.40 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తేలిందని పోలీసుల రిమాండు రిపోర్టులో వుంది. దీంతో పాటు పైరసీ సినిమాలను బెట్టింగ్ యాప్‌లో ప్రమోట్ చేసినందుకు మరో 1.78 కోట్ల రూపాయలను రవి సంపాదించాడని పోలీసులు రిమాండు రిపోర్టులో తెలిపారు. ఇలా సంపాదించిన సొమ్ము నుంచి 90 లక్షల రూపాయలను రవి తన సోదరి చంద్రికకు పంపినట్లు పోలీసులు తేల్చారు. కాగా ఈ నగదు లావాదేవీలన్నీ రవి డాలర్ల రూపంలోనే జరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. తన స్నేహితుడు రాకేష్ ద్వారా ట్రేడ్ మార్క్ లైసెన్స్, బెట్టింగ్ పైరసా నిర్వహించి వీటి ద్వారా సంపాదించిన సొమ్మును రవి తన జల్సా జీవితానికి వాడినట్లు పోలీసులు తేల్చా రు. సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లిలోనే రవి తన కార్యాలయం నడిపినట్లు పోలీసుల విచా రణలో తేలింది. విదేశాలలో కరేబియన్ దీవులు, నెథర్లాండ్స్‌లో కార్యాలయాలు నిర్వహించాడు. అక్రమాల ద్వారా సంపాదించిన సొమ్ములో పది కోట్ల రూపాయలను రవి జల్సాగా జీవిం చేం దుకు ఖర్చు చేసినట్లు తేలింది. ఖరీదైన పబ్‌లు, ఫైవ్ స్టార్ హోటళ్లలో పార్టీలు చేసుకునేవాడని పోలీసు లు తేల్చారు. రవి ఖాతాలలో ప్రస్తుతం మూడు కోట్ల రూపాయలు వున్నాయని, వీటిని జప్తు చేసినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు.

# 'నా అన్వేషణ్ణ యూట్యూబ్ ఛానెల్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాత వార్త:** నా అన్వేషణ యూ ట్యూబ్ ఛానెల్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం సోషల్ మీడియా ద్వారా నా అన్వేషణ యూ ట్యూబ్ ఛానెల్ మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఆరోపణలపై సినీనటి కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నా అన్వేషణ పేరుతో కొనసాగుతున్న యూ ట్యూబ్ ఛానెల్ ద్వారా నిందితుడు అన్వేష్ హిందూ సమాజం, హిందూ మతం, దేవతలు, సంప్రదాయాలపై దూషణాత్మక, అభ్యంతరకర, రెచ్చ గొట్టే వ్యాక్యలు చేస్తూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హిందూ సంప్రదాయాలను అవమానించడం, పురాణాలను వక్రీకరించడం, మత విద్వేషాలను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

## జనవరి 10, 11 తేదీలలో

# ఫ్లెమింగో ఫెస్టివల్

- అత్యంత ప్రజారంజకంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్
- పండుగ వాతావరణంలో చేపడుతాం
- సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ




సూళ్లూరుపేట, డిసెంబరు 31 ప్రభాతవార్త: జనవరి 10, 11 తేదీలలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్-2026ను అత్యంత ప్రజారంజకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూళ్లూరుపేటలోని స్థానిక టీవీ ఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఫ్లెమింగో ఫెస్టివల్-2026 నిర్వహణపై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జూ క్యూరేటర్ సెల్వం, సూళ్లూరుపేట శ్రీకాళహస్తి ఆర్‌డిఓలు కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి,పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్, డిఎస్పీలతో కలిసి కోఆర్డినేషన్ మీటింగును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ... జనవరి 10, 11 తేదీలలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్-2026ను విన్నూతంగా అందరిని ఆకర్షించేలా, ప్రజారంజకంగా నిర్వహించాలన్నారు. ఈ ఫెస్టివల్ నిర్వహణపై ప్రత్యేక ఫ్లెమింగ్ ఫెస్టివల్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత సంవత్సరం మూడు రోజులపాటు ఫ్లెమింగ్ ఫెస్టివల్ ని జరుపుకోవడం జరిగిందని ఈ సంవత్సరం రెండు రోజులు పాటు ఏడు ప్రాంతాలలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సూళ్లూరుపేట, నేలపట్టు, బి వి పాల్యం, అటకానితిప్ప, ఇరుకుం ఐలాండ్, శ్రీ సిటీ, ఉబ్బల మడుగు జలపాతం తదితర ప్రాంతాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ముఖ్య వేదిక ఉంటుందని, వివిధ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ చాలా పెద్ద కార్యక్రమని, అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చేపట్టాలన్నారు. గత సంవత్సరం ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం జరిగిందని ఈ సంవత్సరం కూడా రాజకీయ నాయకులు, మీడియా సహకారంతో విజయవంతంగా జరిగేలా సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందుకు తగిన విధంగా అన్ని శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. బీవి పాలెంలో అడ్వెంచర్ ఈవెంట్స్, ఏరో స్పోర్ట్స్, హార్ట్ ఎయిర్ బెలూన్స్ ప్లాన్ చేస్తున్నామన్నారు.ఇరుకం నందు బోటింగ్ ఏర్పాటుతో పాటు లైఫ్ జాకెట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ పర్యాటక ప్రాంతాలలో అవసరమైనరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని అటకాని తిప్ప పర్యాటక ప్రాంతం వద్ద వ్యూ పాయింట్స్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో చేపడుతామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. గతంలో నిర్వహించిన ఉత్సవాన్ని అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని అదే రీతిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను అధికారులందరూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. నేలపట్టు, బీవీ పాలెం వద్ద మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భ్రమల్లో బతుకుతున్న హరీష్‌రావు

## ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:** చంద్ర బాబు నాయుడు చెప్పినట్లు రేవంత్ రెడ్డి చేస్తున్నారని గోబెల్ ప్రచారం చేస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను రేకెత్తించి మళ్లీ అధికారంలోకి రావాలన్న భ్రమల్లో హరీష్ రావు బతుకుతున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ అసత్య ప్రచారం చేయడమే హరీష్ రావు అజెండా పెట్టుకొన్నారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో దక్షి ణ తెలంగాణలో కృష్ణ నదిపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం,వైఎస్ఆర్ మొదలు పెట్టిన ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా నది తెలంగాణ భూభాగంలో 69 శాతం ప్రవహిస్తుంటే 812 టిఎంసిల కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 299 టీఎంసిలు చాలు అని కెసిఆర్, హరీష్ రావు ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నిం చారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పాత కాంట్రాక్టర్లు ఉంటే కమీషన్లు రావని కొత్త టెండర్లు పిలిచారని విమర్శించారు. తుమ్మిడిహెట్టిని కాదని గోదావరి నదిలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టింది కేవలం కమీషన్ల కోసమే కదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు వచ్చి గోదావరి, బనకచర్ల,పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రజలను హరీష్ రావు కన్ఫ్యూజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ నీటి హక్కుల ప్రకారం కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 500 పైగా టిఎంసిలు రావాలని చెప్పారు. బనకచర్లపై జనవరి 5 వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ ఉందని చంద్రబాబు నాయుడు,రేవంత్ రెడ్డి ఒక్కటే అని సెంటిమెంట్‌తో లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ డ్రామాలను తెలంగాణ, ఆంధ్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నీళ్లు,నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేశారు రాయలసీమను రతనాల సీమ చేస్తాను అన్నది ఎవరు ?బేసిన్లు,భేషజాలు లేవు అన్నది ఎవరు?3 వేల టిఎంసిలు గోదావరి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి అని అన్నది మీ మామ కెసిఆర్‌కాదా..? అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.



కృష్ణా నదీ జలాల్లో పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎంత ఉందో దానికి దామాషాగా అంత వాటా మాకు కావాలని రేవంత్ రెడ్డి పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన హామీలతో పాటు పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని పార్లమెం

# శిక్షణ పొందిన విద్యార్థులు వెయ్యికి చేరిక

## పిపిపి విధానంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణ

### రేవంత్ రెడ్డి ఛాన్స్‌లర్‌గా, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి వైస్ ఛాన్స్‌లర్‌గా వర్సిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. డిసెంబరు31:** తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కీలక మైలురాయిని చేరింది. స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరుకుంది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాన్ని అందించే లక్ష ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి గత ఏడాది ఆగస్టు 1న శంకుస్థాపన చేశారు. ఈ యూనివర్సిటీని పీపీపీ విధానంలో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాన్స్‌లర్‌గా, విశ్రాంత ఐఏఎస్ అధి కారి సుబ్బారావు వైస్ ఛాన్స్‌లర్‌గా ఉన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షి స్తోంది. పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డుకు ఆనంద్ మహీంద్రాచైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటిలో తాత్కాలిక క్యాంపస్ నిర్వహిస్తున్నారు. లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్,ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటిరంగాల్లో స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, ఏఐజీ, అపోలో ఆసు పత్రులు,

# రూ.226.15కోట్ల ఆదాయం జమచేసిన విజిలెన్స్

## ప్రభుత్వశాఖలు కోరిన 292 విజిలెన్స్‌విచారణలు

### క్షేత్రస్థాయి నిఘాతో చేపట్టిన 480 విచారణలు

### విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డిజి శిఖాగోయల్




**హైదరాబాద్, డిసెంబరు 31,ప్రభాతవార్త:** విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అక్రమార్కులపై దాడులు జరిపి ప్రభుత్వ ఖజానాకు రూ.226.15కోట్లు జమ చేయడంతోపాటు,రూ.114.95కోట్ల విలువ కలిగిన ధాన్యం, బియ్యం తదితర నిత్యవసర వస్తువులు జప్తుచేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డిజి శిఖాగోయల్ తెలిపారు. బుధవారంతో ముగిసిన 2025 సంవత్సరంలో వివిధ శాఖలు 292 ఫిర్యాదులు చేసి విచారణలు కోరగా వాటిని పూర్తిచేయడంతోపాటు, విజిలెన్స్ఎన్‌ఫోర్సుమెంట్ క్షేత్రస్థాయి సిబ్బంది నిఘాపెట్టి 480 అక్రమాలను గుర్తించి విచారణ చేపట్టి పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రూ.228.31కోట్ల పన్నుఎగవేత చేసే అంశాలను గుర్తించి అందులో రూ. 213.58కోట్లు ఖజానాకు చెల్లించేలా చేశారని డిజి శిఖా తెలిపారు. సివిల్‌సప్లయ్ శాఖకు చెందిన 451 చౌకధరల దుకాణాలను, ఎంఎల్ఎస్‌పాయింట్,రైసుమిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి 114.95కోట్ల రూపాయల ధాన్యం, బియ్యం, ఇతర నిత్యావసరాలను జప్తుచేశామని తెలిపారు. 24వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. 203 రహదారులలో 18137 వాహనాలను ప్రతిచయంగా తనిఖీలు చేసి 3,994 కేసులు నమోదు చేశామని తెలిపారు. అధిక బరువు కలిగిన మైనింగ్, టాక్స్‌చెల్లించని వస్తువుల రవాణ, ఫిట్‌నెస్‌లేని వాహనాలు వంటివి గుర్తించి రూ.12.51కోట్లు జరిమానా విధించామని తెలిపారు. విజిలెన్స్ఎన్ ఫోర్సుమెంట్ పత్తి,ధాన్యం కొనుగోలు అక్రమాలపై దృష్టిసారించిందని రైతులు కూడా ఏమైన ఫిర్యాదులు ఉంటే 14432కు ఫిర్యాదు చేయాలని సూచించారు. యూరియా పంపిణీ, ప్రయాణీకుల వాహనలు వంటి అంశాలతో పాటు అనేక అంశాలలో ప్రజలకు సేవచేయడానికి నిరంతరం నిఘా పెట్టామని తెలిపారు.

# అమెరికాలోని భారతీయులకు ట్రంప్ అన్యాయం

## హిందువులను విదేశాల్లో చంపుతున్నా మోడీ మౌనం: మాజీ ఎంపి వి హనుమంతరావు

**హైదరాబాద్,డిసెంబరు31,ప్రభాతవార్త:** అమెరికాలో నివసించే భారతీయులకు చాలా అన్యాయం జరుగుతుందనీ అమెరికా నుండి భారతీయులను పంపించే కుట్ర ట్రంప్ చేస్తునాడనీ భారత ప్రధాని మోడికి మౌనం తగదని మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం మాట్లాడుతూ ట్రంప్ గ్రీన్‌కార్డు కలిగిన వారి పైన కూడా తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీసా ఉన్న భారత్ ప్రజలను ట్రంప్ ఇబ్బందులకు గురిచేయడం పై మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. హిందూ దేశం పేరుతో రాజ్యాంగాని తుంగలోతొక్కే ప్రయత్నం మోడీ చేస్తుండనీ ఆరోపించారు. నెహ్రూను పేరు పక్కకు పెట్టే ప్లాన్ గాంధీ పేరు మార్చే ప్లాన్ మోడీ చేస్తుండని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్ణయం మేరకు గ్రామ గ్రామనా కేంద్ర పై మోడీ పై నిరసన తెలియజేయాలని కోరారు. జాతి పితా మహాత్మా గాంధీని దేశ విదేశాలు గౌరవిస్తే మోడీ మాత్రం అవమాన పరచడం దారుణమని ఆయన అన్నారు. భారత్ లో నెంబర్ వన్‌సిటీ గా హైదరబాద్ కాబోతుందనీ,తెలంగాణ కూడా నెంబర్ వన్ స్థాయికి ఎదిగిందని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు పై ప్రతి గ్రామంలో మోడీ పై యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. హిందువులను చంపుతుంటే మీ మోడీ ప్రభుత్వం ఏమి చేస్తుందని నిలదీశారు. మూడు సార్లు ప్రధాని అయిన మోదీ బిసి సంక్షేమం పైన ఎప్పుడైనా మాట్లాడినవా..? అని ప్రశ్నించారు. హిందూ మతం పేరుతో దేశాని



చిన్నభిన్నం చేయాలని చూస్తే ఊరుకోం అని హెచ్చరించారు. మోడీ అమెరికా లో ఉన్న భారత్ ప్రజలను కాపాడే ప్రయత్నం ఎందుకు చేయట్లేదో చెప్పాలని ప్రశ్నించారు.

# 24 యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లకు పరిష్కారం

## టిసిజిఓఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. డిసెంబరు31:** తెలంగాణ రాష్ట్ర సహకార గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్ (గిదిబివీతి) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర సహకార అధికారుల డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని గృహకల్ప భవన్, సహకార సంఘాల కమిషనర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సహకార రంగం బలోపేతానికి ఉద్యోగుల కృషి అమూల్యమని పేర్కొన్న మంత్రి, ప్రభుత్వం తీసుకొచ్చే నూతన విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. సమయపాలన, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ ద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీ స ు క ు ర ా వ ా ల ని ఆకాంక్షి ంచారు.ప్రమోషన్ల సమస్యపై సానుకూల స్పందసహకార శాఖలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించారు. దిగువ స్థాయి ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ, సహకార సంఘాల కమిషనర్ కె. సురేందర్ మోహన్ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఉద్యోగ వర్గాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు శాఖ పరంగా నిరంతర కృషి చేస్తామని తెలిపారు.అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.టిసిజిఓఏ రాష్ట్ర అధ్యక్షులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ, సహకార శాఖ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు, సంస్థలు, ఫెడరేషన్లకు చట్టపరమైన మార్గనిర్దేశం చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి ఫీల్డ్ ఉద్యోగులకు ఎన్నో సంవత్సరాలుగా టిఏలు రావడం లేదని, ఇతర శాఖల మాదిరిగా సహకార శాఖ అధికారులకు కార్ అలవెన్సులులేవని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.అదనపు రిజిస్ట్రార్ నుంచి డీసీఓ వరకు కార్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో వివిధ జిల్లాల డిసిజిఓఏ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నాన్‌గెజిటెడ్‌సంఘాల ప్రతినిధులు, సహకారశాఖ

# సంక్షేమం, అభివృద్ధితో తెలంగాణ పరిఢవిల్లాలి

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో పరిఢవిల్లాలని ప్రజలందరి మంచి జరుగాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సమృద్ధి నింపాలని ఆకాంక్షి ంచారు. గత ఏడాది ప్రజాస్వామ్య విలువలను మరింత బలపరిచేలా, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిన సంవత్సరమని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, మహిళలు, యువత ఆశలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని అన్నారు. పేదల సంక్షేమం, విద్య, వైద్య సేవల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో చేపట్టిన చర్యలు కొత్త ఆశలను రేకెత్తించాయని వివరించారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ మరింత ప్రగతిపథంలో సాగాలని, గ్రామాల నుంచి పట్టణాల వరకూ సమాన అభివృద్ధి జరగాలని కోరారు. రైతులకు న్యాయం, యువతకు ఉపాధి, మహిళలకు భద్రత, సామాజిక



వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పాలన మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా కొనసాగు తుం దని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్ర అభివృద్ధికి ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా సమైక్యతతో ముందడుగు వేస్తేనే బలమైన తెలంగాణ సాధ్యమని అన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఆర్థిక భద్రత కలగాలని ఆకాంక్షి స్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక నూతన సంవత్సర

# నూతన విద్యా విధానంలో టిశాట్ భాగస్వామ్యం

## మంత్రి శ్రీధర్ బాబును కోరిన టిశాట్ సిఇఒ వేణుగోపాల్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. డిసెంబరు31:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే నూతన విద్యా విధానంలో టిసాట్ నెట్వర్క్‌ను భాగస్వామిని చేసే విధంగా చూడాలని ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కోరారు. మంత్రి శ్రీధర్ బాబును బుధవారం కలిసి నూతన విద్యావిధానంలో టిసాట్ భాగస్వామ్యం పేరుతో టిసాట్ రూపొందించిన విధి విధానాల ప్రణాళిక డాక్యుమెంట్‌ను సీఈవో అందచేశారు. విద్యా శాఖకు సంబంధించి ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు యూనివర్సిటీ స్థాయిలోనూ టిసాట్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని సీఈవో వేణుగోపాల్ రెడ్డి మంత్రికి తెలిపారు. విద్యా ఛానళ్ల ప్రసారాల్లో 39 వేల వీడియోలు కలిగి 140 మిలియన్ వ్యూస్‌తో దేశంలోనే టిసాట్ మొదటి స్థానంలో నిలిచి, తెలంగాణలోని సుమారు 80 శాతం చదువ




**టిశాట్ రూపొందించిన విధి విధానాల ప్రణాళిక డాక్యుమెంట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుకు అందించిన సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి**

రులకు వివిధ రకాల కార్యక్రమాలతో చేరువైందని వివరించారు. ఆధునిక సమాజంలో పూర్తిగా డిజిటల్ మీదే విద్యా వ్యవస్థ ఆదారపడే అవకాశాలున్నందున భవిష్యత్‌ను ఆలోచించి టిసాట్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని వేణుగోపాల్ రెడ్డి మంత్రికి వివరించారు. ఇటీవలి కాలంలో "ఆన్యువల్ స్టూడెంట్ కాంపిటషన్స్ 2025 పేరుతో టిసాట్ నిర్వహించిన పోటీలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగాన్ని భాగస్వాములను చేయడమే అందుకు ఉదాహారణ అని గుర్తుచేశారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించబోయే నూతన విద్యా విధానంలో టిసాట్‌ను సైతం భాగస్వామిని చేస్తే డిజిటల్ కంటెంట్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి టిసాట్ డిజిటల్ సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఐటి శాఖ పరిధిలో ఉన్న టిసాట్ నూతన విద్యావిధాన రూపకల్పనంలో భాగస్వామిని చేసేలా చూడాలని కోరారు. మంత్రిని కలిసిన సందర్భంగా సీఈవో వేణుగోపాల్ రెడ్డి వెంట టిసాట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, ఎండీ సాదిక్ ఉన్నారు.

# వ్యవసాయ వర్సిటీ అభివృద్ధికి రూ.500కోట్లు

## మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహను కలిసిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నేతలు

**అత్తాపూర్, డిసెంబరు 31,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బోధన,బోధనేతర ఉద్యోగ సంఘాల నేతలు బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పలు అంశాలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం 500 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించాల్సిందిగా వ్యవసాయ శాఖమంత్రిని ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. నూతన వ్యవసాయ కళాశాల భవనాల నిర్మాణం, మరియు నిర్వహణ, అలాగే విద్యార్థులకు వసతి గృహాల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ప్రస్తుతం విద్యార్థులకు సరిపడా వసతి గృహాలు లేకపోవడం వల్ల గెస్ట్ హౌస్‌లలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాజేంద్రనగర్ క్యాంపస్ లో నాన్ టీచింగ్ ఉద్యోగుల కోసం క్వార్టర్స్ నిర్మించాలని కోరారు. విశ్వవిద్యాలయం ఉప





**బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు**

కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నేతృత్వంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ సరిపడా నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మంత్రికి విన్నవించారు.ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చించి తగిన నిధులు అందేవిధంగా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించాలి:** వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేయాల్సిందిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అంశంపై జనవరి 5వ తేదీన సమావేశ నిర్వహిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

మంత్రులను కలిసిన వారిలో టాసా ప్రతినిధులు డాక్టర్ కమలాకర్, డాక్టర్ రమేష్, అలాగే నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నేతలు ఎస్.జయరాం, పరమేష్, సులోచన, రవీందర్ రెడ్డిలు ఉన్నారు.

# ప్రమాదరహిత ప్రయాణమే లక్ష్యం

## రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:** రోడ్డు భద్రత ప్రమాణాలు ప్రతి ఒక్కరికి తెలిస్తే ప్రమాదరహిత ప్రయాణం చేయడానికి వీలవుతోందని రోడ్డుపై నడిచే పాదాచారులు కూడా ట్రాఫిక్ నిబంధనలపట్ల అవగాహన కలిగి ఉండాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మట్లాడుతూ జనవరి 1 వ తేదీ నుండి జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రవాణా శాఖ పక్షాన జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు అన్ని జిల్లాలు , మండలాలు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు.ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వండి ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్ లో చేరాలని సూచించారు. రవాణా శాఖ సూచనలు పాటించడంతోపాటు ద్విచక్రవాహనదారులు ఇద్దరు హెల్మెట్‌ధరించాలని సూచించారు. మద్యం



తాగివాహనం నడపరాదని హితవుచెప్పారు,రాంగ్ రూట్లో ప్రయాణం వద్దు ఇది కూడా ప్రమాదానికి కారణం అవుతోందని వివరించారు.అతివేగంతో వాహనం నడపటం కారణంగా రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయనీ ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,అధికారులు, విద్యార్థులు,ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలిపారు.

# టెట్ పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించండి

## ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య

**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలో టిజి టెట్ 2026లో భాగంగా జనవరి నెలలో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అనుకూలంగా పరీక్షా కేంద్రాల కేటాయింపు జరగాలని, పరీక్షలకు హాజరయ్యే రోజులను ఆన్ డ్యూటీ (ఓడీ)గా పరిగణించాలని బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య ప్రభుత్వానికి లేఖ రాస్తూ కోరారు. దీనికి సంబంధించిన లేఖను ఎమ్మెల్సీ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించారు.

ఈ ఏడాది జనవరి నెలలో నిర్వహించనున్న టెట్ పరీక్షల కు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరవుతు న్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టెట్ నిర్వహించిన పలు సందర్భాల్లో ఉపాధ్యాయులకు వారి పని చేసే ప్రాంతానికి దూరంగా పరీక్షా కేంద్రాలు కేటాయించడంతో, ప్రయాణ వ్యయ భారమే కాకుండా ఇటు పరీక్షకు హాజరై అటు అదే రోజున తమ విధులు నిర్వహించడం కష్టంగా మారుతోందని ఆ లేఖలో తెలిపారు.

ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, టెట్ పరీక్ష రాసే ఉపాధ్యాయులకు అనుకూలంగా అదే జిల్లా లేదా సమీప ప్రాంతాల్లోనే పరీక్షా కేంద్రాలు కేటాయించాలని,వారికి ఆరోజు ఆన్ డ్యూటీగా పరిగణించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ మాల్కా కొమరయ్య కోరారు.

టెట్ పరీక్షను రాసే ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిశీలించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విద్యాశాఖ అధికారులను కోరారు.

# బిసి రిజర్వేషన్లు పెంచాల్సిన బాధ్యత కాంగ్రెస్, బిజెపిలదే

## ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు పెడితే అడ్డుకుంటాం: జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లు పెంచకుండా ఎంపిటిసి,జడ్పిటిసి ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే వేలాది మందితో రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో "బిసి రిజర్వేషన్ల పెంపుపై జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గుజ్జ కృష్ణ సమన్వయంతో అఖిలపక్ష పార్టీలసమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ నేత వి.హెచ్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదానా చారి, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, టీజేఎస్ నేత పల్లె వినయ్, సిపిఐ నేత ధనుంజయ నాయుడు హాజరయ్యారు. ముందుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి రాజకీయ పోరాట కార్యక్రమం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా బిజెపి మోకాలు అడ్డుతుందన్నారు. బిసిరిజర్వేషన్ల పెంపు కోసం జనవరిలో బీసీ సర్పంచుల రాష్ట్ర సమావేశం, ఫిబ్రవరి రెండో వారం నుండి బీసీల రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా



**అభివాదం చేస్తున్న గుజ్జకృష్ణ,మధుసూధనాచారి, శ్రీనివాస్‌గౌడ్,జాజుల, విహెచ్, దత్తాత్రేయ తదితరులు**

చేపట్టి ఏప్రిల్ మాసంలో లక్షల మందితో హైదరాబాదులో భారీ బహిరంగ సభ నిర్వహి స్తామన్నారు. బిసిల పోరాట ఫలితంగానే బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు 86 సర్పంచులుగా గెలిచారని ఇది తమ పోరాట విజయమని ఆయన తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశం జాతీయస్థాయి పరిధిలో ఉందని బిసి సంఘాలు ఒక్కతాటి మీదికి వచ్చి బిసి రిజర్వేషన్ల పెంపు కోసం జాతీయస్థాయిలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.కాంగ్రెస్ నేత వి హనుమంతరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని పైన ఒత్తిడి పెంచడానికి వచ్చే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతామన్నారు. మధుసుధనా చారి, వి శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 42 రిజర్వేషన్లు కల్పించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కోచైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందరం గణేష్ చారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, బీసీ మహిళా సంఘం అధ్యక్షులు బి మని మంజరి సాగర్, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, కాటేపల్లి వీరస్వామి, పిట్ల శ్రీధర్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ మట్ట వెంకట్ గౌడ్, జాజుల లింగం గౌడ్, ఇదిగ శ్రీనివాస్ గౌడ్, వేముల రామకృష్ణ, గూడూరు భాస్కర్ మేరు, ఉదయ్ నేత, తారాకేశ్వరి, మాధవ్ మేరు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్ డిస్కంకు ఆదిలోనే రూ.9,032 కోట్ల రుణాలు

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉచిత విద్యుత్ నిమిత్తం కొత్తగా ఏర్పడుతున్న మూడో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)కు ఆదిలోనే అప్పుల భారం తగులుకుంది. కేవలం ఉచిత పథకాలకే పరిమితమైన ఈ విద్యుత్ పంపిణీ సంస్థ త్వరలో అందుబాటులోకి వచ్చేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్త య్యాయి. ఇప్పటి వరకూ ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలను మూడో డిస్కంకు కూడా కేటాయించారు ఇందులో భాగంగా 9,032 కోట్ల రూపాయల మేర రుణాలు సైతం మూడో డిస్కంకే బదలాయించారు. దీంతో కొత్త డిస్కంకు అప్పుల భారం తగులుకుంది. అలాగే ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు విద్యుత్ వినియోగించినందుకు గాను బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు భారీ మొత్తంలో బకాయిలు పడ్డాయి. వీటిని కూడా విభజించి మూడో డిస్కంకు 35,982 కోట్ల రూపాయలు కేటాయించారు. జెన్‌కో, సింగరేణి సహా ఇతర జనరేటర్లకు విద్యుత్తు చార్జీల కింద చెల్లించాల్సిన మొత్తం 26,950 కోట్ల రూపాయలు మూడో డిస్కం ఖాతాలోనే పడ్డాయి. అంటే మొత్తంగా మూడో డిస్కం అప్పులు, బకాయిలు అన్ని కలిపితే 71,964 కోట్ల రూపాయలను కేటాయింపు చేశారు. కానీ ఈ డిస్కంఆస్తులు రూ.4,929 కోట్లు మాత్రమే. వ్యవసాయం సహా ఇతర పథకాలకు విద్యుత్తు రాయితీ కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా 13,499 కోట్ల రూపాయలను కేటాయిస్తోంది. దీంట్లో వ్యవసాయానికి ఇచ్చేది 11,602 కోట్ల రూపాయలు, గృహజ్యోతి, విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు కింద ఇస్తున్నది 1,896 కోట్ల రూపాయలుగా ఉన్నాయి.

## తిరుప్పావై

### 17వ పాశురము



అమ్బరమే ! తణీరే! శోరే !
అఱమ్సెయ్యుమ్,
ఎమ్బెరుమాన్ ! నన్దగోపాలా !
ఎళున్దిరాయ్,
కొమ్బనార్కెల్లామ్ కొళున్దే!
కులవిళక్కే!
ఎమ్బెరుమాట్టి! యశోదాయ్ !
అఱివుఱాయ్,
అమ్బరమ్ ఊడఱుత్తు ఓంగి
యులకళన్ద,
ఉమ్బర్కోమానే!ఉఱంగాతెళున్దిరాయ్
శెమ్పొఱ్కళలడిచ్చెల్వా! బలదేవా !
ఉమ్బియుమ్ నీయుమ్ ఉఱంగేలో
రెమ్బావాయ్

అన్నం కావలసినవారికి అన్నము, దప్పిక అయిన వారికి నీరు, వస్త్రములు లేనివారికి వస్త్రములు ఏ ఆశ లేకుండా దానము చేయువాడు. నందగోపాలుడు. అటువంటి నందగోపాలుడిని స్వామిని మేల్కొలుపమని కోరుతున్నారు. సుకుమార శరీరముగల, లేత చిగురులాంటి గోపాలవంశపు మణిదీపము అయిన యశోదను, "మా స్వామిని లేప వమ్మా" అని కోరుతున్నారు. స్వచ్ఛమైన ఎర్రని బంగారముతో చేయబడిన కడియమును కాలికి తొడుక్కున్న బలరామా, నీవన్నా నీ తమ్ముడిని మేల్కొలుపుము.=ఆకాశ మధ్యభాగమును చీల్చుకొని లోకము లన్నింటిని కొలిచిన త్రివిక్రమా అని పొగుడుతూ "నిత్య శూరులకు నాయకుడా నిదురింపరాదు మేలుకో" అని కృష్ణుడిని కోరుతున్నారు.

ఫలం : "విశ్వాసం కలుగుతుంది"




# నిన్నటి జ్ఞాపకం నేటి సంకల్పం

## నూతన సంవత్సరం

కాలం అనంతం, అజయమైనది. అది ఎవరికోసము ఆగదు. కానీ ఆ అనంతక కాల ప్రవాహంలో మనిషి తనకంటూ కొన్ని గుర్తులను చెక్కుకుంటాడు. అవే పండుగలు. అందులోనూ ప్రపంచం మొత్తాన్ని ఒక్కత్రాటిపైకి తెచ్చే అద్భుత సందర్భం "ఆంగ్ల నూతన సంవత్సరం". కాలచక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. ఒక ఏడాది ముగిసి మరో ఏడాది ప్రారంభం కావడం అనేది ప్రకృతి సహజం. అయితే మానవ జీవితంలో నూతన సంవత్సరం అనేది కేవలం క్యాలెండర్ మారడం మాత్రమే కాదు, అది కొత్త ఆశలకు, సరికొత్త లక్ష్యాలకు ఒక నాంది. గతాన్ని సమీక్షి ంచుకుంటూ, భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రకృతి మనకు ఇచ్చిన గొప్ప అవకాశం ఈ జనవరి ఒకటి. సరికొత్త ఆశయాలతో ఈ నూతన సంవత్సరం జనవరి ఒకటి మన ముందుకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా కుల, మత, జాతి విభేదాలు లేకుండా జరుపుకునే అతిపెద్ద పండుగ. డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలు కాగానే పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలుకుతూ భూగోళమంతా ఒక్కసారి పులకరించిపోతుంది. ఇలా నూతన సంవత్సరం వచ్చిందంటే అందరిలో ఏదో తెలియని అనుభూతి. స్నేహితులు, బంధువులు, ఆత్మీయులతో మదిలో భావాలు, తీయని జ్ఞాపకాలు, మర్చిపోలేని ఆనంద క్షణాలు పంచుకునే రోజు ఇది. అభిరుచులకు తగ్గట్టుగానే అందమైన పుష్ప గుచ్ఛాలు, సరికొత్త రుచుల కేకులు, తీపి గుర్తుల గ్రీటింగ్ కార్డులు విపణిలో సందడి చేస్తున్నాయి. వీటిని ఎల్లవేళలా భద్రపరుచుకుని ఎప్పుడైనా ఆనందానుభూతుల్ని నెమరు వేసుకునేలా ఆకర్షిస్తున్నాయి జనవరి ఒకటిని న్యూ ఇయర్ గా సెలబ్రేట్ చేసుకుంటాము. దీని వెనక పెద్ద చరిత్ర ఉంది. ఆ చరిత్ర గురించి తెలుసుకుందాం. క్రీస్తుపూర్వం 46వ సంవత్సరంలో 'జూలియస్ సీజర్'ని రోమన్ దేశం చక్రవర్తిగా ఎన్నుకుంది. ఆయన చాలా కాలం పాటు ప్రజా రంజకంగా పాలన సాగించారు. అప్పటి నుండి ఆయన ఎన్నికైన రోజున ప్రజలంతా సంబ రాలు చేసుకోవడం మొదలు పెట్టారు. రోమ్‌ని అనుస రించి 1571 సంవత్సరంలో పోపు గ్రెగోరీ క్యాలెండర్‌ని రూపొందించారు. ఆ తర్వాత ఇంగ్లాండు కూడా గ్రెగోరీ క్యాలెండర్‌ని అనుసరించింది. అదే క్యాలెండర్‌ను బ్రిటిష్ పాలకులు తమ ఆక్రమిత దేశాలలో కూడా అమలు పరిచారు. ఆ క్రమంలోనే అన్ని దేశాలు కూడా జనవరి ఒకటిని నూతన సంవత్స రంగా భావించి సంబరాలు జరుపుకోవడం ప్రారంభించారు. ఈ రోజు చిన్నా, పెద్ద తేడా లేకుండా ఊరు వాడ అందరి నోట ఆనందంతో ఉప్పొంగిపోతూ మొదటిగా వచ్చే మాట 'హ్యాపీ న్యూ ఇయర్' ఆపై ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. కేక్ కటింగులు, మిఠాయిలు పంచుకొని నోటిని తీపి చేసుకుంటారు. ఇలా నాలుగు వేల సంవత్సరాల నుండి న్యూ ఇయర్ పండుగని జరుపుకుంటున్నాము. రోమన్ పురాణాల ప్రకారం 'జానస్' అనే దేవునికి రెండు ముఖాలు ఉంటాయి. ఒక ముఖం గడిచిన ఏడాది వైపు చూస్తూ అనుభవాలను నెమరు వేసుకుంటే, మరో ముఖం రాబోయే ఏడాది వైపు చూస్తూ ఆశావహ దృక్పథాన్ని కలిగి ఉంటుంది. రకంగా మొట్ట మొదటి నెల పేరు 'జనవరి' అయింది. నాటి నుండి నేటి వరకు ఎన్ని క్యాలెండర్లు మారినా, మనుషులు మారినా, కొత్తదనం పట్ల ఆకర్షణ మాత్రం అణు మాత్రం తగ్గలేదు. ఇలా ఒక కొత్త ఆరంభం మనిషికి ఎంతటి మానసిక ఉత్సాహాన్నిస్తుందో నూతన సంవత్సర వేడుకలే సాక్ష్యం.






గతంలో జరిగిన వైఫల్యాలను తుడిచివేసి సరికొత్త ఉత్సాహంతో జీవితాన్ని మళ్ళీ ప్రారంభించే 'రీస్టార్ట్ బటన్' తాంటిది ఈ నూతన సంవత్సరం అంటే కేవలం కేకులు కోయడం, కేరింతలు కొట్టడం మాత్రమే కాదు, మనల్ని మనం విశ్లేషించుకోవడానికి ఇదొక చక్కని సమయం. గడిచిన సంవత్సరంలో మనం సాధించింది ఏమిటి? కోల్పోయిందేమిటి? ఎక్కడ తప్పు చేసాం? ఎక్కడ మెరుగుపడాలి? అని ఆలోచించు కున్నప్పుడే కొత్త ఏడాదికి ఒక సార్థకత లభిస్తుంది. లోకంలో చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సహజమో, వైఫల్యం తర్వాత విజయం రావడం కూడా అంతే సహజం. రాబోయే ఏడాది మనకు ఎలాంటి సవాళ్లు విసిరినా వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని మనం పెంపొందించు కోవాలి. అందరితో ప్రేమ, సోదర భావంతో మెలగాలి. 'గతం చరిత్ర భవిష్యత్తు ఒక రహస్యం వర్తమానం ఒక కానుక'. అందుకే ఈ వర్తమానాన్ని మనం ఆనందంగా ఆస్వాదించాలి. అంకెలు మారవచ్చు, క్యాలెండర్లు మారవచ్చు. కానీ మనలో ఉండే మంచితనం, నిరంతనం శ్రమించే గుణం మారకూడదు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి ఇంట విజయాల పంటలు పండించాలని ప్రతి గుండెలో సంతోషం నిండాలని కోరుకుంటూ... నవ వసంతానికి స్వాగతం పలుకుదాం. అందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు,

**-పింగళి భాగ్యలక్ష్మి**

---

వ్యధ

ప్రశ్న: మా అబ్బాయి వ్యసనాలకు బానిసయ్యాడు. లోన్ యాప్‌ల ద్వారా అప్పులు చేసి పీకల మీదకు తెచ్చుకున్నారు. అలాగే తెలిసిన వారందరి వద్ద అప్పులు చేశాడు. మా కోడలు అతన్ని నియంత్రించడంలో విఫలం అయ్యింది.

## ఇల్లు అమ్మడం పరిష్కారం కాదు !



ఆమెకు సరదాలు, షికార్లు, స్టార్ హోటళ్ల భోజనాలు అంటే ఇష్టం. భర్త ఎన్ని అప్పులు చేసినా, తన సరదాలు తీరితే చాలు అనుకుంటుంది. దీనితో ఇప్పటికి రూ. 80 లక్షల అప్పులు చేశాడు. అప్పుల వాళ్ళంతా వత్తిడి చేయడంతో ఉక్కిరిబిక్కిరై మా మీద పడ్డాడు. ఉన్న ఇంటిని అమ్మేసి అప్పులు తీర్చాలని పట్టు పడుతున్నాడు. కాదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తు ఉన్నాడు. మా ఇల్లు అమ్మితే రూ 50 లక్షలు వస్తుంది. మాకు ఉన్న ఆధారం అది ఒక్కటే. మా వారు ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. నెలకు రూ 40 వేలు పెన్షన్ వస్తుంది. ఇంటి ఖర్చులు, మందులకు కలిపి రూ 30 వేలు అవుతుంది. మా అబ్బాయి ఒక ప్రైవేటు సంతలో పని చేస్తున్నాడు. అతనికి నెలకు రూ 30 వేలు జీతం వస్తుంది. అతనికి ఒక ఐదేళ్ల పాప ఉంది. వారు అద్దె ఇంటిలో కాపురం ఉంటున్నారు. ఈ దశలో మాకు సరైన మార్గం చెప్పండి. - ఒక సోదరి శ్రీకాకుళం

జవాబు : అమ్మా, మీ సమస్య ఆర్థిక, మానసిక, కుటుంబ భవిష్యత్తు పరంగా తీవ్ర సమస్యగా భావించాలి. మీరు ఇల్లు అమ్మడం ఈ సమస్యకు పరిష్కారం కాదు. దీని వల్ల మీ కుటుంబం వీధిన పడుతుంది. పైగా అప్పు పూర్తిగా తీరదు. మరింత ఒత్తిడి పెరుగుతుంది. మీ అబ్బాయి వ్యసనాలతో పాటు, డిప్రెషన్ బారిన పడ్డాడు. కాబట్టి తక్షణం అతనికి కౌన్సెలింగ్, డి అడిక్షన్ చికిత్స ప్రారంభిం చండి. అవసరమైతే మానసిక వైద్యుడి సహాయం తీసుకోండి. లోన్ యాప్ వారు బెదిరి స్తుంటే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేయండి. లోన్ యాప్‌ల వేధింపులు, బెదిరింపులు అధిక వడ్డీలు,నేర పరిధిలోకి వస్తాయి. వారు కాల్స్, మెసేజ్‌ల ద్వారా ఒత్తిడి చేస్తున్నారంటే ఆధారాలతో ఫిర్యాదు చేయండి. ఇల్లు మీ పేరుపై ఉందని, అతని అప్పులకు మీరు బాధ్యులు కాదని పోలీసులకు వ్రాత పూర్వకంగా తెలపండి. అదే విషయం అప్పులు ఇచ్చిన వారికి చెప్పండి. ప్రత్యేకంగా జీవిస్తున్న మేజరైన కొడుకు అప్పులకు తల్లి తండ్రులకు ఎలాంటి బాధ్యత లేదు. కళ్ళు మూసుకుని అప్పులు ఇచ్చి, అధిక వడ్డీల కోసం వేధించడాన్ని చట్టం సమ్మతించదు.అతని అప్పులకు తల్లిదండ్రుల ఆస్తి జప్తు చేయలేరు, అమ్మవని ఒత్తిడి చేయడం నేరం అన్న విషయం గుర్తించండి. కాగా మీ కోడలికి పొదుపు పాటించడం నేర్పండి. మానసికంగా స్వస్థత పొందిన తరువాత నెమ్మదిగా పొదుపు చేసి, చట్టబద్ధమైన రీతిలో అంచెల వారిగా అప్పులు చెల్లించమని మీ కొడుక్కి చెప్పండి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

---

## వెన్న మురుకులు


**కావలసిన పదార్థాలు:** బియ్యపు పిండి: రెండు కప్పులు, వాము: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, తెల్లనువ్వులు: ఒక టేబుల్ స్పూన్, వెన్న: రెండు టేబుల్ స్పూన్లు, నూనె: వేయించడానికి సరిపడా.



**తయారీ విధానం:** ఒక గిన్నెలో బియ్యపు పిండి, వాము, ఉప్పు, నువ్వులు, వెన్న వేసి బాగా కలపాలి. తగినన్ని నీళ్లుపోసి ముద్దగా కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోయాలి. పిండిముద్దను కొద్దికొద్దిగా తీసుకుని మురుకుల గొట్టంలో వేసి.. కాగిన నూనెలో ఒత్తుకుని దోరగా వేయించుకుంటే కరకరలాడే వెన్న మురుకులు సిద్ధం.

---

## రంగవల్లి



- శాంతి నర్వా
సరూర్‌నగర్

20 చుక్కలు,
20 వరుసలు
సరిచుక్కలు






### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ వద్ద, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

---

తెర

## 'ఆద్యంతం వినోదభరితం' అనగనగా ఒక రాజు



వైవిధ్యంగా చిత్ర వేడుకను నిర్వహించిన 'అనగనగా ఒక రాజు' బృందం మూడు వరుస ఘన విజయాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'ఆద్యంతం వినోదభరితం' 'అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాజు'తో అలరించను న్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండ గా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తు న్నారు. అసలుసిసలైన పండగ చిత్రంగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది ఈ చిత్రం. ఇక తాజాగా మరో వైవిధ్యమైన వేడుకను నిర్వహించింది చిత్ర బృందం. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ లో 'రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక'ను ఘనంగా నిర్వహించారు. పాత్రికేయ మిత్రుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకలో అడుగడుగునా వైవిధ్యం ఉట్టిపడింది.ఈ వేడుకలో కథానాయకుడు నవీన్ పొలిశెట్టి అదిరిపోయే సినిమాని తీసుకొద్దాం అనుకున్నాను.ఆద్యంతం వినోదభరితం అనగనగా ఒక రాజుకథానాయకుడు నవీన్ పోలిశెట్టి ..ఘనంగా రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక .వైవిధ్యంగా చిత్ర వేడుకను నిర్వహించిన 'అనగనగా ఒక రాజు' బృందం మూడు వరుస ఘన విజయాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.


రోజుల తరబడి

## మెగా విక్టరీ మాస్ సాంగ్ లాంచ్



'మన శంకరవర ప్రసాద్ గారు'లో చిరంజీవి గారు, వెంకటేష్ గారు చేసిన అల్లరి, డ్యాన్స్, చాలా కాలం గుర్తుపెట్టు కుంటారు: మెగా విక్టరీ మాస్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడిమెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ ఖిమన శంకరవర ప్రసాద్ గారుఖి నుంచి పర్ఫెక్ట్ న్యూ ఇయర్ గిఫ్ట్ మెగా విక్టరీ మాస్ సాంగ్ లాంచ్సంక్రాంతి వేడుకలు ముందుగానే ప్రారంభమయ్యాయి, మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కలిసి నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ ఎంటర్‌టైనర్ ఖిమన శంకర వర ప్రసాద్ గారుఖి. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థర్డ్ సింగిల్ మెగా విక్టరీ మాస్‌లో వారి డైనమిక్ కెమిస్ట్రీ అదిరిపోయింది. ఇది ఎక్స్‌యిట్మెంట్‌ని మరింతగా పెంచింది. కోరియోగ్రాఫర్ విజయ్ పోలకి హై వోల్టేజ్ స్టెప్పులతో పాట ఎనర్జీని మరింత పెంచారు. చిరంజీవి గారి ట్రేడ్‌మార్క్ గ్రేస్, వెంకీ గారి కూల్ స్టైల్.. ప్రతి బీట్ పండుగ ఉత్సాహాన్ని తాకేలా వుంది. ఈ ట్రాక్ ఒక విజువల్ ఫీస్ట్, మ్యూజికల్ ట్రీట్..ఫ్యాన్స్‌కి పర్ఫెక్ట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్.చిరంజీవి, వెంకటేష్, అనిల్ రావిపూడి కలయిక మొదటి నుంచే భారీ ఆసక్తిని రేపగా, ఈ పాట ఆ క్యూరియాసిటీని మరింత పెంచింది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన ఈ ప్రాజెక్ట్‌ను ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్‌ను పర్యవేక్షి స్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలు.మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12, 20226న సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. అందరికీ గుడ్ ఈవెనింగ్. అందరూ ఈ పాట చూశారు. ఈపాటికి మీరు ఎంత డాన్స్ చేశారో దానికి రెండింతలు డాన్స్ థియేటర్లో వేస్తారు.

## 'ఓం శాంతి శాంతి శాంతిః' సాంగ్ రిలీజ్



ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్ లో నటిస్తున్న చిత్రం ఖిఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. తి ఖి సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీ.ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సాంగ్ తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా కెమిస్ట్రీని ప్రజెంట్ చేసిన తీరు ఆసక్తికరంగా వుంది. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా కొత్తగా పెళ్లైన జంటగా విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తూ, వారి మధ్య భావోద్వేగాలను సహజంగా పలికించారు.

ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 23న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## 'సిద్ధు గాడి లవ్ స్టోరీ' ఫస్ట్ లుక్ లాంచ్



మహాన్, శృతి, మోహన సిద్ధి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సిద్ధు గాడి లవ్ స్టోరీ". ఈ సినిమాను బాలబ్రహ్మాచారి సమర్పణలో శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్ బ్యానర్ పై సావిత్రమ్మ.సి. నిర్మిస్తున్నారు. రమేష్.సి. దర్శకత్వం వహిస్తున్నారు. వేణుగోపాలచారి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు "సిద్ధు గాడి లవ్ స్టోరీ" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో జరిగింది. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై "సిద్ధు గాడి లవ్ స్టోరీ" మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ డైరెక్టర్ కావాలనే తన కొడుకు రమేష్ కలను "సిద్ధు గాడి లవ్ స్టోరీ" సినిమాతో సావిత్రమ్మ గారు నిజం చేశారు. రమేష్ ను యూఎస్ లో కలిశాను. సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి ఆయన. అక్కడ తన ప్రొఫెషనల్ కెరీర్ కంటిన్యూ చేస్తూ ఇండియా వచ్చి ఈ సినిమా కంప్లీట్ చేశారు. సిద్ధు సిద్దార్థ్ రాయ్ లవ్ స్టోరీని ఖుషి సినిమాలో చూసి హిట్ చేశాం. హీరో మహాన్ మాట్లాడుతూ మా "సిద్ధు గాడి లవ్ స్టోరీ" సినిమాలో మంచి పాటలు, ఫైట్స్ ఉంటాయి. హీరోయిన్ మోహన సిద్ధి మాట్లాడుతూ తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావడం తక్కువ. నాకు "సిద్ధు గాడి లవ్ స్టోరీ" చిత్రంలో అవకాశం కల్పించిన డైరెక్టర్ రమేష్ గారికి థ్యాంక్స్.

## రోజుల తరబడి నటించగల.. మహానటులు ఇంకా పుట్టలేదు !




నటించగల..
మహానటులు ఇంకా పుట్టలేదు!!..
బిగ్ బాస్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని పేర్కొన్నాడు ప్రముఖ నటుడు ఇమ్మాన్యుల్. జబర్దస్తీతో కోట్లాదిమంది అభిమానాన్ని దండిగా గెలుచుకున్న ఇమ్మాన్యుల్.... బిగ్ బాస్ లోనూ తనదైన శైలిలో అలరించి టాప్ 4 ఫైనలిస్ట్ గా నిలిచాడు. ఈ సందర్భంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించాడు. బిగ్ బాస్ అనుభవాన్ని తాను ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటానని పేర్కొన్న ఇమ్మాన్యుల్... అందులో తనతో పాల్గొన్న సహ పార్టిసిపెంట్స్ తో తన అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ముఖ్యంగా సంజనాతో తనకు ఏర్పడిన ప్రత్యేక అనుబంధం జీవితాంతం ఉంటుందని తెలిపాడు!!బిగ్ బాస్ లో ప్రతి ఒక్కరూ నటిస్తారని అందరూ అనుకుంటారని, కానీ గంటల తరబడి, వారాల తరబడి, రోజుల తరబడి నటించగలిగే మహానటులు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరని వివరించాడు.

## ఈషా' బ్లాక్‌బస్టర్స్ సినిమా



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి వంటి బ్లాక్‌బస్టర్స్ అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై ఈషా అనే హారర్ థ్రిల్లర్‌ను అందించారు. ఈ క్రిస్మస్‌కు విడుదలైన ఈ చిత్రం ఈ క్రిస్మస్ విజేతగా నిలిచింది. అంతేకాదు ఈ చిత్రంతో ఈ మిత్రద్వయం హ్యాట్రిక్ విజయాలను అందుకున్నారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో HVR ప్రొడక్షన్స్ బ్యానర్ మీద పోతుల హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం ఈషా. ఈ చిత్రంలో త్రిగుణ్, హెబ్బా పటేల్, అఖిల్ రాజ్, సిరి హన్మంత్, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఈ సినిమాని బన్నీ వాస్, వంశీ నందిపాటి సంయుక్తంగా డిసెంబర్ 25న రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ మూవీ థియేటర్లో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత సురేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో..సురేష్ బాబు మాట్లాడుతూ.. మా దాముని ఫిల్మ్ ఛాంబర్ పనులు చూసుకోమని ఇటు సైడ్ పంపించాం. ఆ బాధ్యతలన్నీ కూడా దాము ఎంతో సమర్థవంతంగా చూసుకుంటున్నారు. .

## మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో
# సెసాపై ఈస్ట్ బెంగాల్ విక్టరీ

**న్యూఢిల్లీ:** భారత మహిళల లీగ్ (ఐడబ్ల్యూఎల్)లో భారత్ మహిళల ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్ గగులోత్ సౌమ్యతో పాటు, ఫాజిలా ఇక్వాపుట్ విజృంభించి హ్యాట్రిక్ సాధించారు. లీగ్‌లో ఈస్ట్ బెంగాల్ తరపున ఆడుతున్న సౌమ్య, ఫాజిలా కూడా హ్యాట్రిక్ గోల్స్ కొట్టడంతో భారత్ మహిళల లీగ్‌లో ఈస్ట్ బెంగాల్ రికార్డు విజయం ఖాతాలో వేసుకుంది. ఈ లీగ్‌లో భాగంగా నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టు 9-0 గోల్స్ తేడాతో సెసా ఫుట్‌బాల్ అకాడమీపై విజయం సాధించింది. సౌమ్య (65వ నిముషం, 54,86) మూడు గోల్స్‌తో సత్తా చాటగా, ఫాజిలా ఇక్వాపుట్ (9, 22, 25, 72) నాలుగు గోల్స్‌తో దుమ్ము రేపింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఈస్ట్ బెంగాల్ జట్టు తమ స్థాయిని ప్రదర్శిస్తూ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. మ్యాచ్ ఆరంభమైన ఆరో నిముషంలోనే సుష్మిత ప్రత్యర్థి పోస్ట్‌పై దాడి చేయగా, అక్కడున్న గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి గోల్ చేసి బెంగాల్ ఖాతా తెరచింది. మరో మూడు నిముషాల తర్వాత సుష్మిత ఇచ్చిన పాస్‌ను షాజిలా మరో గోల్‌తో జట్టు స్కోరును రెట్టింపు చేసింది. ఇక్కడ నుండి బెంగాల్ పదే పదే దాడులతో రెచ్చిపోగా వాటిని అడ్డుకోవడంతో సెసా జట్టు విఫలమైంది. ఈ క్రమంలో మూడు నిముషాల వ్యవధిలో మరో 2 గోల్స్ కొట్టిన ఫాజిలా హ్యాట్రిక్ పూర్తి చేసుకోగా, సులాజన రౌల్, రెస్టి చెరో గోల్ సాధించారు. దీంతో హాఫ్ టైమ్ ముగిసే సరికి బెంగాల్ 6-0తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. ద్వితీయార్థంలో సౌమ్య మరో 2 గోల్స్, ఫాజిలా మరో గోల్ చేసింది. దీంతో ఈస్ట్ బెంగాల్ భారీ విజయాన్ని చవిచూసింది.



## పురుషుల హాకీ ఛాంపియన్‌గా పంజాబ్



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా-2025 రౌండ్‌గ్లాస్ పంజాబ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో, రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీ ఎస్‌జిపిసి హాకీ అకాడమీపై 4-0 తేడాతో నిర్ణయాత్మక విజయం సాధించి టైటిల్‌ను గెలుచుకుంది, సుఖ్‌ప్రీత్ సింగ్ (27వ నిముషంలో), జర్మాన్ సింగ్ (35), సుఖ్‌మన్‌ప్రీత్ సింగ్ (51), మరియు అమన్‌దీప్ (56) గోల్స్ చేసి తమ ఛాంపియన్‌షిప్‌ను ఖాయం చేసుకున్నారు. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో, నామ్‌ధారి 11 జట్టు ఘుమన్‌హెరా రైజర్స్ అకాడమీపై 7-0 తేడాతో ఘన విజయం సాధించింది. బిహారా సింగ్ (23), (52) రెండుసార్లు గోల్స్ చేశాడు, మరియు గురుదయాల్ సింగ్ కూడా (30) మరియు (58) రెండు గోల్స్ చేశాడు. విక్రమ్ (26),నిఖిల్ (41), సెహాజ్‌ప్రీత్ సింగ్ (53) ఒక్కొక్క గోల్ చేశారు. అంతకు ముందు పంజాబ్ మరియు ఎస్‌జిపిసి హాకీ క్లబ్ 3వ హాకీ ఇండియా జోన్స్ ఎ, బి జోన్ల సెమీఫైనల్ మ్యాచ్‌లను గెలుచుకుని ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్లో పంజాబ్ ఘుమన్‌హెరా రైజర్స్ అకాడమీపై 8-1 స్కోరుతో విజయం సాధించింది. ప్రిన్స్ సింగ్ (7, 58) రెండుసార్లు. అమన్‌దీప్ (11, 47) రెండుసార్లు గోల్స్ చేశారు. జర్మాన్ సింగ్ (25, 59) బ్రేస్ సాధించాడు. వరీందర్ సింగ్ 2 నిమిషాల్లోనే స్కోరింగ్‌ను ప్రారంభించగా, ఉత్కర్ష్ 13 నిమిషాల్లో ఒక గోల్ చేశాడు. హితేష్ కటారియా రైజర్స్‌కి (47) ఏకైక గోల్ చేశాడు. రెండవ సెమీఫైనల్‌లో, ఎస్‌జిపిసి నామ్‌ధారి 2-1 తేడాతో విజయం సాధించింది.

## 2025 ప్రపంచ క్రీడల్లో..
# మహిళల ఆధిపత్యం
### భారత్ అథ్లెట్లదే రాజ్యం



**న్యూఢిల్లీ:** భారత మహిళా అథ్లెట్లు ప్రపంచ క్రీడా రంగాలను జయించిన సంవత్సరంగా 2025 నిలిచింది. భారత మహిళా అథ్లెట్లు కేవలం కేవలం అగ్రస్థానంలో రాణించి పతకాలు గెలవడమే మాత్రమే కాదు చెస్, ప్రపంచ ఛాంపియన్ బాక్సర్ల నుండి అంధ క్రికెటర్లు, స్కీయర్లు, ఐస్ హాకీ ఆటగాళ్ళు, కబడ్డీ డిఫెండర్లు, వికలాంగ ఆర్చర్లు మరియు ప్రాథమిక గుర్తింపు కోసం ఇప్పటికీ పోరాడుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారుల వరకు వివిధ రంగాలలో ఇది ప్రత్యేకంగా నిలిచింది. దివ్య దేశ్‌ముఖ్ 2025 ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. 15వ సీడ్‌గా టోర్నమెంట్‌లోకి ప్రవేశించిన దివ్య ప్రపంచంలోని అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణులను మట్టికరిపించింది. అలాగే నవంబర్ 23న, భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు తొలి మహిళల టి20 అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. శ్రీలంక, అమెరికా, పాకిస్తాన్, ఆస్ట్రేలియా ఓడించిన భారత్ ఫైనల్‌లో నేపాల్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తుచేసి టోర్నమెంట్‌ను అజేయంగా ముగించింది. ఇక దశాబ్దాలుగా, ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ భారత క్రికెట్ కథలో కనిపించని అంశంగా ఉంది. నవంబర్ 2న నవీ ముంబైలో అది మారిపోయింది. దక్షి ణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి మహిళల వన్డే ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. భారతీయ మహిళలు బాక్సింగ్ రింగ్‌ను సొంతం చేసుకున్నప్పుడు 2025 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో, ప్రతి భారతీయ పతకాన్ని ఒక మహిళ గెలుచుకుంది. క్రొయేషియాలో జరిగిన ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి ఆంటిమ్ పంగల్ మహిళల 53 కిలోల విభాగంలో 21 ఏళ్ల ఆమె కాంస్యం గెలుచుకుంది. ఛాంపియన్‌షిప్‌లలో ఇది భారతదేశానికి ఏకైక పతకం. మహిళల ఆసియా కప్‌లో భారత మహిళల ఐస్ హాకీ జట్టు మలేషియా, కిర్గిజాజన్ వంటి జట్లను ఓడించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. సౌత్ అమెరికా కప్‌లో భవాని 5 కి.మీ ఈవెంట్‌లో కాంస్యం సాధించి క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో అంతర్జాతీయ పతకం గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా నిలిచింది. నవంబర్‌లో, చెన్నైకి చెందిన 23 ఏళ్ల అనుపమ రామచంద్రన్, ప్రపంచ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా నిలిచింది. ఢాకాలో జరిగిన మహిళల కబడ్డీ ప్రపంచ కప్ టైటిల్‌ను భారత మహిళలు విజయవంతంగా నిలబెట్టుకున్నారు. శీతల్ దేవితో వరల్డ్‌లోనే ప్రపంచ టైటిల్ గెలుచుకున్న తొలి మహిళా చేతులు లేని ఆర్చర్‌గా నిలిచింది.



## టెస్ట్‌ల్లో బుమ్రా నం.1
### టాప్ 10లో శుభ్‌మాన్ గిల్

**న్యూఢిల్లీ:** ఐసిసిటెస్ట్ ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా నంబర్ 1 స్థానాన్ని నిలబెట్టుకోగా, బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మాన్ గిల్ టాప్ 10లోకి ప్రవేశించాడు. బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఒక స్థానం మెరుగుపరుచుకుని కొత్త ప్రపంచ నంబర్ 2 టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్ సందర్భంగా రెండు ఇన్నింగ్స్‌లలో నలుగురు ఇంగ్లీష్ బ్యాటర్లను ఔట్ చేసిన ఎడమచేతి వాటం బౌలర్ 843 రేటింగ్ పాయింట్లను కలిగి ఉన్నాడు. భారత్‌కు చెందిన్ బుమ్రా ప్రపంచంలోనే అత్యుత్తమ టెస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. అహ్మదాబాద్‌కు చెందిన 32 ఏళ్ల ఈ ఫాస్ట్ బౌలర్ ర్యాంక్‌లో 879 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1 స్థానంలో ఉన్నాడు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ 2025-26 సిరీస్‌లో ఒకే ఒక టెస్ట్ ఆడిన పాట్ కమ్మిన్స్ రెండు స్థానాలు దిగజారి ఇప్పుడు 4వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన గస్ అట్కిన్సన్ 4 స్థానాలు మెరుగుపరుచుకుని ఇప్పుడు 12వ స్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఐదు పరుగులతో మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్ విజయానికి కారణమైన జోష్ టంగ్యూ 13 స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నాడు. ఇక టెస్ట్ బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో హ్యారీ బ్రూక్ మూడు స్థానాలు ఎగబాకి రెండవ స్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ రెండు స్థానాలు దిగజారి ఐదవ స్థానంలో ఉన్నాడు. ఎంసిజి టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ రాణించకపోవడంతో అలెక్స్ కారీ కూడా 4ర్యాంకులు దిగజారాడు. అయితే, కారీ ఓటమి భారత కెప్టెన్ శుభ్‌మాన్ గిల్‌కు సహాయపడింది. అతను టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం ఎగబాకి 10వ స్థానానికి చేరుకున్నాడు.

## విజయ్ హజారే ట్రోఫీలో వరుస శతకాలతో పడిక్కల్, రుతురాజ్

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ-2025లో టీమిండియా యువ బ్యాటర్, కర్నాటక స్టార్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్ భయంకరమైన ఫామ్‌లో ఉన్నాడు. నాలుగు మ్యాచ్‌లో 3 శతకాలతో శతక మోత మోగించాడు. బుధవారం పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో 116 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 113 పరుగులు చేసిన అతను జార్ఖండ్ (147), కేరళపై (124) కూడా శతకాలు బాదాడు. తాజా శతకంతో లిస్ట్-ఏ క్రికెట్‌లో పడిక్కల్ శతకాల సంఖ్య 12కి చేరింది. పడిక్కల్ కేవలం ఇన్నింగ్స్‌లోనే 12 శతకాలు, 12 అర్ధ శతకాలతో 80కి పైగా సగటుతో 2,300 పైచిలుకు పరుగులు చేశాడు. పుదుచ్చేరితో మ్యాచ్‌లో పడిక్కల్‌తో పాటు, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (132) కూడా సెంచరీలతో చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నాటక నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 363 పరుగుల భారీ స్కోర్




చేసింది. కర్నాటక ఇన్నింగ్స్‌లో పడిక్కల్, మయాంక్ సెంచరీలకు కరుణ్ నాయర్ (62) మెరుపు అర్ధ సెంచరీ కూడా తోడైంది. అలాగే బుధవారం నాటు జరిగిన మరో మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్, మహారాష్ట్ర స్టార్ ప్లేయర్ రుతురాజ్ గైక్వాడ్ (113 బంతుల్లో 124, 12 ఫోర్లు, 3 సిక్సులు) కూడా అద్భుత శతకంతో కదంతొక్కాడు. ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ ఈశతకం బాదాడు. జట్టు కష్టాల్లో ఉన్నపుడు (50-3) రుతురాజ్ బ్యాట్ నుండి ఈ క్లాసిక్ సెంచరీ వచ్చింది. రుతురాజ్ శతకం కారణంగా తొలుత బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర భారీ స్కోర్ (331-7) చేసింది. ఈ సెంచరీతో రుతురాజ్ తన లిస్ట్-ఏ శతకాల సంఖ్య 19కి పెంచుకున్నాడు. రుతురాజ్ ఇటీవలే దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలోనూ సెంచరీ చేశాడు.


# మూచువల్ ఫండ్స్ అసెట్ బేస్ రూ.81 లక్షలకోట్లు



**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** మూచువల్ ఫండ్స్‌లోని ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ పథకం సిప్స్ పెరగడంతో ఈ ఏడాది 14 లక్షలకోట్లు ఫండ్స్‌లో అసెట్‌బేస్ పెరిగింది. ఫండ్స్ నిర్వహణ ఆస్తులు మొత్తం నవంబరు చివరినాటికి 81 లక్షలకోట్ల రూపాయలుగా ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ మూచువల్‌ఫండ్స్ ఆంఫీ తెలిపింది. సంస్థ సిఇఒ వెంకట్ చలసాని మాట్లాడుతూ ఫండ్స్ తీరు సానుకూలంగా ఉందని, సిప్ పట్టుబడులు పెరుగుతుండటం, విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసినా సిప్ పెట్టుబడులు భర్తీచేసినట్లు చెప్పారు. దీనితో మార్కెట్లలో ఫండ్స్ సానుకూలంగా కొనసాగాయి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను కీలకంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లు ఎక్కువగా లార్జ్‌క్యాప్, విభిన్న రంగాలకు విస్తరించడంతోపాటు హైబ్రిడ్ వ్యూహాలు అనుసరించారు. 2025 కూడా పెట్టుబడరలు ఏడు లక్షలకోట్లు వచ్చాయి. ఇన్వెస్టర్ల బేస్ కూడా 3.36 కోట్లకు పరిగింది. సిప్ విభాగం ఒక్కటే రూ.3 లక్షలకోట్లను రాబట్టాయి. అ పెట్టుబడుల రాకతోనే ఆంఫీ నిర్వహణ ఆస్తులు 21శాతంపెరిగి 2024లో ఉనన 61 లక్షలకోట్ల రూపాయలనుంచి రూ.81 లక్షలకోట్లకు చేరుకున్నట్లు వెంకట్ వివరించారు.

దీర్ఘకాలిక పెట్టుబడుల ట్రెండ్‌మాత్రం పటిష్టంగా ఉందని, 2022లో ఏడుశాతం వృద్ధి ఉందని, 2021లో 22శాతం వ1ద్ధి నమోదుచేసి సమిష్టిగా అసెట్‌బేస్‌కు రూ.50 లక్షలకోట్లు జతచేసినట్లు తేలింది. రెండేళ్లపాటు క్షీణించిన తర్వాత 13వ సారి వరుసగా వార్షిక పద్ధతిలో నిర్వహణ ఆస్తులుపెరిగాయి. ఎక్కువగా దీర్ఘకాలిక పెట్టుబడులకే మొగ్గచూపించారు. ఈ మొత్తంలో 3.22 లక్షల కోట్లు ఈక్విటీ ఆధారిత స్కీమ్‌లలోకి వచ్చాయి. 3 లక్షలకోట్లు డెట్ పథకాల్లోకి మళ్లాయి.

# ఆర్థికలోటు రూ.9.77 లక్షల కోట్లు!
### బడ్జెట్ అంచనాల్లో 62.3%




**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** ప్రభుత్వ ఆర్థికలోటు ఏప్రిల్ నవంబరు మధ్య కాలంలో రూ.9.77 లక్షలకోట్లకు చేరింది. అంటే బడ్జెట్ అంచనాల్లో 62.3 శాతానికి చేరింది. ఏటికేడాది 28శాతం చొప్పున పెరిగినట్లు కాగ్ ప్రకటించింది. స్థూల పన్ను రాబడులు 3.3శాతం పెరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 3.3శాతం పెరిగాయి. నికర పన్ను రాబడులు అదే కాలంలో 3.4 శాతంతగ్గాయి. బడ్జెట్ అంచనాల్లో 49.1 శాతం మేర చేరుకున్నట్లు కాగ్ వివరించింది. అంతకుముందు యేడాది ఏప్రిల్ నవంబరు మధ్యకాలంలో అయితే 56శాతం బడ్జెట్ అంచనాలను చేరుకున్నట్లు కాగ్ గుర్తించింది. పన్నేతర రాబడులు 20.8 శాతంగా పెరిగాయి. బడ్జెట్ అంచనాల్లో 88.6శాతంకు చేరాయి. అదే గత ఏడాది బడ్జెట్ అంచనాల్లో కేవలం 78శాతంమాత్రమే లక్ష్యాలు సాధిం చాయి. ఐజిఎస్టీ సెటిల్‌మెంట్లు కూడా కొంత స్థూల పన్నురాబడులకు విఘాతం కలిగించాయి. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో రూ.1.5 లక్షలకోట్లు కొరత ఉండవచ్చని కూడా ఇక్రా ఆర్థికవేత్త అదితినాయర్ అన్నారు. ఇక మొదటి ఎనిమిదినెలల్లో మూలధనవ్యయంరూ.6.58 లక్షలకోట్లకు చేరింది. అంటే బడ్జెట్ అంచనాల్లో 59శాతంగాఉంది. అంతకుముందు యేడాది ఏప్రిల్ నవంబరు మధ్యకాలంలోచూస్తే కేవలం 49శాతంమాత్రమే లక్ష్యాలు సాధించాయి. ప్రభుత్వ రెవెన్యూవ్యయం బడ్జెట్ అంచనాల్లో 57.5 శాతంగా ఉంది. గతయేడాది 60శాతంగాఉన్న ఈవ్యయం కొంత మేర తగ్గింది. కార్పొరేట్లు ముందస్తుపన్నులు చెల్లింపులు కొంతమేర భర్తీ చేసాయి. ఎందుకంటే హేతుబద్ధీకరణతో జీఎస్టీ రాబడులు కొంతమేర తగ్గాయి.

# 'ఎక్స్-ఎఐ' విస్తరణకు మస్క్ భారీ వ్యూహం



**న్యూయార్కు, డిసెంబరు 31:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన ఎఐ సామ్రాజ్యాన్ని మరింత వేగంగా విస్తరిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ఆయన స్థాపించిన ఎక్స్‌ఎఐ సంస్థ అమెరికాలో మరో భారీ భవనాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటికే మెమ్ఫిస్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ కొత్త భవనానికి మాక్రోహార్డం అని పేరు పెట్టినట్లు మస్క్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఈ కొనుగోలుతో తమ ఎఐ ట్రైనింగ్ కంప్యూటింగ్ సామర్థం దాదాపు 2 గిగావాట్లకు చేరుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా ఒక గిగావాట్ విద్యుత్ సుమారు 7.5 లక్షల ఇళ్లకు సరిపోతుంది. దీన్ని బట్టి మస్క్ ఎఐ డేటా సెంటర్ల సామర్థం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కొలోసస్ 2 ఫెసిలిటీకి ఆనుకుని ఉంది. ఇప్పటికే మస్క్ మెమ్ఫిస్‌లో కొలోసస్ పేరుతో ఒక డేటా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించాలన్నది మస్క్ లక్ష్యం. భవిష్యత్తులో 5.50 లక్షల ఎన్విడియా చిప్‌లను వినియోగించనున్నట్లు గతంలోనే ప్రకటించారు. మరోవైపు, ఎక్స్‌ఎఐ సంస్థ విలువను 230 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతూ భారీగా నిధుల సమీకరణకు మస్క్ చర్చలు జరుపుతున్నారు. ఇటీవల కోర్టు తీర్పుతో టెస్లా స్టాక్ ఆప్షన్లు తిరిగి మస్క్ చేతికి రావడంతో ఆయన సంపద ఏకంగా 750 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించే దిశగా మస్క్ దూసుకుపోతున్నారని ఫోర్బ్స్ అంచనా వేసింది. ఇదే సమయంలో వికీపీడియాపై మస్క్ మరోసారి సెటైర్లు వేశారు. వికీపీడియా పక్షపాత ధోరణితో ఉందని, దానికి ప్రత్యామ్నాయంగా తాము తీసుకొస్తున్న గ్రోక్‌పీడియా మరింత కచ్చితత్వంతో, విస్తృత సమాచారంతో ఉంటుందని కితాబునిచ్చుకున్నారు.

# నష్టాలనుంచి సెన్సెక్స్, నిఫ్టీ రికవరీ





**ముంబయి, డిసెంబరు 31:** దేశీయ ఈక్విటీ సూచీలు బుధవారం కొంతమేర లాభాల్లోనే ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 545.52 పాయింట్లు పెరిగి 85,220.60 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ 190.75 పాయింట్లుపెరిగి 26,129.60 పాయింట్లకు చేరింది. గడచిన నాలుగు సెషన్లలో 0.91శాతం నష్టపోయింది. జెఎస్ డబ్ల్యు స్టీల్4.88శాతంపెరిగిగే రిలయన్స్ 1.9శాతం, టైటాన్ కంపెనీ 1.86 శాతం చొప్పున నిఫ్టీలో పెరిగాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.01శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.19 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా చూస్తే బిఎస్ఇలో 2799 కంపెనీల షేర్లు పెరిగితే 1413 షేర్లు క్షీణించాయి. 169 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. సెన్సెక్స్ ఈ యేడాది ఇప్పటివరకూ 9.06 శాతంపెరిగింది. నిఫ్టీ 50 సూచీ కూడా 10.51శాతం పెరిగినట్లు తేలింది. ప్రత్యేకించి బ్యాంక్ నిఫ్టీ 17.15 శాతం

## స్టీల్ కంపెనీల షేర్లు పైపైకి

పెరిగింది. ఇక మిడ్‌క్యాప్‌సూచీ 1.1శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 6.62శాతం చొప్పున 2025లో పెరిగినట్లు తేలింది. పదేళ్ల ఫెడరల్ బాండ్లు 0.02శాతంపెరిగి 6.577కి చేరాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 89.85వద్ద ఊగిసలాడింది. ముందురోజు 89.75వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదు సెటిల్‌మెంట్ నాటికి 0.82శాతం క్షీణించి రూ.1,35,542కి చేరాయి.

కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురుదరలు మార్చి సెటిల్‌మెంట్లకుగాను 11 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 61.44డాలర్లుగా కొనసాగింది. ఇక స్టాక్స్‌పరంగా హెచ్‌పిసిఎల్ 6.56శాతం, గుజరాత్ గ్యాస్ 5.63శాతం, గుజరాత్ పెట్రోనెట్ 4.26శాతం, బిపిసిఎల్ 3.78శాతం, ఆయిల్ ఇండియా 3.29శాతం ఐఒసి 2.95శాతంచొప్పున పెరిగాయి. ఒఎన్‌జిసి 2.46శాతం, మహానగర్ గ్యాస్ 2.22శాతం, క్యాస్ట్రాల్ ఇండియా 2.09శాతం, ఏజీస్ లాజిస్టిక్స్ 2శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.90శాతం, ఇంద్రప్రస్త గ్యాస్ 1.76శాతం, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జి 1.52శాతం, గెయిల్ ఇండియా 0.80శాతం ఆదాని టోటల్‌గ్యాస్ 0.35శాతం చొప్పున పెరిగాయి. ఉక్కు దిగుమతులపై సుంకాలు 12శాతం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో స్టీల్‌కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. జెఎస్‌డబ్ల్యుస్టీల్ 4.89శాతం, జిందాల్‌స్టీల్ 2.75శాతం, టాటాస్టీల్ 2.45శాతం, జిందాల్‌స్టెయిన్‌లెస్‌స్టీల్ 0.15శాతం పెరిగాయి.



# చైనా ఉక్కు దిగుమతులపై సుంకాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఉక్కు దిగుమతులపై పన్ను విధిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న చౌక ఉక్కు ఉత్పత్తులే లక్ష్యంగా ఈనిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి అవుతున్న పలు చౌక స్టీలుఉత్పత్తులపై 12 శాతం పన్ను విధించింది. స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులకు కూడా ఇది వర్తిస్తుంది. దేశీయంగా ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయంతో చైనాకు షాక్ తగలనుంది. అక్కడి నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులు తగ్గనున్నాయి. చైనా, వియత్నాం, నేపాల్ దేశాలకు ఈసుంకాలు వర్తించనుండగా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కేంద్రం మినహాయింపు ప్రకటించింది. కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం స్టీలు ఉత్పత్తులపై దిగుమతి సుంకం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. తొలి ఏడాది 12 శాతం పన్ను, రెండో ఏడాది 11.5 శాతం, మూడో ఏడాది 11 శాతం పన్ను వసూలు చేయనున్నట్లు పేర్కొంది. స్టీల్ దిగుమతులు గణనీయంగా పెరగడంతో దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం కలుగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డిజిటిఆర్) తెలిపింది.

# యేడాది చివరలో తగ్గిన వెండి బంగారం ధరలు
### తులం బంగారం రూ.1,36 లక్షలు
### కిలో వెండి రూ.2,39,395లు



**ముంబయి, డిసెంబరు 31:** యేడాది చిట్టచివరి ట్రేడింగ్ రోజున బులియన్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. రికార్డు స్థాయిలకు చేరిన బంగారం, వెండి ధరలు ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఈరోజు తగ్గు ముఖం పట్టాయి. ముఖ్యంగా వెండి ధరల్లో ఈ పతనం ఎక్కువగా నమోదైంది. ఎంసీఎక్స్ మార్కెట్‌లో ఉదయం ట్రేడింగ్‌లో మార్చి 2026 వెండి ఫ్యూచర్స్ ఏకంగా 4.63శాతం పతనమై కిలో రూ.2,39,395 వద్ద ట్రేడవుతోంది. ఫిబ్రవరి 2026 బంగారం ఫ్యూచర్స్ 0.51 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,35,973 వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాది ఆద్యంతం బంగారం, వెండి ధరలు పరుగులు పెట్టాయి. 2025లో దేశీయంగా స్పాట్ గోల్డ్ ధరలు ఏకంగా 76 శాతం పెరగగా, అంతర్జాతీయ మార్కెట్లో 70 శాతం లాభపడ్డాయి. 1979 తర్వాత బంగారం ఇంతలా పెరగడం అంటే ఇదే అత్యుత్తమ వార్షిక ప్రదర్శన కావడం విశేషం. ఇక, వెండి అయితే డిసెంబర్‌లోనే 24 శాతం పెరిగి, ఏడాదిలో మొత్తంగా 135 శాతం లాభపడింది. మెహతా ఈక్విటీస్ వైస్‌ప్రెసిడెంట్ రాహుల్‌కలంత్రీ స్పందిస్తూ.. రష్యా-ఉక్రెయిన్, వెనిజులా-అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, చైనా నావికా విన్యాసాల కారణంగా సురక్షిత విభాగాల్లో పెట్టుబడులకు ఆకర్షణ పెరిగింది. అయితే, వచ్చే ఏడాది వడ్డీ రేట్ల కోతపై ఫెడరల్ రిజర్వ్ అంచనాలు తగ్గడంతో లాభాలకు కళ్లెం పడిందని విశ్లేషించారు. వెండికి రూ.2,42,780 వద్ద మద్దతు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు మోతీలాల్ ఓస్వాల్ నివేదిక ప్రకారం.. గ్లోబల్ హబ్‌లలో నిల్వలు తగ్గడం, డెలివరీ ఒత్తిళ్లు వెండిలభ్యత కొరతను స్పష్టంగా సూచిస్తున్నాయని వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.